ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 5, జూన్ 2025

రెవెన్యూ డివిజన్ల వారీగా పంచాయతీల వివరాలు

డివిజన్	మండలాల సంఖ్య	స్పెషల్ గ్రేడ్	గ్రేడ్-1	గ్రేడ్-2	గ్రేడ్-3	500జనాభా ఉన్నవి
ఒంగోలు	12	03	38	85	92	02
కనిగిరి	13	01	15	86	175	03
మార్కాపురం	13	07	22	94	106	00
మొత్తం	38	11	75	265	373	05

అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల గుర్తింపునకు ప్రభుత్వం విస్తృత కసరత్తు చేస్తోంది. త్వరలోనే దీన్ని అమలులోకి తీసుకురానుండటంతో ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించి ఒకదశ పూర్తి చేసింది. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన దాని కన్నా ప్రస్తుత సర్కారు ఈ పథకం కింద ఇచ్చే మొత్తాన్ని భారీగా పెంచింది. గత ప్రభుత్వం కేంద్రంతో కలిసి రూ.13,500 ఇస్తే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు చేసింది. ఈ మొత్తం అనర్హులకు అందకుండా, అర్హులకు అన్యాయం జరగకుండా పలు జాగ్రత్తలు తీసుకొంటోంది. వివిధ దశల్లో వ్యవసాయ, రెవెన్యూ అధికారుల పరిశీలన జరుగుతోంది. ఈనెలలోనే పథకాన్ని అమలు చేసి రైతుల ఖాతాలలో నగదును జమ చేసేందుకు అంతా సిద్ధం చేస్తోంది.





రైతన్నకు భరోసా

అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల గుర్తింపునకు భారీ కసరత్తు

- ప్రభుత్వం నుంచి అందిన 5.31 లక్షల మంది భూ యజమానుల ఖాతాల పరిశీలన
- వారిలో పలు తేడాలు ఉన్న 42వేల ఖాతాల వివరాలు ఆయా తహసీల్దార్లకు అందజేత
- మిగిలిన 4.90 లక్షల ఖాతాల జాబితా సిద్ధం
- ప్రభుత్వానికి పంపిన వ్యవసాయ శాఖ
- కుటుంబ సర్వే ఆధారంగా నేరుగా ప్రభుత్వ స్థాయిలోనే పరిశీలన... జిల్లాలో ఈకేవైసీ
- ఆ తర్వాతే తుది జాబితా
- కుటుంబంలో ఒకరికే పథకం వర్తింపు
- కౌలు రైతులకు లేనట్లే!

ఒంగోలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకానికి రాష్ట్రప్రభుత్వం తన నిధులను కలిపి అన్నదాత సుఖీభవను అమలు చేయనుంది. పీఎం కిసాన్ పథకం కింద కేంద్రం ఏటా రూ.6వేల నగదును మూడు విడతలుగా రైతుల ఖాతాలకు జమ చేస్తోంది. దానికి మరో రూ.7,500 కలిపి గత వైసీపీ ప్రభుత్వం ఏటా రూ.13,500 రైతులకు ఇచ్చింది. అయితే ఈ మొత్తాన్ని రూ.20 వేలకు పెంచుతామని ఎన్నికల ప్రచార సమయంలో టీడీపీ ప్రకటించింది. ప్రస్తుతం ఏడాది పాలన పూర్తి సందర్భంగా ఈనెలలో అమలుకు నిర్ణయించింది. భారీగా పథకం నగదును పెంచడంతో లబ్ధిదారుల గుర్తింపులో పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందుకు సంబంధించి తొలిదశ ప్రక్రియ పూర్తయింది. అందులో వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఉన్న రైతు ఖాతాలను నేరుగా రాష్ట్రప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా జాబితాలను ప్రాథమిక పరిశీలన కోసం జిల్లాలకు పంపిం చింది. జిల్లాలో సుమారు 5.31లక్షల భూయజమానులు ఉన్నట్లు గుర్తించి స్థానికంగా ఉన్న డేటాతో సరిపోల్చి చూడాలని ఆదేశించింది.

ఆధార్, పేర్లలో తేడాలతో..

ప్రభుత్వం పంపిన జాబితాలను వ్యవసాయశాఖ, క్షేత్ర స్థాయిలోని రెవెన్యూ సిబ్బంది పరిశీలించగా అందులో

మిగతా 6వ పేజీలో

పంచాయతీలకు మహర్దశ

ఆదాయం, జనాభా ఆధారంగా విభజన

- పదివేల మంది ప్రజలు, రూ.కోటి పైన ఆదాయం ఉంటే డిప్యూటీ ఎంపీడీవోలు నియామకం
- గ్రేడ్ల కేటాయింపు, అభివృద్ధి పనులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ పంచాయతీలకు మహర్దశ వచ్చింది. రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లెసీమలపై ప్రత్యేక దృష్టి సారించింది. జనాభా ప్రాతిపదికన పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు గ్రేడ్‌లుగా విభజించాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలు 1 నుంచి 6 గ్రేడ్లు ఉండగా.. ప్రస్తుతం పది వేల జనాభా లేదా రూ.కోటికిపైగా వార్షిక ఆదాయం ఉండే వాటిని స్పెషల్ గ్రేడ్‌గా పరిగణించనుంది. మిగిలిన

మిగతా 6వ పేజీలో

గ్రేడ్‌ల వారీ పంచాయతీల వివరాలు

జిల్లాలో పదివేల జనాభా/రూ.కోటికిపైన ఆదాయం ఉన్న 11 పంచాయతీలను స్పెషల్ గ్రేడ్‌గా పరిగణించనున్నారు. 4వేల నుంచి 10వేల జనాభా, రూ.50లక్షల నుంచి కోటి మధ్య ఆదాయం ఉన్న పంచాయతీలు 75 ఉన్నట్లు గుర్తించారు. వీటిని గ్రేడ్-1 కింద పరిగణిస్తారు. 2వేల నుంచి 4వేల జనాభా ఉన్న 265 పంచాయతీలను గ్రేడ్-2 కింద చేర్చనున్నారు. 2వేల లోపు జనాభా ఉన్న 373, 500 లోపు జనాభా ఉన్న ఐదు పంచాయతీలను గ్రేడ్-3 కింద పరిగణించనున్నారు.





ప్లాస్టిక్ భూతం.. ఎన్నాళ్లీ ఘాతం!

- విచ్చలవిడిగా కవర్ల వాడకంతో పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్
- నిషేధం ఉన్నా విక్రయం
- నేడు ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

7వ పేజీలో

తప్పుతిప్పలు

- ఆధార్‌లో తప్పుల సవరణకు జనం అగచాట్లు
- నెట్ సమస్యతో వై.పాలెంలో నిలిచిన సేవలు
- 10 నుంచి 20 కి.మీ ప్రయాణం చేస్తున్న ప్రజలు
- రేషన్ కార్డుల కోసం భారీగా దరఖాస్తులు

6



ఒంగోలులోని అద్దంకి బస్టాండ్‌లో ఎన్టీఆర్ విగ్రహం ముందు కేక్ కట్ చేస్తున్న ఎంపీ మాగుంట, టీడీపీ, జనసేన నాయకులు

కూటమి పండుగ

ప్రజా తీర్పునకు ఏడాది పూర్తి

- టీడీపీ, జనసేన శ్రేణుల సంబరాలు
- పలుచోట్ల కేక్ కటింగ్‌లు

ఒంగోలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి గెలిచి ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా టీడీపీ, జనసేన శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. పలుప్రాంతాల్లో కేక్ కటింగ్‌లు, బాణసంచా కాల్చడంతోపాటు ముగ్గులు వేసి ఆనందం వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనకు చమరగీతం పాడుతూ ప్రజానీకం ఇచ్చిన తీర్పు గత ఏడాది జూన్ 4న వెల్లడైంది. జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ టీడీపీ కూటమి అనూహ్య విజయాలు సాధించి అధికారంలోకి వచ్చింది. అనంతరం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. కాగా కూటమికి పట్టం కడుతూ ప్రజాతీర్పు వెల్లడై బుధవారం నాటికి ఏడాది ముగియడంతో పెద్ద ఎత్తున ఆ పార్టీలు సంబరాలు చేసుకున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఈసందర్భంగా ఒక వైపు టీడీపీ, మరో వైపు జనసేన శ్రేణులు ఈ కార్యక్రమాలు నిర్వహించాయి. ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో బుధవారం ఉదయం కేక్ కట్ చేశారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. స్థానిక మంగమూరు రోడ్డులోని సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆ నియోజకవర్గ

మిగతా 6వ పేజీలో

జగన్ చెప్పాడు.. చేశామంతే!

నాయకులు తప్ప సామాన్యులు లేరు

- కదలని వైసీపీ కార్యకర్తలు
- పసలేని ప్రసంగాలతో తుస్
- కందుకూరు, పర్చూరులో తోలారు
- వెన్నుపోటు దినానికి స్పందన అంతంతే

విపక్ష వైసీపీ వివాదాస్పదమైన నినాదంతో చేపట్టిన వెన్నుపోటు దినం ఉమ్మడి జిల్లాలో మొక్కుబడిగా సాగింది. 'జగన్ చెప్పారు.. చేయక తప్పదు' అన్నట్లు కొన్నిచోట్ల కార్యక్రమాలను నిర్వహించారు. మరికొన్ని ప్రాంతాల్లో సర్వశక్తులొడ్డి పర్వాలేదనిపించారు. ఆపార్టీ నాయకుల్లో కదలిక కనిపించినా చాలామంది కార్యకర్తలు, సామాన్య ప్రజలు కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. తీవ్రంగా ప్రయత్నించి కార్యకర్తలను సమీకరించడం ద్వారా కందుకూరు, పర్చూరులో కార్యక్రమాలు ముందు వరుసలో ఉండగా, మిగిలిన చోట్ల సాదాసీదాగా జరిగాయి.



ఎర్రగొండపాలెంలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చంద్రశేఖర్, వైసీపీ నాయకులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రంలో గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెల్లడయ్యాయి. ఆ సందర్భంగా వెన్నుపోటు దినం పేరుతో బుధవారం నియోజకవర్గాల వారీ కార్యక్రమాల నిర్వహణకు వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చారు. ఆ నినాదమే వివాదాస్పదంగా మారింది. అయినా నియోజకవర్గాల వారీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసీపీ రాష్ట్ర నేతలు.. జిల్లా, నియోజకవర్గాల నాయకులపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. దీంతో వారం నుంచి ఆపార్టీ నాయకులంతా కార్యక్రమాన్ని విజయవంతం చేసే పనిలోనే నిమగ్నమయ్యారు. నాయకులను

మిగతా 6వ పేజీలో

సోలార్ ప్రాజెక్టుకు దొనకొండ మండలంలో భూముల పరిశీలన 7వ పేజీలో



స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్‌తో అధికారులు

వైట్ క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై దాడి

- ఎక్స్‌కవేటర్, టిప్పర్ స్వాధీనం
- వెలికితీసిన తెల్లరాయి సీజ్
- ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న అధికారులు

7 లో

మళ్లీ భగభగలు

40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు

- జిల్లాలో ఒక్కసారిగా పెరిగిన ఎండల తీవ్రత
- రుతుపవనాలు మందగించడంతో వాతావరణంలో మార్పు



ఒంగోలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాపై రోహిణి కార్తె ప్రభావం బుధవారం కనిపించింది. ఎండల తీవ్రత పెరిగింది. పలుచోట్ల 40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోతతో జనం అవస్థ పడ్డారు, సాధారణంగా రోహిణి కార్తెలో ఎండలు అధికంగానే ఉంటాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 నుంచి 45 డిగ్రీల వరకు నమోదవుతుంటాయి. అయితే ఈ ఏడాది వాతావరణం మారింది. రోహిణి కార్తెకు ముందు భారీగా వానలు కురిశాయి. కార్తె వచ్చాక కూడా జల్లులు పడ్డాయి. దీనికితోడు ఈసారి రుతుపవనాలు కూడా ముందే వచ్చాయి. దీంతో ఎండల ప్రభావం తొలుత కనిపించలేదు. వారంరోజుల పాటు సాధారణంగా ఈ సమయంలో ఉండే ఉష్ణోగ్రతలు దాదాపు ఆరేడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. ఒక రకంగా ఈ ఏడాది వేసవి ఇంతటితో ముగిసినట్లుగానే నాలుగు రోజుల క్రితం వరకు పరిస్థితి ఉంది. అయితే ముందుగా వచ్చి వేగంగా విస్తరించిన నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం మందగించినట్లు సమాచారం. దాని వల్ల పొడి

మిగతా 6వ పేజీలో

474 మందికి ఉద్యోగోన్నతులు

- ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు, పీఎస్ హెచ్‌ఎంలుగా అవకాశం
- సర్టిఫికెట్ల పరిశీలన

ఒంగోలు విద్య, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 474 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూలు అసిస్టెంట్లు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు లభించనున్నాయి. కొత్తగా పీఎస్ హెచ్‌ఎం పోస్టులు 105 మంజూరు కావడంతో ఎస్‌జీటీలను వాటిలో నియమించేందుకు అవకాశాలు మరింత పెరిగాయి. జిల్లాలో మిగులుగా తేలిన 509మంది స్కూలు అసిస్టెంట్లను పీఎస్ హెచ్‌ఎంలుగా నియమించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆమేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. వీరిలో 404 మంది స్కూలు అసిస్టెంట్లను మాత్రమే హెచ్‌ఎంలుగా నియమించారు. మిగిలిన 105 పోస్టులను ప్రస్తుతం ఎస్‌జీటీలకు ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేస్తున్నారు. మొత్తం 474 ఉద్యోగోన్నతుల్లో జిల్లా పరిషత్ యాజమాన్యంలోని హైస్కూళ్లు, యూపీ స్కూళ్లు, ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో 312మందికి, ప్రభుత్వ యజమాన్యంలోని పాఠశాలల్లో 98 మందికి, మునిసిపాలిటీల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న 37మందికి, ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 27మందికి లభించనున్నాయి. 172 పీఎస్ హెచ్‌ఎం పోస్టులు, 67 ఫిజికల్ డైరెక్టర్లు, స్కూలు అసిస్టెంట్లు తెలుగు 25, ఉర్దూ రెండు, హిందీ 29, ఇంగ్లీషు 22, గణితం (తెలుగు) 44, గణితం(ఉర్దూ) 2, ఫిజికల్ సైన్స్ (తెలుగు) 16, పీఎస్(ఉర్దూ) 4, బయోలాజికల్ సైన్స్ (తెలుగు) 40, బీఎస్ (ఉర్దూ) 3, సోషల్ (తెలుగు) 38, ఎస్ఎస్(ఉర్దూ) 1, స్పెషల్

మిగతా 6వ పేజీలో



సర్టిఫికెట్ల పరిశీలనను పర్యవేక్షిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

రైతన్నకు భరోసా

(5వ పేజీ తరువాయి)

42వేల పేర్లకు సంబంధించి ఆధార్ నంబరు, పేర్లు, ఇతరత్రా వాటిలో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. వాటి పరిశీలన కోసం వ్యవసాయశాఖ నుంచి తహసీల్దార్లకు అందజేశారు. వాటిలో అధికభాగం భూముల కొనుగోలు, అమ్మకాలు జరిగి మ్యుటేషన్లు జరగాల్సినవి ఉన్నట్లు సమాచారం. సజావుగా ఉన్న 4.90 లక్షల ఖాతాల జాబితాలను తిరిగి ప్రభుత్వానికి నివేదించారు. వాటిని ప్రభుత్వ స్థాయిలో కుటుంబ సర్వే ఆధారంగా పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. ఒక కుటుంబానికి ఒకరికే పథకం లబ్ధి అందజేస్తారు. జిల్లాలో ప్రభుత్వం నుంచి ఇచ్చిన 5.71 లక్షల ఖాతాలలో ఇంచుమించు సగానికిపైగా ఒకే కుటుంబంలో ఇద్దరి, ముగ్గురి పేర్లతో భూములు ఉన్నట్లు సమాచారం. దీంతో ఇప్పటికే సచివాలయాల సిబ్బంది ద్వారా ప్రభుత్వం నిర్వహించిన కుటుంబ సర్వేలో భూయజమానుల జాబితాల వివరాలను సరిపోల్చే చర్యలను ప్రభుత్వం చేపట్టింది.

వేలిముద్ర, ఐరిస్ ద్వారానే ఈకేవైసీ

నెలకు రూ.10వేల కన్నా అధికంగా పెన్షన్లు పొందే వారు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపన్ను చెల్లించేవారికి పథకం వర్తించదు. ఆధార్ సీడింగ్ ఆధారంగా ఇలాంటి వారిని గుర్తించే ప్రక్రియను ప్రభుత్వస్థాయిలోనే చేస్తున్నట్లు సమాచారం. అది పూర్తయిన తర్వాత ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం అర్హుల జాబితాలను తిరిగి జిల్లాలకు పంపిస్తారు. మళ్లీ ఆ జాబితాలలో పేర్లు ఉన్న వారందరికీ ఈకేవైసీ చేయాలి. అది కూడా గతంలో ఈక్రాప్ నమోదు, ఇతరత్రా వాటికి చేసిన తరహా సెల్‌ఫోన్ నంబర్ ఓటీపీతో ఈకేవైసీ చేసే అవకాశం లేదు. విధిగా సదరు లబ్ధిదారులుగా గుర్తించిన రైతుల వేలిముద్ర లేదా ఐరీస్ ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలి. దాని ద్వారా స్థానికంగా వ్యవసాయం చేయకుండా విదేశాలలో, ఇతర ప్రాంతాల్లో ఉండి ప్రభుత్వ లబ్ధి పొందే వారిని కట్టడి చేయనున్నారు.

కౌలు రైతు కార్డులు లేక దూరం

ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం వాస్తవ పట్టా భూముల యజమానులు, అటవీ భూముల హక్కు పత్రాలు ఉన్న వారికి మాత్రమే ఈ పథకం అందనుంది. కౌలు రైతులకు, దేవదాయ భూములు సాగు చేస్తున్న వారికి అందే అవకాశాలు లేవు. కౌలు రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నా అధికారికంగా కౌలుగుర్తింపు కార్డులు ఉన్నవారే అర్హులు, అలాంటి కార్డులు ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభ తర్వాత జారీ అవుతాయి. దానివల్ల తొలివిడతగా పథకం అందించే లబ్ధిదారులలో వారు ఉండే అవకాశం లేదు. జిల్లాలో పథకం లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి సిహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాకు అందించిన 5.31 లక్షల రైతు ఖాతాల పరిశీలన పూర్తిచేసి నివేదికలు తిరిగి ప్రభుత్వానికి ఇచ్చామన్నారు. తదుపరి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 2.48లక్షల మందికి పీఎం కిసాన్ పథకం అందుతుందని వారందరికీ అన్నదాత సుఖీభవ అందే అవకాశం ఉందన్నారు. ఇతరుల విషయంలో ప్రభుత్వం తదుపరి చర్యలకు అనుగుణంగా ఉంటాయన్నారు.

పంచాయతీలకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

పంచాయతీలను జనాభా ప్రతిపాదికతోపాటు ఆయా స్థాయిల ఆధారంగా గ్రేడ్లను కేటాయించాలని ప్రభుత్వం సూచించింది. అందుకుఅనుగుణంగా జిల్లా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు పంచాయతీలకు కార్యదర్శులు పనిచేస్తుండగా గ్రేడ్ల విభజన అనంతరం కొన్ని మార్పులు చేయనున్నారు. 10 వేల మంది జనాభా లేదా కోటికిపైగా ఆదాయం ఉండే పంచాయతీలకు ఇక నుంచి డిప్యూటీ ఎంపీడీవో(ఈవోపీఆర్డీ)లను ప్రభుత్వం నియమించనుంది.

ప్రభుత్వానికి నివేదికలు

మునిసిపాలిటీ తరహాలోనే నూతనంగా ఆయా పంచాయతీలకు ప్రణాళికలను రూపొందించి ఆదాయం పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు వచ్చే నిధులతోపాటు స్థానికంగానూ ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఆలోచన చేస్తోంది. అందులో భాగంగానే పంచాయతీ అధికారులు జిల్లాలోని 729 గ్రామ పంచాయతీలను విభజన చేశారు. ఆదాయ వనరులు, జనాభా, ప్రస్తుతం వస్తున్న ఆదాయాలను పరిగణనలోకి తీసుకొని గ్రేడ్లుగా విభజించారు. మొత్తం పంచాయతీల సమాచారంతో ప్రభుత్వానికి నివేదికలు సమర్పించినట్లు సమాచారం. అలా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి నివేదికలు వచ్చిన తర్వాత ప్రభుత్వం దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.

సోలార్ ప్రాజెక్టు భూముల పరిశీలన

దొనకొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): దొనకొండలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం ఎంపిక చేసిన ప్రభుత్వ భూములకు చెందిన పూర్తి వివరాలను ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ జిల్లా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. వెంకటకృష్ణారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దొనకొండలో దాదాపు ఐదు వేల ఎకరాల భూముల్లో 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందుకోసం ఎంపిక చేసిన రుద్రసముద్రం, మంగినపూడి, భూమనపల్లి గ్రామాల పరిధిలోని భూముల వివరాలను విచారించినట్లు తెలిపారు. ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన కరెంట్ ఇవ్వాలనే ధ్యేయంతో ఈ ప్రాంతంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రైతులతో రెవెన్యూ అధికారులు సంప్రదింపులు జరుపుతారని, అందరూ సహకరిస్తే త్వరలో ప్రాజెక్టు ఏర్పాటుకు అడుగులు ముందుకు పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. శ్రావణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆగిన లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

- బస్సు డ్రైవర్, ప్రయాణికురాలి దుర్మరణం
- 16మంది ప్రయాణికులకు గాయాలు
- యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలంలో ఘటన
- లారీడ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఘటన



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం వద్ద ప్రమాద దృశ్యం

చౌటుప్పల్ రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): చీకట్లో రోడ్డు మీద ఇండికేటర్లు వేయకుండా లారీని ఆపిన నిర్లక్ష్యం మూలంగా రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. డివైడర్ పక్కన ఆగివున్న లారీని ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ఆ బస్సు డ్రైవర్, ఓ ప్రయాణికురాలు దుర్మరణం పాలయ్యారు. ప్రయాణికుల్లో మరో 16 మందికి గాయాలయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం వద్ద ఈ ప్రమాదం జరిగింది. సీఐ మన్మథకుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏపీలోని నెల్లూరు జిల్లా కందుకూరు నుంచి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు మంగళవారం రాత్రి 9గంటలకు 40 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బుధవారం తెల్లవారుజామున 4.30 చౌటుప్పల్ మండలం ఖైతాపురం వద్ద ఈ బస్సు ప్రమాదానికి గురైంది. అక్కడ డివైడర్ పక్కన ఆగివున్న లారీని డ్రైవర్ గమనించకపోవడంతో బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందుభాగం నుజ్జునుజ్జయింది. బస్సు డ్రైవర్, జరుగుమల్లి మండలం చిరికురప్పాడుకు చెందిన మేడబలిమి కొండల్‌రావు(41), పొన్నలూరు మండలం పరిచూరివారిపాలెం గ్రామానికి చెందిన ప్రయాణికురాలు దండెబోయిన గోవిందమ్మ(47) అక్కడికక్కడే మృతిచెందారు. వీరితోపాటు మరో 16మంది ప్రయాణికులు గాయపడ్డారు. తీవ్ర గాయాలైన నలుగురు ప్రయాణికులను హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. ప్రకాశం జిల్లాకు చెందిన కుకూరి భుజంగరావు, బండారి వినోద, బుల్లిపాల సుజాత, వల్లపునేని సునీత, వంజ అంకమ్మ, జానాదుల మమత, వల్లపు శివమ్మ, నెల్లూరుకు చెందిన దేవల్ల జయమ్మ, దేవల్ల మల్లీశ్వరి, మాదినేని విజయ, అప్పనగిరి సురేశ్, అప్పనగిరి జ్యోతి, నాయుడు వెంకయ్య, నాయుడు రజిని, ఒంగోలుకు చెందిన బచ్చు మాల్యాద్రి, యనమల్ల మమతలకు గాయాలుకాగా, వీరిని చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఉప్పల్‌లో ఉంటున్న సోదరుడి గృహ ప్రవేశానికి వెళుతూ గోవిందమ్మ మృత్యువాత పడింది. ఈ ఘటనలో గోవిందమ్మ కుమార్తె స్వల్ప గాయాలతో బయటపడింది. ఈ ప్రమాదానికి లారీడ్రైవర్ నిర్లక్ష్యమే కారణం అని పోలీసులు నిర్ధారించారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు.


రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు ముందు భాగం



కొండల్‌రావు (ఫైల్), గోవిందమ్మ(ఫైల్)

జగన్ చెప్పాడు.. చేశామంతే!

(5వ పేజీ తరువాయి)

కదిలించడం, కార్యకర్తల వద్దకు వెళ్లటం, ప్రజలను సమీకరించడానికి సర్వశక్తులొడ్డారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా కార్యక్రమానికి సామాన్య ప్రజలు దూరంగా ఉన్నారు. బుధవారం అన్ని చోట్లా జరిగిన కార్యక్రమాలను పరిశీలించగా ముఖ్యమైన నాయకులు, వారి మాట కాదనలేని ద్వితీయశ్రేణి నాయకులు మాత్రమే పాల్గొనడం కనిపించింది. వైసీపీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు విశ్వప్రయత్నం చేసినా నాయకులు సామాన్య కార్యకర్తలు కదలకపోవడం చర్చనీయాంశమైంది.

డబ్బు, వాహనాలతో సమీకరణ

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జరిగిన కార్యక్రమాలను పరిశీలిస్తే పర్చూరు, కందుకూరులో కాస్తంత ఎక్కువసంఖ్యలో ఆ పార్టీశ్రేణులు పాల్గొన్న దాఖలాలు కనిపించాయి. పర్చూరులో 350 నుంచి 400 మంది వరకు నిరసన ర్యాలీకి హాజరుకాగా, కందుకూరులో 500 మంది పాల్గొన్నారు. అయితే ఈ రెండుచోట్ల ఆ మాత్రం కార్యకర్తల సమీకరణకు బాగా కష్టపడ్డారు. వాహనాలు ఏర్పాటు చేయడం, భోజనాలు ఏర్పాటులాంటి అదనపు చర్యలు ఎక్కువగా కనిపించాయి. పర్చూరుకు కొత్తగా ఇన్‌చార్జి అయిన మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో ఏర్పాటు చేసుకున్నారు. కందుకూరు ఇన్‌చార్జి మధుసూదన్ యాదవ్ మాజీ మంత్రి మహీధర్‌రెడ్డి సహకరించకపోయినా తనకు పట్టుందని నిరూపించుకునేందుకు సామ,దాన,భేద దండోపాయాలు ఉపయోగించి కార్యకర్తలను సమీకరించారు. కనిగిరిలో ర్యాలీకి కార్యకర్తల సమీకరణకు డబ్బులు పంపిణీ చేయడం విశేషం. మిగిలిన అన్ని ప్రాంతాలను పరిశీలిస్తే.. ఒక్కోచోట కనీసం 70 మంది నుంచి 250 మందికిలోపే కార్యక్రమాల్లో వైసీపీ శ్రేణులు పాల్గొన్నట్లు వెల్లడైంది. అసలు ఈ కార్యక్రమ నిర్వహణ కరెక్టు కాదేమో.. నినాదం కూడా బాగా లేదేమో అన్న అనుమానాలను కార్యక్రమాల్లో పాల్గొన వైసీపీ శ్రేణులు వ్యక్తం చేయడం విశేషం.

హడావుడి కార్యక్రమం

కూటమి భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేనలు బుధవారం సాయంత్రం విజయోత్సవ కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. అది ఆఖరు క్షణంలో హడావుడిగా పిలుపునివ్వడంతో అందుబాటులో లేక ఆ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఎక్కువచోట కార్యక్రమాల్లో పాల్గొనలేదు. నిర్వహించిన చోట స్థానికంగా ఉన్న కార్యకర్తలు కేకులు కట్ చేయడం, బాణసంచాలు పేల్చడం వంటి మొక్కుబడి కార్యక్రమాలు నిర్వహించారు.

మంత్రి పై అసత్య ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెబుతాం

- మాజీ మంత్రి సురేష్‌కు టీడీపీ నేతల హెచ్చరిక

సింగరాయకొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిపై నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ అసత్య ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెప్తామని టీడీపీ నేతలు హెచ్చరించారు. స్థానిక పార్టీ మండల కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి స్వామిపై సురేష్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కొండపి మండలం జాళ్లపాలెంలో జరిగిన ఘటనకు సంబంధించి సురేష్ కులాల ప్రస్తావన తీసుకొచ్చి స్వామి రాజకీయం చేస్తున్నారని అనడం సిగ్గుచేటని విమర్శించారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో మంత్రిగా వెలగబెట్టి దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు జరిగినా నోరుమెదపని సురేష్ ఇప్పుడు అవాకులు, చెవాకులు పేలుతున్నారన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే నిందితులపై పోలీసులు చర్యలు తీసుకుంటే వైసీపీ నాయకులు రోడ్డెక్కడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

తిరస్కరణ బేళ్ల సంఖ్యను తగ్గించాలి

- పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించిన ఆర్ఎం


పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎం లక్ష్మణరావు

కొండపి (టంగుటూరు), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతోపాటు, తిరస్కరణ బేళ్ల సంఖ్యను తగ్గించాలని వ్యాపారులు, వేలం కేంద్రం సిబ్బందికి ఆర్ఎం లక్ష్మణరావు సూచించారు. బుధవారం ఆయన టంగుటూరు పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వ్యాపారులు, వేలం కేంద్రం సిబ్బందితో మాట్లాడారు. మార్కెట్‌లో ఏ గ్రేడ్‌కు డిమాండ్ ఎక్కువ ఉందో ఆరకాన్ని రైతులు తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ఆలకూరుపాడు, రావివారిపాలెం, పాలేటిపాడు, జయవరం, అనంతవరం రైతులతో ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడి పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట వేలం మేనేజరు కేవీ రామాంజనేయులు, వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న ప్రదీప్‌కుమార్ తండ్రి రామకృష్ణ

అశ్రునయనాలతో బీఎస్ఎఫ్ జవాన్ అంత్యక్రియలు

సింగరాయకొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాండూరి ప్రదీప్‌కుమార్ అంత్యక్రియలు బుధవారం స్వగ్రామమైన పాకలలో ప్రజల అశ్రునయనాల మధ్య ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. బీఎస్ఎఫ్ 53 బెటాలియన్‌కి చెందిన ఆర్మీ సభ్యులు హాజరయ్యారు. గ్రామస్థులు కన్నీటి వీడ్కోలు పలికారు.

మెగా డీఎస్సీకి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

ఒంగోలు విద్య, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 6వ తేదీ నుంచి జరగనున్న మెగా డీఎస్సీకి అభ్యర్థుల కోసం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేస్తూ డీఈవో కిరణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ హెల్ప్‌డెస్క్ గ్రీవెన్స్ సెల్‌గా పనిచేస్తుంది. గ్రీవెన్స్‌సెల్ ఇన్‌చార్జిగా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శివకుమార్‌ను నియమించారు. గ్రీవెన్స్‌సెల్‌లో 97010 00346 శివకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ వరప్రసాద్ 99890 83446, ఇన్‌చార్జి ఏపీవో శేషయ్యను 99668 89788, సీనియర్ సహాయకులు పి.వెంకటేశ్వరరావు 9849546481 నెంబర్లతో సంప్రదించవచ్చని తెలిపారు.

'పేదల పక్షాన పోరాడేదే సీపీఐ'



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పేదల పక్షాన పోరాడేది సీపీఐ అని పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ 4వ నియోజకవర్గ మహాసభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. పేదలు, దళితులు, అట్టడుగు వర్గాలు, కార్మికులకు భూములు, ఇళ్ల స్థలాలు పంపిణీ చేయించడంలో సీపీఐ చేసిన ఉద్యమాలను గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ, రైతులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. సీపీఐ రాష్ట్ర సభ్యుడు అందె నాసరయ్య మాట్లాడుతూ.. కొత్తగా గ్రామ శాఖలు ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పెద్దన్న, కాశీం, కోటేశ్వరరావు, వీరయ్య, వెంకటరత్నం, వెంకటరెడ్డి పాల్గొన్నారు. తొలుత పార్టీ జెండాను నాసరయ్య ఆవిష్కరించారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని, మార్కాపురం జిల్లా కేంద్రం ప్రకటించాలని, నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీని పూర్తి చేయాలని, పేదలకు నివాస స్థలాలు మంజూరు చేయాలని మహాసభలో తీర్మానం చేసి ఆమోదించారు.

ఏడాదిపాలనలో అభివృద్ధికి అడుగులు

- ఎంపీ మగుంట

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ళకాలంలో నిర్వీర్యమైన రాష్ట్ర అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు భారీ మెజార్టీని ప్రజానీకం ఇచ్చారని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడటంతో పాటు ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. బుధవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎంపీ మాగుంట మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకొని పోతోందన్నారు. రానున్న రోజుల్లో టీడీపీని మరింత బలోపేతం చేసే దిశగా తనవంతు కృషి చేస్తానని మాగుంట తెలిపారు.

యరజర్ల కొండ వద్ద అక్రమ తవ్వకాలు

- గ్రావెల్ లారీలను అడ్డుకున్న రైతులు
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం


గ్రావెల్‌ను తరలిస్తున్న లారీని అడ్డుకున్న రైతులు

ఒంగోలు(రూరల్), జూన్4(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం యరజర్ల కొండను అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న లారీలను బుధవారం గ్రామానికి చెందిన పలువురు రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇష్టారీతిన తవ్వకాలతో యరజర్ల కొండను నామరూపాలు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. రాత్రీ పగలు తేడాలేకుండా అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గ్రావెల్ మాఫియా నుంచి భారీగా లంచాలు తీసుకుని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొండపై గల పెద్దపెద్ద వృక్షాలను సైతం నరికి వేస్తున్నారని, రైతులు సాగు చేసుకుంటున్న సొంత పట్టా భూములు పక్కనే కొండను అక్రమంగా తవ్వుతున్నారని, దీంతో పొలాలు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి పర్యావరణ పరిరక్షణ కోసం యరజర్ల కొండను కాపాడాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

మళ్లీ భగభగలు

(5వ పేజీ తరువాయి)

వాతావరణం ఏర్పడి మళ్లీ ఎండల తీవ్రత పెరుగుతోంది. జిల్లాలో రెండు, మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. బుధవారం తీవ్రత మరింత అధికమైంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ మండింది. జిల్లాలోని కొన్నిచోట్ల రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో రాష్ట్రంలోనే అత్యధికంగా ఒంగోలు నగరంలో 38.80 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైంది. మూడు గంటలకు జిల్లాలోని ఇతర ఐదారు చోట్ల 40 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. దాదాపు పది ప్రాంతాలకుపైగా 39 నుంచి 40 డిగ్రీలు నమోదయ్యాయి. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో జిల్లాలో అత్యధికంగా పామూరు మండలం బొట్లగుడూరులో 39.98 డిగ్రీలు నమోదైంది. ఇంచుమించు సగం ప్రాంతాల్లో 38 డిగ్రీలకుపైగా ఉన్నాయి. సాయంత్రం ఐదు గంటల వరకు చాలాచోట్ల ఎండల తీవ్రతకుతోడు ఉక్కపోత కూడా అధికంగా కనిపించింది.

జిల్లాలో మధ్యాహ్నం 3గంటల సమయంలో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతల వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	ఉష్ణోగ్రతలు (డిగ్రీలలో)
బొట్లగుడూరు(పామూరు)	39.00
చెరువుకొమ్ముపాలెం(పొన్నలూరు)	39.96
కంభాలపాడు(పొదిలి)	39.79
ఉప్పలపాడు(పొదిలి)	39.75
మద్దిపాడు	39.69
కొనకనమిట్ల	39.40
మాలెపాడు(పొన్నలూరు)	39.40
ఒంగోలు అర్బన్	39.40
బోదవాడు(పామూరు)	39.20
వెస్ట్‌కట్టకిందపల్లె (పామూరు)	39.20
పొదిలి	39.0

కూటమి పండుగ

(5వ పేజీ తరువాయి)


సంతనూతలపాడులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

నేతల సమక్షంలో బీఎన్ విజయకుమార్ కేక్ కట్ చేశారు. స్థానిక ప్రగతి కాలనీలో జనసేన వీరమహిళలు ముగ్గులు వేసి సంబరాలు నిర్వహించగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు. రాత్రి అద్దంకి బస్టాండు సెంటర్‌లో ఒంగోలు నియోజకవర్గ నాయకులు నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ మాగుంట, పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, మేయర్ గంగాడ సుజాతలు పాల్గొన్నారు. పెద్దఎత్తున బాణసంచాను కాల్చారు. మార్కాపురంలో టీడీపీ నేత కందుల రామిరెడ్డి నేతృత్వంలో అక్కడి ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు నిర్వహించారు. దర్శిలో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అలాగే కొమరోలులో గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, వైపాలెంలో అక్కడి టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబులు పాల్గొన్నారు. జిల్లాలోని పలు ఇతర ప్రాంతాల్లోనూ అక్కడి టీడీపీ, జనసేన శ్రేణులు సంబరాలు నిర్వహించాయి.

474 మందికి ఉద్యోగోన్నతులు

(5వ పేజీ తరువాయి)

ఎడ్యుకేషన్ పోస్టులు 8 ప్రస్తుతం ఉద్యోగోన్నతులు ద్వారా భర్తీచేస్తున్నారు. ఈ విషయమై డీఈవోను వివరణ ఎంత మందికి ఉద్యోగోన్నతులు ఇస్తున్నదన్నది ఇంకా ఖరారు కాలేదని చెప్పారు.

సర్టిఫికెట్ల పరిశీలన

స్కూలు అసిస్టెంట్లు, పీఎస్ హెచ్ఎం పోస్టులకు అర్హులైన సెకండరీ గ్రేడ్ టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం స్థానిక డీఆర్ఆర్ఎం హైస్కూలులో నిర్వహించారు. ఒక్కో దానికి ముగ్గురు చొప్పున 474 పోస్టులకు 1,422మంది ఎస్జీటీల సర్టిఫికెట్లు పరిశీలించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రత్యేక బృందాలు సర్టిఫికెట్లను పరిశీలించాయి. ఎస్జీటీల సర్వీసు రిజిస్టర్లు, విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలనను డీఈవో కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు.



ప్లాస్టిక్ భూతం.. ఎన్నాళ్లీ ఘాతం!

ప్లాస్టిక్ వినియోగానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణాభివృద్ధికి అవరోధాలుగా నిలుస్తున్నాయి. కాలువల్లో మురుగును కదలనీయడం లేదు. భూమిలోకి నీటిని ఇంకనీయడం లేదు. దీంతో భూగర్భ జల మట్టం తగ్గిపోతోంది. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించినా ఆచరణలో అమలుకాకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీలలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించారు. 50 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి హాని కలిగిస్తాయని, బట్ట సంచులను, కాగితపు కవర్లను మాత్రమే వినియోగించాలని అధికారులు పదేపదే హెచ్చరికలు జారీ చేస్తున్నా వ్యాపారులు, వినియోగదారులు పెడచెవిన పెడుతున్నారు. దీంతో గ్లోబల్ వార్మింగ్ పెరిగి పర్యావరణం ప్రమాదంలో పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. భవిష్యత్ తరాలు మరింత ఇబ్బందుల్లో పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జూన్ 5 ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.
- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

- విచ్చలవిడిగా కవర్ల వాడకంతో పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్
- నిషేధం ఉన్నా వ్యాపారుల విక్రయం
- నేడు ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం



ప్లాస్టిక్ నివారణతోనే పర్యావరణ పరిరక్షణ

వాణిజ్య, వ్యాపారం రంగంలో వేగవంతంగా విస్తరిస్తున్న జిల్లా రోజురోజుకూ మరింత అభివృద్ధి చెందుతోంది. అన్నిరకాల యంత్రాలు, వస్తువులు, నిత్యవసర సరుకులు, ఇతరత్రా సామగ్రి లభ్యమవడంతో వేలాది మంది ప్రజలు నిత్యం ఏదో ఒకటి కొనుగోలు చేస్తూనే ఉంటారు. దీంతో ప్లాస్టిక్ వినియోగం మరింత పెరిగింది. అయితే పర్యావరణానికి ప్రధాన శత్రువుగా, ఏళ్లు గడిచినా మట్టిలో కలిసిపోని కాలుష్య కర్బనం (పాలిథిన్) గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. రోజురోజుకూ టన్నులకొద్దీ సేకరిస్తున్న చెత్తలో ప్లాస్టిక్ కవర్లదే అగ్రస్థానం. దీనిని నిషేధించేందుకు ప్రభుత్వం 2006లో ప్రత్యేకంగా జీవో విడుదల చేసినా జిల్లాలో ఏ ఒక్క ప్రాంతంలోనూ అమలుకు నోచుకోవడం లేదు. ఒంగోలులో రోజూ 120 టన్నుల చెత్త సేకరణ జరుగుతుండగా అందులో సగానికిపైగా ప్లాస్టిక్ వ్యర్థాలే ఉండటం గమనార్హం.

● ప్లాస్టిక్ ప్రమాదం ఇలా...

భూమిలో కలవకుండా వందల ఏళ్లకొద్దీ అలాగే ఉండిపోయే ప్రమాదకర ప్లాస్టిక్ పాలిథిన్ కవర్ల సంగతి తెలియంది కాదు. మేతగా భావించి కేజీల కొద్దీ తింటున్న మూగజీవాలు మృత్యువాత పడుతున్న సందర్భాలు ఉన్నాయి. అన్నింటికీ మించి వర్షపు నీటిని భూమిలోకి ఇంకనీయకుండా అడ్డుకోవడం పెద్ద సమస్యగా మారింది. పలు శుభకార్యాలకు, ఫంక్షన్లకు, టీ, సాంబార్, పళ్ల రసాలు ఇలా ప్రతినిత్యం టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వినియోగం జరుగుతూనే ఉండగా వ్యాపారులు కూడా అదే స్థాయిలో విక్రయాలు జరుగుతున్నాయి.

● కార్పొరేషన్ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ

ప్రపంచ పర్యావరణం దినోత్సవం పురస్కరించుకుని ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఒంగోలులోని మినీ స్టేడియంలో ఉచితంగా పండ్ల మొక్కలు కలెక్టర్ తమీమ్ అన్సారీయా చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్‌పై సమర శంఖం పూరించాలని పిలుపునిచ్చారు. మార్పు ప్రజల నుంచే రావాలని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు, వ్యాపారులు కృషి చేయాలని కమిషనరు కోరారు.

తప్పుతిప్పలు!



వీరభద్రాపురంలో ఆధార్, రేషన్ కార్డుల కోసం వేచి ఉన్న ప్రజలు

- ఆధార్‌లో తప్పుల సవరణకు జనం అగచాట్లు
- ఫైబర్ నెట్ సమస్యతో వై.పాలెంలో నిలిచిన సేవలు
- 10 నుంచి 20 కి.మీ ప్రయాణం చేస్తున్న ప్రజలు
- రేషన్ కార్డుల కోసం భారీగా దరఖాస్తులు

ప్రతి పథకానికి ఆధార్ తప్పనిసరి ఆధార్‌లో తప్పులు ఉండటం, నూతన ఆధార్ కార్డుల కోసం ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఎర్రగొండపాలెం మండలంలోని వీరభద్రాపురం, గంజివారిపల్లి గ్రామాల్లోని గ్రామ వార్డు సచివాలయంలో ఆధార్ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో పదుల సంఖ్యలో గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలు ఆధార్‌లో తప్పులను మార్చుకునేందుకు వస్తున్నారు. ఆయా గ్రామాల పరిధిలో చెంచు గిరిజనులు ఎక్కువగా ఉన్నారు. వారి ఆధార్ కార్డులో ఎక్కువ శాతం తప్పులు ఉండటంతో సంక్షేమ పథకాలు అందడం లేదు. దీంతో ఆధార్ సెంటరుకు చెంచు గిరిజనులు పరుగులు పెడుతున్నారు. వైపాలెంలో ఉన్న ఆధార్ సెంటరు పని చేయకపోవడంతో ఈ రెండు కేంద్రాలకు ప్రజలు ఎక్కువ శాతం వస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. అయితే సర్వర్ సరిగా పనిచేయక పనులు అలస్యం అవుతున్నాయని డీఏలు తెలిపారు. - ఎర్రగొండపాలెం రూరల్, (ఆంధ్రజ్యోతి)

రేషన్ కార్డుల కోసం..



గంజివారిపల్లిలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న డీఏ

గత వైసీపీ పాలనలో నూతన రేషన్ కార్డులు మంజూరు చేయలేదు. గ్రామీణా ప్రాంతాల ప్రజలు ఎక్కువ మంది రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తూన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నూతన రేషన్ కార్డులు, ఉన్న కార్డుల్లో మార్పులకు అవకాశం కల్పించింది. దీంతో గ్రామ వార్డు సచివాలయంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు భారీగా చేసుకుంటున్నారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకునే సమయంలో ఆధార్‌లో తప్పులు ఉండటంతో వాటిని సరిచేసుకొని వీరభద్రాపురం, గంజివారిపల్లి గ్రామాల ప్రజలు తిప్పలు పడుతున్నారు.

మండలంలో 6 ఆధార్ కేంద్రాలు

మండలంలో 6 ఉచిత ఆధార్ నమోదు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎర్రగొండపాలెం 1, 2, గంగాపాలెం, వీరభద్రాపురం, గంజివారిపల్లి, అమానిగుడిపాడులలో సెంటర్లలో ఆధార్‌లో మార్పులు చేస్తున్నారు. అయితే ఎర్రగొండపాలెం1లో సిబ్బంది లేకపోవడం, ఎర్రగొండపాలెం 2లో ఏదో సమస్యతో తరచు మూతవేయడం సాధారణమైందని పట్టణ ప్రజలు తెలిపారు. దీంతో సమీప సెంటరు అయిన వీరభద్రాపురం, గంజివారిపల్లి గ్రామాల్లోని సెంటరుకు పరుగులు పెడుతున్నారు. ఈ రెండు సెంటర్‌లకు వెళ్లాలంటే 10 కిమీ నుంచి 18 కిమీ వెళ్లాల్సి వస్తోందని ప్రజలు అంటున్నారు. ఈ విషయంపై వై పాలెం 2 సచివాలయం డీఏను వివరణ కోరగా ఫైబర్ నెట్ సమస్యతో ఆధార్ సెంటర్ సైట్ రావడం లేదని తెలిపారు.

అక్కడ పనిచేయక ఇక్కడికి వచ్చాం



ఎర్రగొండపాలెం పట్టణంలోని సచివాలయం 2లో ఉన్న ఆధార్ కేంద్రానికి వెళ్లాం. అక్కడ పని చేయడం లేదంటే గంజివారిపల్లి సచివాలయంలోని కేంద్రానికి వచ్చాం. కూతురు నాగలక్ష్మి ఆధార్ కోసం వచ్చాం. వై.పాలెంకు వీరయపాలెం దగ్గర. అక్కడ పనిచేయకపోవడంతో 18 కిమీ దూరం రావాల్సి వచ్చింది.

- నలబోతుల వీరాంజనేయులు (వీరయపాలెం)

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- హౌసింగ్ కాలనీ పరిశీలన

మార్కాపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పురోగతిలో ఉన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మండలంలోని ఇడుపూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న హౌసింగ్ కాలనీని కలెక్టర్ అన్సారియా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గృహ నిర్మాణ శాఖాధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పలు దశల్లో ఉన్న గృహాల లబ్ధిదారులతో మాట్లాడి వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీకి 2,310 గృహాలు మంజూరు కాగా, ఇప్పటికి కేవలం 154 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని అన్నారు. రూఫ్‌స్థాయిలో 37, రూఫ్‌కాస్ట్ స్థాయిలో 430, బీఎల్ స్థాయిలో 519 గృహాలున్నట్లు హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ ద్వారా తెలుసుకుని, వాటిని పూర్తి చేసేందుకు అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని కలెక్టర్ ఆదేశించారు. యూనిట్ విలువ రూ.1.80 లక్షలకు ఎస్సీ, బీసీలకు మరో రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ఆదివాసి గిరిజనులకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం అదనంగా అందిస్తోందని తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి రూఫ్, రూఫ్‌కాస్ట్ స్థాయిలో ఉన్నవాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా చూడాలన్నారు. కలెక్టర్‌తోపాటు మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, హౌసింగ్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



గృహాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

1.90 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

- డ్వామా పీడీ జోసెఫ్ కుమార్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకొని జిల్లా వ్యాప్తంగా డ్వామా ఆధ్వర్యంలో 1.90 లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నట్లు డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ తెలిపారు. అందుకోసం ఒక్కొక్క మండలంలో ఐదువేల మొక్కలు నాటేందుకు ఉపాధి కూలీలతో గుంటలు తీస్తున్నట్లు తెలిపారు. ఉపాధి పథకం ద్వారా గ్రామాల్లో పూర్తి చేసిన ఫారంపాండ్స్, గట్లు, ప్రభుత్వ సంస్థలు, స్కూలు, కాలేజీలు, ఆస్పత్రులు, పొలంగట్లు, ప్రభుత్వ బంజురు భూములు, దేవుని భూముల్లో ప్లాంటేషన్, గ్రామాల్లో రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అందుకోసం అప్పటికే మండల అదనపు ప్రోగ్రాం ఆఫీసర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అటవీ, సామాజిక, ఉద్యానవనశాఖ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జోసెఫ్‌కుమార్ తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వెన్నుపోటు అంటే గొడ్డలి వేటు

- ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కొమరోలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వెన్నుపోటు అంటే బాబాయిని గొడ్డలి వేటుతో చంపడమే కదా అని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కొమరోలులోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వెన్నుపోటు దినం పేరుతో వైసీపీ నాయకులు రోడ్డెక్కడం చూస్తున్న ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. బాబాయిని గొడ్డలిపోటుతో చంపిన జగన్ వెన్నుపోటు పేరుతో రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తల్లిని వెళ్లగొట్టి, చెల్లి ఆస్తిని కాజేయాలని చూస్తున్న జగన్‌ది వెన్నుపోటు కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంటే చూసి ఓర్చుకోలేక వెన్నుపోటు దినాలంటూ జగన్ కార్యక్రమాలు చేయడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ప్రజా ప్రభుత్వ పాలన ఏడాదైన సందర్భంగా ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు.

1590 మంది ఎస్ఏలకు తప్పనిసరి బదిలీ

- నేడు బదిలీల ఉత్తర్వులు

ఒంగోలు విద్య, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలలు, హైస్కూళ్లలో పనిచేస్తున్న స్కూలు అసిస్టెంట్లు (సబ్జెక్టు టీచర్లు) తప్పనిసరిగా బదిలీ కానున్నారు. బదిలీల కోసం స్కూలు అసిస్టెంట్లు 2929 మంది దరఖాస్తులు చేసుకోగా వీరిలో 1590 మంది తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉండగా 1339 మంది అభ్యర్థన మేరకు బదిలీ కోసం దరఖాస్తు చేశారు. వీటిలో వివిధ కారణాలతో 14 మంది దరఖాస్తులను తిరస్కరించారు. దీంతో బదిలీకి 2915 మంది దరఖాస్తులు మిగిలాయి. స్కూలు అసిస్టెంట్ గణితం, పీఎస్, బీఎస్, సోషల్ సబ్జెక్టుల్లో 964 మంది, స్కూలు అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఇంగ్లీషు, సంస్కృతం, ఉర్దులో 676 మంది తప్పనిసరిగా బదిలీ కానున్నారు. వీరి స్థానాల కోసం అప్షన్లు పెట్టుకొనేందుకు బుధవారం సాయంత్రం ఐదు గంటలకు గడువు ముగిసింది. బదిలీ ఉత్తర్వులు గురువారం వెలువడనున్నాయి.

● 86 అభ్యంతరాలు

స్కూలు అసిస్టెంట్ల బదిలీల్లో పాయింట్ల కేటాయింపుపై 86 అభ్యంతరాలు/ఫిర్యాదులు వచ్చాయి. పదేపదే అభ్యర్థించినా తమకు స్పౌజ్ పాయింట్లు కలవులేదని కొందరు, మరికొందరు తాము రిక్వెస్టు బదిలీ కోసం దరఖాస్తు చేస్తే తమ స్థానాలు ఖాళీగా చూపిస్తున్నారని, ఎన్‌సీసీ తెలుగు స్కూలు అసిస్టెంట్లు తమకు ఖాళీలు కనిపించడంలేదని డీఇవోకు ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదులను కమిషనర్ కార్యాలయానికి పంపినట్లు డీఇవో కిరణ్‌కుమార్ తెలిపారు.

వైట్ క్వార్ట్జ అక్రమ తవ్వకాలపై దాడి

- ఎక్స్‌కవేటర్, టిప్పర్ స్వాధీనం
- వెలికితీసిన తెల్లరాయి సీజ్
- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న అధికారులు

పీసీపల్లి, జూన్4 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా తెల్లరాయిని వెలికితీసి సొమ్ము చేసుకుంటున్న అక్రమ క్వారీయింగ్‌పై అధికారులు దాడిచేశారు. రెవెన్యూ, అటవీశాఖ, మైనింగ్ అధికారులు మంగళవారం రాత్రి సంయుక్తంగా దాడులు చేసి యంత్రాలతో పాటు వెలికితీసిన తెల్లరాయిని స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మురుగుమ్మి సమీపంలోని అనాధీన భూములతో పాటు అటవీ భూముల్లోకి కొంతమంది అక్రమంగా ప్రవేశించి ఎటువంటి అనుమతులు లేకుండా యంత్రాలతో తెల్లరాయిని వెలికితీస్తున్నారు. వెలికితీసిన రాయిని వాహనాల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే కొంతమంది వ్యక్తులు ఈ విషయాన్ని అటు మైనింగ్ ఇటు అటవీ, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో మైనింగ్ అధికారి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో పోలిరెడ్డి తమ సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి అక్రమ క్వారీయింగ్ జరుగుతున్న ప్రాంతానికి మంగళవారం రాత్రి వెళ్లారు.

అక్కడ రాయిని వెలికితీస్తున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వెలికితీసి ఉన్న తెల్లరాయిని సీజ్ చేశారు. ఆ ప్రాంతంలో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



ఆలయంలో దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి లలిత్ సాగర్ దంపతులు



కొలువు దీరిన దేవతామూర్తుల విగ్రహాలు

భక్తులతో పులకించిన శ్రీనివాసనగర్

- రూ.కోటితో కోదండరామ స్వామి ఆలయం..
- దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన

ముండ్లమూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని శ్రీనివాస నగర్ ఒక కుగ్రామం. ఆ గ్రామంలో కోటి రూపాయల వ్యయంతో నాలుగు దేవాలయాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బుధవారం ఆ గ్రామంలో దేవాలయాల ప్రతిష్ఠా మహోత్సవం కావటంతో ఊరంతా జన సంద్రంతో పులకించి పోయింది. రూ.40 లక్షల వ్యయంతో శ్రీ కోదండ రామ ఆలయం, రూ.10 లక్షలతో పోలేరమ్మ ఆలయం, రూ.7 లక్షలతో అంకాళమ్మ ఆలయం, రూ.5 లక్షలతో బ్రహ్మంగారి దేవాలయంతో పాటు గంగమ్మ, ధ్వజ స్తంభం ప్రతిష్ఠా మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు గ్రామంలో పోటెత్తి పోయారు. రామ నామ స్మరణతో ఆలయం మారు మోగింది. కోదండ రామాలయం ఎదుట ధ్వజస్తంభాన్ని కూడా ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానిక చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్ని దేవాలయాల్లో దేవతా మూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం పూట ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

ఆలయంలో ప్రముఖుల పూజలు

శ్రీనివాస నగర్‌లో నాలుగు దేవాలయాల ప్రతిష్ఠ సందర్భంగా దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్ సాగర్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారిని సన్మానించింది. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● కోదండ రామాలయంలో ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి

సింగరాయకొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సింగరాయకొండ, ఉలవపాడు స్టేషన్ల మధ్య బుధవారం చోటుచేసుకుంది. మృతుడి వయసు 35 ఏళ్లు ఉంటాయని, ఆయన ఒంటిపై ఇటుకరంగు టీషర్ట్, లేత పచ్చరంగు జీన్స్ ప్యాంట్ ఉన్నాయని జీఆర్పీ ఎస్సై కె. మధుసూదన్‌రావు తెలిపారు. వివరాలు తెలిసిన వారు ఒంగోలు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మెగా డీఎస్సీని పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 6వతేదీ నుంచి జరగనున్న మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం రాత్రి సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో ఈనెల 6నుంచి 30వతేదీ వరకు ప్రతిరోజు రెండు సెషన్స్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం సెషన్ 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంటన్నర ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, జామంట్రీ బాక్సులు, బ్యాగులు, ఎలక్ట్రికల్ డివైజనర్లు నిషేధమని, ఏదైనా పీహెచ్‌సీ అభ్యర్థులు ఉంటతే స్క్రైబ్‌లిస్టులో పేరు లేదా దరఖాస్తులో ఆ వివరాలు లేకపోతే డీఈవోను సంప్రదించాలన్నారు. వారి అర్హత మేరకు స్క్రైబ్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభ్యర్థుల సమాచారం కోసం మెగా డీఎస్సీ గ్రీవెన్స్‌సెల్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. సమావేశంలో డీఈవో కిరణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంట కార్యాలయంలో వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎంపీ మాగుంట, మేయర్ సుజాత

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎంపీగా గెలుపొంది ఏడాది పూర్తయిన సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కట్ చేశారు. స్థానిక రామనగర్‌లోని కార్యాలయంలో బుధవారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ నాయకులు, వివిధవర్గాల ప్రజలు మాగుంటను కలిసి బొకేలతో పాటు శాలువలు కప్పి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, టీడీపీ నాయకులు తాతా ప్రసాద్, బెల్లం సత్యనారాయణ, కుప్పా రంగసాయి, అయినాబత్తిన ఘనశ్యాం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన మాగుంట

ఒంగోలు కలెక్టరేట్: కలెక్టర్ తమీమ్ అన్సారియాను బుధవారం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఆయన కలిసి ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు రకాల సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

ఒంగోలు క్రైం: స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ దామోదర్‌ను ఎంపీ మాగుంట మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ సీతారామయ్య, తాత ప్రసాద్, ఘనశ్యాం పాల్గొన్నారు.

వృద్ధుల ఇళ్లకు రేషన్ సరఫరా చేసిన జేసీ

సంతనూతలపాడు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : రేషన్‌షాపుల నుంచి వృద్ధులు, దివ్యాంగులకు రేషన్‌బియ్యాన్ని డోర్‌డెలివరీ చేయాలని ఆదేశించడంతో సంతనూతలపాడులో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ వృద్ధురాలికి రేషన్ బియ్యంఅందజేశారు. బుధవారం స్థానిక రేషన్‌షాపునెంబరు-4 పరిధిలోని మద్దులూరు రోడ్డులో నివాసం ఉంటున్న కె.ఆదెమ్మకు బియ్యాన్ని ఆయన అందించారు. ఈ సందర్భంగా జేసీ ఆమెతో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చే బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిక్షణ తరగతుల పరిశీలన

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో యోగాంధ్ర-కాంపిటేటివ్ తరగతుల్లో భాగంగా బుధవారం సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో పోటీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ పోటీల్లో సచివాలయ స్థాయి నుంచి వచ్చిన విజేతలు మండల స్థాయిలో తప్పనిసరిగా హాజరు కావాలని జేసీ సూచించారు.

ముగ్గులతో వీరమహిళల సంబరాలు



ముగ్గులను పరిశీలిస్తున్న పార్టీ నేతలు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలో జగన్ పాలన పీడ విరగడై ఏడాది పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ వీరమహిళలు కూటమి ప్రభుత్వం సుపరిపాలనకు ఏడాది అయిన సందర్భంగా ముగ్గులు వేసి సంబరాలు నిర్వహించారు. కృష్ణా పెన్నా ప్రాంతీయ కమిటీ సభ్యురాలు బొందిల శ్రీదేవి ఆధ్వర్యంలో ఒంగోలులోని ప్రగతికాలనీలో, పల్ల ప్రమీల ఆధ్వర్యంలో కమ్మపాలెంలో, సుంకరి కళ్యాణి ఆధ్వర్యంలో బండ్లమిట్టలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుపరిపాలనకు ఏడాది- పీడ విరగడై ఏడాది కార్యక్రమంలో భాగంగా వేసిన ముగ్గులను పార్టీ జిల్లా అధ్యక్షుడు, లైవ్ స్టాక్ బోర్డు చైర్మన్ షేక్ రియాజ్, పార్టీ నాయకుడు కందుల రవిశంకర్ తదితరులు పరిశీలించి అభినందించారు. కార్యక్రమం లో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంటపైనే అధికారం : డీటీ

నాగులుప్పలపాడు, జూన్4 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు పంటపైనే అధికారం ఉంటుందని, భూయజమాని హక్కులపై ఎలాంటి అధికారం ఉండదని డిప్యూటీ తహసీల్దార్ కె.వాసుదేవరావు సూచించారు. బుధవారం నాగులుప్పలపాడులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ భూయజమానులు కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలను ఇవ్వడం వల్ల ఇబ్బంది ఉండదన్నారు. భూమికి సంబంధించిన ఎటువంటి హక్కులు కౌలు రైతులకు ఉండవని, కేవలం పంట సాగు హక్కుపత్రం 11 నెలలు మాత్రమే చెల్లుబాటు అవుతుందని చెప్పారు. భూయజమానులు ఎలాంటి అపోహలు గురికావద్దని తెలిపారు. పంటలు సాగుచేసే ముందుగా రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని కేవీకే శాస్త్రవేత్త రమేష్‌బాబు సూచించారు. తొలకరి వర్షాలు కురుస్తున్నందున రైతులు సజ్జ, పచ్చిరొట్ట పంటల సాగుచేపట్టాలన్నారు. అన్నదాత సుఖీభవ, పంట నష్ట పరిహారాలు, పంటల బీమా పథకం సాగు హక్కు పత్రం పొందిన రైతులకు వర్తిస్తాయని ఏవో వెంకట్రావు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు ఆర్థికసాయం

మద్దిపాడు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి ప్రతిభ కనబరచిన బి.శ్రీలక్ష్మి, డి.దీక్షితలకు బుధవారం ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డి ఆధ్వర్యంలో పిన్నింటి శ్రీరాములు జ్ఞాపకార్థం వారి మనవడు, మనవరాలు కిషోర్, కళ్యాణి రూ.10వేలను అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కిషోర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చిన పాలనకు ఏడాది!

ఎంపీ మాగుంట ● ఒంగోలుతో పాటు పలుచోట్ల కూటమి శ్రేణుల సంబరాలు ● మిఠాయిల పంపిణీ



ఒంగోలులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ మాగుంట, శ్రేణులు



సింగరాయకొండలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఒంగోలులో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ మేరకు స్థానిక అద్దంకి బస్టాండ్‌సెంటర్‌లో భారీ కేక్ కట్ చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు, లైవ్ స్టాక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ రియాజ్ మాట్లాడారు. దుష్టపాలనకు ప్రజలు చరమగీతం పాడి ఏడాది పూర్తయిందని, ప్రజలు మెచ్చిన పాలన, సుపరిపాలన రాష్ట్రంలో కొనసాగుతుందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఏడాదిలోపే కొన్నింటిని అమలు చేసినట్లు పేర్కొన్నారు. పింఛన్ల పెంపు, నిరుద్యోగులకు డీఎస్సీ, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్, ఆగస్టు నుంచి ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. రాబోయే నాలుగేళ్లలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ముందుకెళుతుందని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, డీసీసీబీ చైర్మన్ సీతారామయ్య, టీడీపీ నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, జనసేన నాయకులు కంది రవిశంకర్, టీడీపీ కార్పొరేటర్లు, టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వీట్లు పంచుకుని బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

రాష్ట్రం దూసుకెళ్తోంది..

సింగరాయకొండ: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిలో శరవేగంగా దూసుకెళ్తతున్నదని టీడీపీ నేతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం టీడీపీ నేతలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం ఇరవై ఏళ్ల వెనక్కివెళ్లిందని విమర్శించారు. అన్ని రంగాల్లో పాలన గాడి తప్పిందన్నారు ఇప్పుడు చంద్రబాబు తన అనుభవంతో వాటన్నింటినీ గాడిలో పెడుతున్నారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కూడా ఒకదాని తరువాత ఒకటి అమలు చేస్తున్నారని వివరించారు. కూటమి ఏడాది పాలనపై విషం కక్కుతున్న వైసీపీ కుటిల రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు సన్నెబోయిన శ్రీనివాసులు, కూనపరెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి, మించల బ్రహ్మయ్య, హరిబాబు, గిరి పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి...కుటుంబ సభ్యులను పలకరించి..

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీఎన్ ● ఎస్ఎన్‌పాడు మండలంలోని 14 గ్రామాల్లో 25మందికి రూ.19.45లక్షల పత్రాలు అందజేత



సంతనూతలపాడులో చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఒంగోలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్)చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ వినూత్నంగా వ్యవహరిస్తున్నారు. తన నియోజకవర్గం పరిధిలోని అనారోగ్యం పాలైన వారికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసేందుకు వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే విజయకుమార్ నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అనారోగ్యం బారినపడి చికిత్స చేయించుకున్న లబ్ధిదారులను పరామర్శించి వారి కుటుంబసభ్యులను పలకరించి చెక్కులను అందజేస్తున్నారు. అందుకోసం తానే స్వయంగా గ్రామగ్రామాన పర్యటిస్తున్నారు. ఈక్రమంలో బుధవారం సంతనూతలపాడు మండలంలోని మంగమూరు, సంతనూతలపాడు, గంగవరం, తక్కెళ్ళపాడు, వేములపాడు, మాచవరం, మద్దులూరు, గుమ్మనంపాడు, ఎనికపాడు, బోడపాలెం, గుడిపాడు, మైనంపాడు, ఎండ్లూరు. బొమ్మినేనివారిపాలెం గ్రామాలకు చెందిన లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్లి మొత్తం 25 మందికి రూ.19.45 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు.

నేడు మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: మండలంలోని లింగంగుంట, ఏడుగుండ్లపాడు, ఇనమనమెళ్లూరు, బసవన్నపాలెం, నందిపాడు, సీతారాంపురం, దొడ్డవరప్పాడు, మద్దిపాడు, కొలచనకోట, దొడ్డవరం, గాజులపాలెం, గుండ్లాపల్లి, అన్నంగి గ్రామాలలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు టీడీపీ అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, గోరంట్ల చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బీఎన్ హాజరవుతారని, ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యటించి 40మంది లబ్ధిదారులకు రూ.20.27లక్షల విలువైన చెక్కులను అందజేయన్నుట్లు పేర్కొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

● వైసీపీ నాయకుల ధ్వజం



ఒంగోలులో ర్యాలీ నిర్వహిస్తున్న రవిబాబు, నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అధికారం కోసం ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ నాయకులు ఆరోపించారు. వైసీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఒంగోలులో నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. స్థానిక అంబేడ్కర్‌భవన్ నుంచి కలెక్టరేట్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నేత బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఇన్‌చార్జి రవిబాబు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారని విమర్శించారు. ఆయా పథకాలు అమలు చేయకపోతే ప్రభుత్వానికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. జిల్లాలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, నాయకులు బండి శ్రీనివాసరావు, కఠారి శంకర్, లంకపోతు అంజిరెడ్డి, శ్రీనివాసరావు, వైవీ.అశోక్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

కొండపిలో నిరసన ర్యాలీ

కొండపి: వెన్నుపోటు దినం పేరుతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు కొండపిలో బుధవారం ర్యాలీ నిర్వహించారు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్లకార్డులు చేతపూని నినాదాలు చేశారు. అనంతరం కొండపి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, సీనియర్ నాయకుడు డాకా పిచ్చిరెడ్డి, పార్టీ ఆరు మండలాల కన్వీనర్లు, అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్విస్ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

హాజరైన ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ రామమోహన్‌రావు



విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేస్తున్న వైస్‌చైర్మన్ రామమోహన్‌రావు

ఒంగోలు విద్య, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో 2021-25 బ్యాచ్ విద్యార్థులు 1,264 మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు అయినట్లు విద్యాసంస్థల చైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ కె.రామమోహన్‌రావు చేతుల మీదుగా విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో అన్ని సౌకర్యాలు బాగా ఉన్నాయన్నారు. ల్యాబ్‌లు, ఐడియా ల్యాబ్‌లు, స్కిల్, ప్రాజెక్టు రూములు అన్ని బాగున్నాయని కొనియాడారు. విద్యార్థులకు ఇస్తున్న ఇంటర్న్‌షిప్‌లు, రీసెర్చ్‌పై కల్పిస్తున్న అవగాహన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని చెప్పారు. టెక్నాలజీని అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన సూచించారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ శ్రీగాయత్రి మాట్లాడుతూ సూర్యకళ్యాణ చక్రవర్తి విజన్‌తో విద్యార్థులకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణతో రికార్డు స్థాయిలో 928 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. ఫారిన్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలు, ఎంవోయూలు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కాగా 1,234 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రతిభావంతులైన 70మందికి ప్రత్యేక జ్ఞాపికలను అందజేశారు. నిడమానూరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబరు డాక్టర్ నిడమానూరి శ్రీచరిత ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. అలాగే ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, సమీర్‌కుమర్, బుజ్జిబాబు, నవనీతన్‌లు విద్యార్థులను అభినందించారు.

చెరువులకు సాగర్ జలాలు వచ్చేస్తున్నాయ్..

● ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి



అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ వరలక్ష్మి

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరానికి తాగునీటి ఇబ్బందులు తీరనున్నాయని, ఈ మేరకు గురువారం రామతీర్థం జలాయశం నుంచి వేసవి చెరువులకు విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి తెలిపారు. బుధవారం ఒంగోలులో కార్పొరేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విడుదలయ్యే నీరు దారిమళ్ళకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా సాగర్ కాలువను శుభ్రం చేసుకోవడంతోపాటు, పైపులైను లీకేజీలు ఉంటే సవరించుకోవాలని చెప్పారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులకు కూడా నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో నీరు వృధా కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ ఇంజనీర్ చంద్రయ్య మాట్లాడుతూ రామతీర్థం నుంచి ఒంగోలు వేసవి చెరువులకు 25 రోజులపాటు విడుదల కానున్నాయని తెలిపారు. నీరు సక్రమంగా చెరువులకు చేరేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 13 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎమినిటీ సెక్రటరీలు, ఇతర వర్కర్స్‌ను కూడా పర్యవేక్షణకు నియమించినట్లు తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ పలువురు అధికారులు పాల్గొన్నారు.

కొండలరావుపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 4 (ఆంధ్రజ్యోతి): మద్దిపూడి ఎస్ఐపై ఉద్దేశపూర్వకంగా, పథకం ప్రకారం అడ్డగించి దుర్భాషలాడిన మారంరెడ్డి కొండలరావు, అతని సోదరి, అనుచరులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడివెంగళరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

నిందితులను అరెస్టు చేయాలి

ఒంగోలు క్రైం: మారంరెడ్డి కొండలరావు ఎస్ఐను బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య చెప్పారు. రౌడీషీటర్ కొండలరావు ఉద్దేశపూర్వకంగా ఎస్ఐ రమేష్‌బాబును అడ్డగించారని, అందుకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళకు గాయాలు

మద్దిపాడు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్కూటీ అదుపుతప్పి మహిళకు గాయాలైన సంఘటన బుధవారం ఏడుగుండ్లపాడు వద్ద జరిగింది. అద్దంకికి చెందిన ఆర్.పద్మావతి తన స్కూటీపై వెళ్తుండగా గేదె అడ్డు రావటంతో అదుపుతప్పి కింద పడి గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

జాబ్‌మేళాలో 142మందికి ఉద్యోగాలు

ఒంగోలు విద్య, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ప్రభుత్వ ఐటీఐలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 142మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఐటీఐ చదువుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ జాబ్‌మేళాను నిర్వహించినట్లు ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంవీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ జాబ్ మేళాకు 159 మంది విద్యార్థులు హాజరు కాగా 142 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రముఖ కంపెనీలు ఈ జాబ్‌మేళాకు హాజరై తమ పరిశ్రమలకు అవసరమైన వారిని ఎంపిక చేసుకున్నారు. కార్యక్రమంలో ఐటీఐ సిబ్బంది, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం

ఒంగోలు(రూరల్), జూన్4(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలులోని శ్రీ చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామివారి దేవాలయ భూములకు బుధవారం దేశదాయశాఖ అధికారులు కౌలు వేలం వేశారు. స్థానిక ఆలయంలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 385 ఎకరాలకు గాను 63ఎకరాలకు మాత్రమే వేలం జరిగింది. వాటిని రూ.7,24లక్షలకు పాటదారులు పాడుకున్నారు. ఈ భూములు కొణిజేడు, సర్వేరెడ్డిపాలెం గ్రామాల పరిధిలో ఉన్నాయి. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఈవో సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు ఒంగోలు మండల సమావేశం

ఒంగోలు(రూరల్), జూన్4(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 6వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక మండల కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో రాజశేఖర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పి.మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

మోడల్ టెస్ట్‌కు అనూహ్య స్పందన



ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు విద్య, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు బుధవారం నిర్వహించిన ఎస్‌జీటీ మోడల్ గ్రాండ్ టెస్ట్‌కు అనూహ్య స్పందన లభించింది. ఒంగోలులోని శ్రీవికాస్ కోచింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఈ మోడల్ టెస్ట్‌కు అభ్యర్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రశ్నపత్రాలను పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు అంజిరెడ్డి విడుదల చేశారు. పరీక్షను జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావులు పర్యవేక్షించారు. కాగా మోడల్ టెస్ట్‌లో జి.కీర్తి 126/160, పి.ఎస్తేరమ్మ 124/160, ఐ.వికేనిక 120/160 మార్కులతో ర్యాంకులు సాధించారు. అనంతరం వారికి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీవికాస్ కరస్పాండెంట్ మోహనరావు, డైరెక్టర్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర కాలేజీ విద్యార్థినికి ర్యాంకు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఒంగోలులోని ఉమామహేశ్వరజూనియర్ కళాశాల విద్యార్థిని దాసరి యామిని 3837 ర్యాంకును సాధించారు. ఈ సందర్భంగా బుధవారం ర్యాంకు సాధించిన యామిని కళాశాల డైరెక్టర్ సి.ఉమామహేశ్వరరావు ప్రత్యేక అభినందించారు.

ముగిసిన డీఆర్పీ శిక్షణ

ఒంగోలు విద్య, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని రామచంద్ర మిషన్‌లో గత మూడు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్(డీఆర్పీ) శిక్షణ బుధవారంతో ముగిసింది. రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించిన ఈ శిక్షణకు 112 మంది డీఆర్పీలు, ఏడుగురు ఎస్ఆర్‌జీలు హాజరయ్యారు. జిల్లాలో 3,4 తరగతులకు బోధిస్తున్న టీచర్లకు మండలస్థాయిలో డీఆర్పీలు శిక్షణ ఇవ్వనున్నారు. బోధనలో మెలకువలు, సులభతరమైన బోధనపై వీరు టీచర్లకు శిక్షణ ఇస్తారు. కార్యక్రమంలో సీఎంవో నాగరాజు, ఆర్పీలు పాల్గొన్నారు.

నోబిడ్‌లతో రైతుల ఆందోళన

ఒంగోలు(రూరల్), జూన్4(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో బుధవారం అధికశాతం బేళ్లు నోబిడ్ కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం 934బేళ్లను వేలానికి తీసుకురాగా కేవలం 643 బేళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. 269 బేళ్లను కొనుగోలు చేయలేదు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర కిలో రూ.189 పలికింది. కాగా తిరస్కరణకు గురైన బేళ్లను తిరిగి ఇంటికి తీసుకెళ్లేందుకు రైతులు అవస్థలు పడ్డారు.

జిల్లా జైలులో వైద్యశిబిరం



జైలు అధికారులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా జైలులోని అధికారులు, సిబ్బంది, ఖైదీలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పీబీ, షుగర్, గుండె, డెంటల్‌తో పాటు, పలు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ ప్రకాష్ చావల, గోనుగుంట్ల శ్రీనివాస్, ఉమాపతి చౌదరి, అనీల్‌కుమార్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి హాస్పిటల్‌లో వైద్యం అందిస్తామని తెలిపారు. సుమారు 200 మంది వరకు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జైలు అడిషనల్ సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి, జైలు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బ్రహ్మతేజ, జైలర్లు వి.రమేష్, ఎం.శ్రీనివాస్, ఉపాస్ జనరల్ మేనేజర్ ఆనంద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీగిరి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

ఒంగోలు కల్చరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగిరిలోని శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అర్చకులు శ్రీవారికి సహస్రనామార్చన నిర్వహించగా వైఖానస ఆగమ పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, అర్జిత సేవల ధర్మకర్త సుశీలాదేవి, ధర్మకర్తలు వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి, జైశంకర్, శ్రీనివాస చరణ రాజీవ్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. గురువారం ఉదయం రక్షా బంధనం, ధ్వజారోహణం, సాయంత్రం కుంభపూజ, బలిహోమం, హనుమంత వాహన సేవ మొదలైన కార్యక్రమాలు ఉంటాయిని వారు తెలిపారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ప్రసాద్, మాధవరావు

చీమకుర్తి, జూన్4 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి వేడుకలను చీమకుర్తిలో నేషనల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మన్నం ప్రసాద్, మద్దాళి మాధవరావు, డాక్టర్ బందా రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి

కొండపి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ నియోజకవర్గ మహాసభలను ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు పార్టీ నియోజకవర్గ కార్యదర్శి వీరారెడ్డి తెలిపారు. వాటిని జయప్రదం చేయాలని కోరారు. బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో పార్టీ కార్యకర్తలతో కలిసి మహాసభల వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 100 సంవత్సరాలు చరిత్ర కలిగిన సీపీఐ అనేక ప్రజా సమస్యల మీద పోరాడి విజయాలను సాధించిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఆర్.లక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరుద్ర చిరస్మరణీయుడు

మద్దిపాడు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సినీ రచయిత ఆరుద్ర చిరస్మరణీయులని విశ్రాంత ఎంఈవో పీవీ.రాఘవరావు పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడులోని నటరాజ కళాకేంద్రంలో ఆరుద్ర వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సినీ రంగానికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో దిడ్ల రామారావు, నేటటూరి సత్యనారాయణ, గంటా కోటేశ్వరరావు, బడితల వెంకటేశ్వరరావు, గంగిశెట్టి నరసింహారావు, షేక్ కలాం, షేక్ షరీఫ్, కాకుమాను సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
- రూ.94.10లక్షలతో ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన
- ఘనంగా ఏడాది పాలన వేడుకలు

కొమరోలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. నరసింహస్వామిదేవాలయం ఆవరణలో గ్రామీణ నీటి సరఫరా,పారిశుధ్య విభాగం నిధులు రూ.94.10లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పాటై నేటికి ఏడాది అయిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు కొమరోలులో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొమరోలు మండల అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. గతంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను అశోక్‌రెడ్డి గుర్తుచేశారు. జగన్‌రెడ్డి పాలనలో గ్రామాలు, పట్టణాలు, చివరికి రాజధాని అమరావతి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్ర ప్రగతిని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తుతం గాడిలోకి తెస్తున్నారని అశోక్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవరశెట్టి భాగ్యలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో డీ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషోర్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముత్తుముల సంజీవరెడ్డి, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు గోడి ఓబుల్‌రెడ్డి, సొసైటీ బ్యాంకు చైర్మన్‌లు బాలఈశ్వరయ్య, రవీంద్రారెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు తిరుమలరెడ్డి, షేక్ హసీనా, మాజీ సర్పంచ్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.



ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే జగన్ ధర్నా డ్రామా

మార్కాపురం : వైసీపీ పాలకులు చేసిన కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్‌రెడ్డి ధర్నాల డ్రామాకు తెరతీశారని టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి అన్నారు. రాష్ట్రానికి పట్టిన దరిద్రం వదిలి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైన సందర్భంగా వేడుకను బుధవారం స్థానిక దోర్నాల బస్టాండ్‌లో నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి బాణసంచా కాల్చారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 70 శాతం అమలు చేయడం జరిగిందన్నారు. సామాజిక భద్రతా పింఛన్లను రూ.4వేలకు పెంచడం, మూడు ఉచిత సిలిండర్లు, రూ.5లకే అన్నా క్యాంటీన్‌ల ద్వారా భోజనం అందిస్తుందన్నారు. ఈ నెలలోనే తల్లికి వందనం, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు పథకాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రభుత్వ విజయాలను జీర్ణించుకోలేని సైకో జగన్ అబద్ధాలను ప్రచారం చేసేందుకు రోడ్డెక్కుతున్నారన్నారు. ఆయన్ను ప్రజలు నమ్మేస్థితిలో లేరని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, తాళ్లపల్లి సత్యనారాయణ, మాలపాటి వెంకటరెడ్డి, పఠాన్ ఇబ్రహీం, బీజేపీ నాయకులు బెల్లకొండ విజయలక్ష్మి, పీవీ కృష్ణారావు, పాదర్తి ఆంజనేయులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

రాచర్ల : ఈ ప్రభుత్వ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని జనసేన పార్టీ మండల నాయకులు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు గిద్దలూరు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు ఆధ్వర్యంలో బుధవారం ఏడాది పాలనపై సంబరాలు నిర్వహించారు. సైకో పాలనకు ప్రజలు చరమగీతం పాడి ఈరోజుకు ఏడాదైందన్నారు. ప్రస్తుతం ప్రజల ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శంకర్‌నాయుడు, అలిశెట్టి వెంకటేశ్వర్లు, చిన్నా వెంకటరావు, బాలుడు, రవితేజ పాల్గొన్నారు.

తర్లుపాడులో ముగ్గుల పోటీలు

తర్లుపాడు : ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైన సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో తర్లుపాడులో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 26 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు సేతుల శ్రీనివాసులు మాట్లాడుతూ ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలోకి కూరుకుపోయిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. పార్టీ ఆధ్వర్యంలో మున్ముందు సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన మహిళలకు ప్రథమ బహుమతిగా మిక్సీ, రెండో బహుమతిగా రైస్ కుక్కర్, మూడో బహుమతిగా డిన్నర్ సెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మువ్వా సురేశ్, మహేశ్, మోసే, ఎస్.సువర్ణ, కె.సునీల్, పఠాన్ కరిముల్లా, బాలరాజు, సూరె సువర్ణ, కృష్ణవేణి, నెహ్రూ యూత్ అధ్యక్షుడు బి.పుల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : వెన్నుపోటు, గొడ్డలివేటు జగన్‌రెడ్డి వారసత్వ హక్కు అని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పాలనను చూసి ఓర్వలేక, వైసీపీ పాలనలో జరిగిన కుంభకోణాలు, అవినీతి, అక్రమాల్లో నేతలు అరెస్టు అవుతుండడంతో ప్రజల దృష్టిని మరల్చడానికి జగన్‌రెడ్డి రోడ్డెక్కి నిరసన కార్యక్రమాలకు దిగుతున్నారన్నారు. ఇలాంటి వెన్నుపోటు కార్యక్రమాలను చూసి ప్రజలు జగన్‌రెడ్డిని నమ్మే స్థితిలో లేరని ఎరిక్షన్‌బాబు అన్నారు. వైసీపీ పార్టీ ఆవిర్భావమే వెన్నుపోటుతో అయిందని, వైసీపీ పార్టీని రిజిస్టర్ చేసుకున్న శివకుమార్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీని ఏర్పాటు చేశారన్నారు. బాబాయిని గొడ్డలితో నరికి చంపిన కిరాతకుల్ని కాపాడుతూ రక్తసంబంధీకులకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర జగన్‌రెడ్డిదన్నారు. ఆస్తికోసం తల్లిని, చెల్లిని గెంటేసి వాళ్లకు వెన్నుపోటు పొడిచారన్నారు. వెన్నుపోట్లకు కేరాఫ్ జగన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వ పాలనలో 70 శాతం హామీలు నెరవేరాయని అన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో రూ.100 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలతో ముందుకు సాగుతామని ఎరిక్షన్‌బాబు అన్నారు. సమావేశంలో పుల్లలచెరువు మండల టీడీపీ అధ్యక్షుడు ప్రసాద్, టీడీపీ నియోజకవర్గ నాయకులు శనగా నారాయణరెడ్డి, చిట్యాల వెంగళరెడ్డి, సుబ్బారెడ్డి, మంత్రునాయక్, సత్యనారాయణ గౌడ్, సుబ్బారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జునరావు, ఆదిరెడ్డి, అంజయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి మస్తాన్‌వలి, రాములు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

కంభం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు యోగా చేయడం వలన మానసిక ఒత్తిడి దూరమవుతుందని ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. బుధవారం కందులాపురం సచివాలయం-2లో సిబ్బందితో యోగాసనాలు వేయించారు. గ్రామీణ ప్రాంతాలలో యోగాపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రతిరోజు ఒక్కో పంచాయతీలో యోగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా వలన రక్త ప్రసరణ మెరుగుపడుతుందని, తలనొప్పి నుంచి ఉపశమనం కలుగుతుందని, అనేక ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

గిద్దలూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవని వృద్ధాశ్రమానికి రూరల్ సీఐ రామకోటయ్య బియ్యం, ఇతర నిత్యవసర సరుకులను గురువారం అందచేశారు. తన కుమార్తె వర్షిణి పుట్టిన రోజును వృద్ధుల సమక్షంలో జరిపించి వారికి స్వీట్లు, సరుకులను పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

మాజీ సైనికుడికి నివాళి



చెన్నయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

రాచర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన ఎం.చెన్నయ్య అనారోగ్యంతో మంగళవారం హైదరాబాద్‌లో మృతిచెందగా, బుధవారం స్వగ్రామమైన యడవల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ సైనికుల సంఘం సభ్యులు పాల్గొని చెన్నయ్యకు ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు ఎస్.ఓబులేసు, కార్యదర్శి సంగీతరావు, సభ్యులు బుచ్చయ్య, నరసింహులు, రంగయ్య పాల్గొన్నారు.

నేడు తురిమెళ్లలో రెవెన్యూ సదస్సు

కంభం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం తురిమెళ్ల గ్రామంలో ఈనెల 5వ తేదీ గురువారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తురిమెళ్ల ఇలాకాలోని భూములకు సంబంధించి గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో భూములకు సంబంధించి ఇబ్బంది ఉన్న రైతులు సరైన ఆధారాలతో సభకు హాజరై మీ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు.

రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ఎన్‌డీఏ పాలన

బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ రామచంద్రారెడ్డి

మార్కాపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ఎన్‌డీఏ పాలన సాగుతోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ఆర్థికంగా ఎంతో చితికిపోయిన రాష్ట్రాన్ని మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధిబాట పట్టిస్తున్నారన్నారు. అపార అనుభవం కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పీవీ కృష్ణారావు, జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, పట్టణ పార్టీ అధ్యక్షుడు పాదర్తి ఆంజనేయులు, జీవీ రెడ్డి, మద్దెల లక్ష్మి పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



ఏవోకి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే రాంబాబు

ఎర్రగొండపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీల్లో చెప్పిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వెన్నుపోటు దినంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మంజునాథరెడ్డికి ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. ఐదు మండలాల వైసీపీ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

మార్కాపురం : ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతోనే వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గడియార స్తంభం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఏవో అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు షంషీర్ అలీబేగ్ వెన్నా హనుమారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ పాల్గొన్నారు.

బేస్తవారపేట : టీడీపీ ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యమని వైసీపీ ఇన్‌చార్జి కె.నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారపేట, కంభం, అర్ధవీడు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు బేస్తవారపేట ప్రధాన రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఓసూరారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు వెంకగరాజు,వెంకటనాయుడు, ఓబుల్‌రెడ్డి, శ్రీరంగం పాల్గొన్నారు.



రామన్నకతువ సప్లై చానల్‌ను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

సప్లై చానల్ పరిశీలన

రాచర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అచ్చంపేట, ఆకవీడు, చోళ్లవీడు గ్రామాలకు సంబంధించి సప్లై చానల్స్‌ను ఇరిగేషన్ అధికారులు బుధవారం పరిశీలించారు. రామన్నకతువ నుంచి అచ్చంపేట ఉప్పులేటిచెరువు, చోళ్లవీడు దొబ్బేటి చెరువు, ఆకవీడు యర్రగుడిదిన చెరువు సప్లై చానల్స్ మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ గిద్దలూరు డీఈఈ రామారావు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గిద్దలూరు, రాచర్ల ఇరిగేషన్ ఏఈఈలు సుధాకర్‌రావు, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

అనుమతులు పొందిన విత్తనాలనే విక్రయించాలి

పెద్ద దోర్నాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అనుమతులు పొందిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ అన్నారు. మండలంలోని విత్తనాల దుకాణాలను వ్యవసాయాధికారి జవహర లాల్ నాయక్ బుధవారం తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రస్తుతం సాగు చేస్తున్న పత్తి విత్తనాలను నాణ్యత పరీక్ష నిమిత్తం నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు.అనంతరం ఏవో మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు .అదే విధంగా ఎప్పటికప్పుడు స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టరు సరి చేసుకోవాలన్నారు. రైతులకు విక్రయించినప్పుడు తప్పకుండా రసీదులు ఇవ్వాలన్నారు. పలు సూచనలు చేశారు.

పచ్చిరొట్ట ఎరువులతో పొలానికి బలం

పొదిలి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పొలానికి పచ్చిరొట్ట ఎరువులు ఎంతో బలాన్ని ఇస్తాయని బాపట్ల ప్రధాన శాస్త్రవేత్త పీ సంధ్యారాణి అన్నారు. కృషి విజ్ఞాన్ నోడల్ అధికారి కే సంధ్యారాణి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని మాదిరెడ్డిపాలెం, కొండాయపాలెం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంధ్యారాణి మాట్లాడుతూ ముఖ్యంగా రైతులు విత్తనశుద్ధి చేసుకోవడం వలన తెగుళ్ల ఉధృతి తగ్గించవచ్చన్నారు. కొన్ని పంటల్లో రసాయన ఎరువులు ఎక్కువగా వేయడం వలన భూమిలో సారం తగ్గి పంట దిగుబడిలో తెగుళ్లు ఆశిస్తాయన్నారు. దానివలన రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తుందన్నారు. ఖరీఫ్ సాగుచేసేటప్పుడు తప్పకుండా పచ్చిరొట్ట ఎరువులు, నవధాన్యాలు వేయడం వలన మంచి దిగుబడులు వస్తాయన్నారు. కోళ్లపరిశోధన శాస్త్రవేత్త బీ ప్రకాష్ మాట్లాడుతూ కొన్నిరకాలు కోళ్లు పెంచడం వలన మహిళా రైతులు ఆదాయవనరు అవుతుందన్నారు. కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించారు. ఏవో జైన్‌లాబ్దీన్ మాట్లాడుతూ వ్యవసాయంలో కొత్తగా వచ్చిన యాప్ ద్వారా పంటల సరళి, తెగుళ్ల దశలను గుర్తించి సరైన సమయంలో మందులు పిచికారీ చేసుకోవచ్చన్నారు. కే సంధ్యారాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన, కేవీకే, జిల్లా అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కొనకనమిట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవని ఎస్ఐ జి.ప్రభాకర్ అన్నారు. కొనకనమిట్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం జి.ప్రభాకర్‌రెడ్డి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ రాజ్‌కుమార్ వీఆర్‌కు వెళ్లగా, ఒంగోలు పోలీస్ కంట్రోల్ రూంలో పనిచేస్తున్న ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరనియంత్రణకు ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. ప్రజలకు అసౌకర్యం, ఇబ్బందులు లేకుండా చూస్తానని భరోసా కల్పిస్తానన్నారు.

పగిలిన సాగర్ పైపులైన్

పొదిలి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివాలయం సమీపంలో ప్రధాన సాగర్ నీటి పైపులైన్ పగిలి రోడ్డుపై వృథాగా నీరుపోతుంది. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అసలే వేసవి కాలం కావడంతో ప్రజలు నీటికి కటకటలాడుతున్నారు. ఈ క్రమంలో పైపులైన్లు పగిలి నీరు వృథాగా పోతుండడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బలహీనంగా ఉన్న పిల్లల వివరాలు సేకరించాలి

కలెక్టర్ అన్సారియా

మార్కాపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర స్థాయిలో బలహీనంగా ఉన్న పిల్లల కుటుంబ స్థితిగతులపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి వివరాలను సేకరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మెప్మా కార్యాలయంలో బుధవారం బంగారు బాల్యంలో భాగంగా బలహీనంగా ఉన్న పిల్లల కుటుంబ స్థితిగతులపై అధ్యయం చేసేందుకు రూపొందించిన యాప్‌పై శిక్షణ తరగతులను కలెక్టర్ అన్సారియా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బలహీనంగా, వైకల్యంతో బాధపడుతున్న పిల్లల సమగ్ర సమచారాన్ని సేకరిస్తేనే ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద రాచర్ల మండలాన్ని ఎంపిక చేసి స్థితిగతులపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసినట్లు చెప్పారు. అందులో 360 మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. అందులో కొందరికి మూడు చక్రాల కుర్చీలు అవసరమని తెలియడంతో వారికి అందించడం జరిగిందన్నారు. ఆయా కుటుంబాలకు అవసరమైన ఇళ్లు, ఆధార్, రేషన్‌కార్డు మంజూరు వంటివి త్వరితగతిన ప్రభుత్వం ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఈ యాప్‌పై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బందికి సూచించారు. స్వచ్ఛంద సంస్థల సహాయ సహకారాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, జిల్లా మహిళా, శిశుసంరక్షణ అధికారి హేన సుజన్, డీసీపీవో దినేష్‌కుమార్, బంగారు బాల్యం నోడల్ అధికారి గిరిధర్‌శర్మ, సార్ఫ్ ప్రతినిధి సునీల్, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఐసీడీఎస్, మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా



లక్ష్మీచెన్నకేశవ స్వామి మూలవిరాట్

రేపటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

రాచర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యడవల్లి గ్రామంలో ఈనెల 6 నుంచి 11వ తేదీ వరకు శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ శుక్రవారం అంకురార్పణ, ధ్వజారోహణం, స్వామి వారి గ్రామోత్సవం, 7న స్వామి వారి కల్యాణం, గ్రామోత్సవం, హనుమంత వాహన సేవ, 8న గరుడ సేవ, మహావిష్ణు అలంకారం, 9న అలరాజు రాయబారం, 10న కంబ బండి మహోత్సవం, కంపతల్లి మహోత్సవం, 11వ తేదీ బుధవారం అవభ్రథ స్నానం, చక్రతీర్థం, వసంతోత్సవం జరుగుతాయని తెలిపారు.

వైభవంగా పూజలు

కంభం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ జీవనోద్ధరణ వేడుకలు 3 రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మనోజ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కామూరి రమణారెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు చేతిరాత పోటీలు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు చేతి రాత పోటీలను నిర్వహించారు. మొదటి బహుమతిని సీహెచ్ కార్తిక, రెండో బహుమతిని ఆర్.లాస్య, మూడో బహుమతిని సహస్రకు అందజేశారు. చిత్రలేఖనంలో వరుసగా సహస్ర, గాయత్రి, పవన్ బహుమతులను గెలుపొందారు. విజేతలకు హ్యాండ్ రైటింగ్ ట్రైనర్ తిరుపాలయ్య, గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి బహుమతులు అందించారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

పెద్ద దోర్నాల : గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ ఈవో శివకోటేశ్వరరావు అన్నారు. గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఈవో శివ మాట్లాడుతూ గ్రంథాలయానికి కొంత సమయం కేటాయించి జనరల్ నాలెడ్జ్ పెంపొందించు కోవాలని అన్నారు. ఏప్రిల్ 28 నుంచి జూన్ 4వ తేదీ వరకు నిర్వహించిన శిక్షణ తరగతులు ఎంతగానో ఉపకరించాయని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నాగమూర్తి అన్నారు. అనంతరం శిక్షణ తరగతుల నేపథ్యంలో నిర్వహించిన పలు అంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు రామాంజినాయక్, విశ్రాంత గ్రంథ పాలకుడు వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో వార్షికోత్సవ పూజలు

గిద్దలూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పీఆర్‌కాలనీలో శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో ఈనెల 6, 7 తేదీ లలో దేవస్థాన 16వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కొండయ్య, కార్యదర్శి రవీంద్రనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 6వతేదీ శుక్రవారం ప్రత్యేక పూజలు, 7వ తేదీ శనివారం స్వామి వారికి అభిషేకం, సుదర్శన హోమం, భక్తులకు అన్నదానం, సాయంత్రం కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రాయితీ కోసం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

త్రిపురాంతకం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కౌలు రైతులకు కూడా పలు రాయితీలు కల్పిస్తుందని వాటిని అందిపుచ్చుకునేందుకు గుర్తింపు కార్డులు తప్పనిసరి అని తహసీల్దార్ జి.శ్రీనివాసరావు అన్నారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం కౌలు రైతు పంటసాగుదారుల హక్కుపత్రం (సీసీఆర్‌సీ) గుర్తింపుకార్డులపై ప్రత్యేక సమీక్ష సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రైతువారీ రాయితీలు కౌలు రైతులు కూడా అందుకునేందుకు ఈ కార్డులు జారీ చేయటం జరుగుతుందని అన్నారు. కార్డులు పొందేందుకు భూమియజమాని అయిన రైతు పట్టాదారు పుస్తకం, ఆధార్‌కార్డుతో కౌలురైతు కూడా ఆధార్‌కార్డు పాస్‌ఫొటో జతచేసి ఫారం-1తో పాటు రూ.10 స్టాంపులపై రాసుకున్న కౌలు ఒప్పందపత్రం కలిపి రెవెన్యూ అధికారికి అందజేయాలన్నారు. ఈ ఏడాది మండలంలో 1508 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డుల లక్ష్యంగా ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి నీరజ, ఎఇఓ ధనేశ్వర నాయక్, గ్రామా రెవిన్యూ అధికారులు, ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

విధ్వంసక పాలనకు సమాధి .. ప్రజాపాలనకు ఏడాది

ఇంకా వైసీపీకి బుద్ధి రాలేదు

నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శిలో కేక్ కట్ చేసి సంబరాలు

దర్శి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రజాపాలనలో ఏడాది కాలంలోనే ఎన్నో అద్భుతాలు సాధించిందని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా దర్శిలోని గడియారస్తంభం సెంటర్‌లో ఆమె కేకు కట్ చేశారు. ఎన్టీఆర్, దివంగత మాజీ ఎమ్మెల్యే శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన ఏడాది కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు గతంలో ఎన్నడూలేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది కాలంలో ఇచ్చిన హామీలను 70శాతంకు పైగా అమలు చేసిందన్నారు. వైసీపీ పాలకులు 10 శాతం హామీలను కూడా పూర్తి చేయలేదన్నారు. ప్రజలందరికీ వెన్నుపోటు పొడిచిన వైఎస్ జగన్ వెన్నుపోటు దినం నిర్వహించటం సిగ్గుచేటన్నారు. నా ఎస్సీ, నా బీసీ అంటూ దళితులను చంపి డోర్ డెలివరీ చేసిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. ఎస్సీ ఎస్టీలకు ప్రవేశపెట్టిన 27 పథకాలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. విధ్వంస పాలనకు ప్రజలు సమాధికట్టి ప్రజా పాలనను అధికారంలోకి తేవటంతో అందరూ స్వేచ్ఛగా జీవిస్తున్నారన్నారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకులు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, టీడీపీ దర్శి పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, రూరల్ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ ఫణిదపు వెంకటరామయ్య, తెలుగు మహిళా నాయకురాలు ఎం. శోభారాణి, దర్శి పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జి నారపుశెట్టి మధు, టీడీపీ నాయకులు గొర్రె సుబ్బారెడ్డి, దామా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా కేకు కట్ చేస్తున్న టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

అవీ..ఇవీ


జనసేన కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకుంటున్న కూటమి శ్రేణులు

సైకో పాలనకు చరమగీతం పాడిన ప్రజలు

పామూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జగన్ సైకో పాలనతో విసుగు చెందిన ఆంధ్రరాష్ట్ర ప్రజలు గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పాడి నేటితో ఏడాది పూర్తి అయిందని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, జనసేన నియోజకవర్గ నాయకుడు వరికూటి నాగరాజు అన్నారు. సైకో పోవాలి సైకిల్ రావాలి అనే నినాదంతో రాష్ట్ర ప్రజలు వైసీపీకి చమరగీతం పాడి కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారన్నారు. స్థానిక జనసేన కార్యాలయం వద్ద బుధవారం అందమైన రంగవల్లులతో ముంగిళ్లను అలంకరించి దీపాలు వెలిగించి బాణ సంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్, ఎం. వెంకట్రావు, మెంటా నరసింహారావు, పాలపర్తి రమణయ్య, బీజేపీ నాయకులు కేవీ సుబ్బారావు, ఉమ్మడి శ్రీను, జనసేన నాయకులు రహీముల్లా, దరిశి ఏడుకొండలు, వెంగళశెట్టి బాబురావు, షేక్ సందానిబాషా, గోస్తు సునీల్ పాల్గొన్నారు.


ఎంపీడీవోను సన్మానిస్తున్న ఎన్ఆర్జీఎస్ సిబ్బంది

ఎంపీడీవోకు సన్మానం

పీసీపల్లి,జూన్4(ఆంధ్రజ్యోతి):ఇటీవల బదిలీపై కనిగిరి వెళ్లిన ప్రభాకశర్మను అధికారులు, సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించి సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీరాజ్ సిబ్బంది మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సంయుక్తంగా ఎంపీడీవో ప్రభాకరశర్మను ఘనంగా సన్మానించి శాలువాతో సత్కరించారు.సన్మాన గ్రహీత ప్రభాకరశర్మ మాట్లాడుతూ ఇక్కడ పనిచేసిన సమయంలో అధికారులు సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించి మండలం ప్రగతిపథంలో నడిచేందుకు దోహదపడ్డారని, వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య, ఏపీవో జహంగీర్ బాషా, డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, ఆన్ ఆర్జీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.


రైతులకు పత్రాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు, ఏవో, నాయకులు

రైతులు ఖర్చులు తగ్గించి లాభాలను పెంచాలి

● వ్యవసాయ శాస్త్రవేత్త ఎస్‌వీ రమణారావు

తాళ్లూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : రైతులు ఖర్చులు తగ్గించి లాభాలను పెంచే విధంగా క్షేత్రస్థాయిలో వికసిత్ కృషి అభియాన్ తగు సూచనలు చేస్తుందని భారతీయ నూనెగింజల పరిశోధనాసంస్థ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వి.రమణారావు తెలిపారు. మండలంలోని లక్కవరం గ్రామంలో వికసిత్ కృషి అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు సాంకేతికతను పెంచుకుని నికరఆదాయం పొందాలన్నారు. అలాగే నువ్వు సాగువల్ల కలిగే లాభాలను, యాజమాన్యపద్ధతులను వివరించారు. కృషి వికాస్ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మంచి రకాల విత్తనాలను ఎంపిక చేసుకుని విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్, భూసారపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీ ఎంఐపీ అమృత, హెచ్ఈవో స్వర్ణలత, మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరెడ్డి, బి.హనుమారెడ్డి, టి.లక్ష్మీరెడ్డి, ప్రకృతి ఇంచార్జి నరసింహ, బీటీఎం జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో పరమత సహనం పాటించాలి


ఉభయదాతలతో మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

పామూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి 13 తేదీ వరకు జరగనున్న శ్రీ మదనవేణుగోపాల స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉభయ దాతలందరూ మత సామరస్యానికి విఘాతం కలగకుండా పరమత సహనం పాటిస్తూ బ్రహ్మోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని సీఐ ఎం. భీమానాయక్ సూచించారు. స్థానిక దేవాలయంలో ఈవో నరసింహబాబు అధ్యక్షతన ఉభయదాతలతో శాంతి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా స్వామి వార్ల బ్రహ్మోత్సవాలను ఐక మత్యంతో జరుపుకోవాలన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామోత్సవాలు జరుపుకొనే సమయంలో ముస్లిం ప్రార్థన మందిరాల వద్ద నమాజ్ సమయంలో ఒప్పందం ప్రకారం మేళతాళాలను నిలిపి వేసి పరమత సహనం పాటించి వారి మనోభావాలను గౌరవించుకోవాలని సూచించారు. భక్తి పాటలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం ఉభయ దాతలతో కలిసి అన్నదాన ప్రాంగణం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకొనే ప్రాంగణాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ టి. కిశోర్‌బాబు, ఉభయదాతలు బి. జయరామిరెడ్డి, బి నరసింహారావు, టి జనార్దనరావు, మాజీ సర్పంచ్‌లు కావిటి సుబ్బయ్య, ఎస్వీ నారాయణ, ఉప్పలపాటి హరిబాబు, గుత్తి వెంకటరాజు, మిటికెల నారాయణ, పాలపర్తి రమణయ్య, ఎం. రఘునాథరెడ్డి, ఇర్రి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

పామూరు పట్టణంలోని చారిత్రక ప్రాధాన్యత కలిగిన రుక్మిణీ సమేత సత్యభామ శ్రీ మదనవేణుగోపాలస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు నేటి నుంచి13 వ తేదీ వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థాన ఈవో శ్రీ గిరిరాజు నరసింహబాబు ఆధ్వర్యంలో దేవస్థానానికి రంగులు వేయించి విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.

కాగా ఆలయ ప్రాంగణంలో డోజర్‌తో చదును కార్యక్రమాలు పూర్తి చేశారు. హోమాల కోసం యాగ శాలలు ఏర్పాటు చేశారు. స్వామివార్ల రథోత్సవం, గ్రామోత్సవాల సందర్భంగా పట్టణ వీధుల్లో విద్యుత్ తీగలు,చెట్లకు ఆటంకం కలగ కుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఈవో తెలిపారు.


విద్యుత్ వెలుగుల్లో దేవస్థానం

కేజీబీవీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దొనకొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థినుల విద్యాభివృద్ధి నిమిత్తం ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలల అభివృద్దే ధ్యేయంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. దొనకొండలోని కేజీబీవీ జూనియర్ కళాశాలకు రూ.1.67 కోట్ల సమగ్ర శిక్ష నిధులతో మంజూరైన మూడు తరగతి గదులు, డార్మిటరీ నిర్మాణ పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ విద్యార్థుల బాగోగులు చూడటంతో పాటు ఒత్తిడిలేని సరికొత్త విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టారన్నారు. దర్శి నియోజకవర్గంలోని కేజీబీవీ పాఠశాలల్లో భవనాల నిర్మాణాలకు దాదాపు రూ.7కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. త్వరలో భవన నిర్మాణ పనులు పూర్తవుతాయన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, ఎంపీడీవో శ్రీదేవి, ఎంఈవో సాంబశివరావు, పాఠశాల ప్రత్యేకాధికారిణి మాధవి, టీడీపీ మండల అధ్యక్షుడు మోడి అంజనేయులు, మాజీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు పులిమి రమణాయాదవ్, నాయకులు దుగ్గెంపూడి చెంచయ్య, యగ్గోని యల్లారెడ్డి, పత్తి వెంకటేశ్వర్లు, కొమ్మతోటి సుబ్బారావు, నిమ్మకాయల సుబ్బారెడ్డి, పెమ్మసాని లక్ష్మీనారాయణ, పొన్నెబోయిన నాగేశ్వరరావు, మరికొందరు నాయకులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత క్రీడలవైపు మొగ్గు చూపటం అభినందనీయం

దొనకొండ : గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల వైపు మొగ్గు చూపటం ఎంతో అభినందనీయమని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మండలంలోని రాగమక్కపల్లి గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్స్‌లో విజేతలకు బుధవారం ఆమె బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని గుర్తించేందుకు క్రీడాపోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మోడి అంజనేయులు, మాజీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, టీడీపీ నాయకులు, క్రీడాకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎం సహాయనిధి

చెక్కుల పంపిణీ

దర్శి : అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం సహాయనిధి చెక్కులను టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బుధవారం దర్శిలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్నీ విధాలా అండగా నిలుస్తుందన్నారు. తాజాగా 31 మందికి రూ.18.47 లక్షలు చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దర్శి పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, యాదగిరి వాసు, వివిధ మండలాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తాళ్లూరు : తాళ్లూరు మండలానికి చెందిన ఐదుగురికి బుధవారం రూ. 1,76,148 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లక్ష్మి అందజేశారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు ఐ.శ్రీనివాసరెడ్డి, బి.హనుమారెడ్డి , టీ.లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు : మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన పందుగుల ఈశ్వరమ్మ ఇటీవల అనారోగ్యానికి గురి కావటంతో రూ. 25వేలు సీఎం సహాయ నిధి చెక్కు మంజూరు అయ్యింది. ఆ చెక్కును టీడీపీ దర్శి ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చేతుల మీదుగా బుధవారం సాయంత్రం బాధితురాలు ఈశ్వరమ్మ భర్త నర్సిరెడ్డికి అందజేశారు. వీరితో పాటు పోలవరం, వేముల, ముండ్లమూరు గ్రామాలకు చెందిన వీరపనేని చినబాబు, సుబ్బారావు తదితరులకు చెక్కులు అందజేశారు.


నిరసన ర్యాలీలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి

హామీల అమల్లో విఫలం

దర్శి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): హామీల అమల్లో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి విమర్శించారు. వైసీపీ ఇచ్చిన పిలుపుమేరకు దర్శిలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది గడిచినప్పటికీ అనేక హామీలు అమలు చేయకపోవటంతో నిరసన నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

● కలెక్టర్‌కు విన్నవించిన తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వేణుబాబు

తాళ్లూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో కలిసి కొర్రపాటివారిపాలెంకు చెందిన తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు బుధవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కొర్రపాటివారిపాలెంలో నెలకొన్న సమస్యలను ఎంపీ సమక్షంలో కలెక్టర్‌కు వేణుబాబు విన్నవించారు. ఆయా సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వేణుబాబు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న దొడ్డా వెంకట సుబ్బారెడ్డి

నిరసన కాదు.. పశ్చాత్తాప దినంగా నిర్వహించుకోవాలి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి విమర్శ

వెలిగండ్ల, జూన్ 4 : (ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే అది ఓర్వలేక వైసీపీ నేతలు వెన్నుపోటు దినమంటూ నిరసన కార్యక్రమం చేపట్టడం సిగ్గులేని చర్య అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డావెంకట సబ్బారెడ్డి మండిపడ్డారు. బుధవారం వెలిగండ్ల టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ నమ్మి అధికారం ఇస్తే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. తల్లిని, చెల్లిని వెన్నుపోటు పొడిచిన జగన్‌ను ప్రజలు నమ్మట్లేదని ఆయన తెలిపారు. వైసీపీ అబద్ధాలు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వైసీపీ పరిస్థితి గుండుసున్నా అని విమర్శించారు. సరిగ్గా ఏడాది (జూన్ 4న) క్రితం రాష్ట్రంలో రాక్షస పాలనకు ముగింపు కార్డు పడింది. ఈ క్రమంలో వైసీపీ నేతలు జూన్ 4న వెన్నుపోటు దినం కాదు పశ్చాత్తాప దినంగా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకట రెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, కొండు భాస్కర్ రెడ్డి, చిలకల వెంకటేశ్వర్లు, సలోమన్ రాజు, బొబ్బా తిరుపతి రెడ్డి, కృష్టరావు, శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు


సాగర్ కుడి కాలువ చైర్మన్ పులుకూరి కాంతారావుకు వినతి పత్రం అందజేస్తున్న డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు

బ్రిడ్జీల నిర్మాణానికి నిధులు కేటాయించాలి

● సాగర్ కుడి కాలువ చైర్మన్‌కు డీసీ చైర్మన్ కంచుమాటి వినతి

ముండ్లమూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోదేపల్లి మేజరు పరిధిలో శిథిలావస్థకు చేరిన రమణారెడ్డిపాలెం, ఈదర గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జితో పాటు రవ్వారం నుంచి 39వ మైలు ఎండింగ్ పాయింట్ వరకు మెయిన్ కాలువ ఎడమ వైపు కాలువ కట్ట మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావును బుధవారం మండలంలోని మోదేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు కంచుమాటి శ్రీనివాసరావు కలిసి వినతి పత్రం అందజేశారు.

నరసరావుపేటలో జరిగిన డీసీ చైర్మన్‌ల సమావేశంలో పాల్గొన్న శ్రీనివాసరావు ప్రాజెక్టు చైర్మన్ కాంతారావుకు పలు సమస్యలతో వినతి పత్రాన్ని అందజేశారు. ప్రధానంగా మోదేపల్లి మేజరు రెండో కిలో మీటరు వద్ద నుంచి గాంధీ నగర్, వేముల గ్రామాల మధ్య రాకపోకల దారిలో ఉన్న ఎన్ఎస్‌పీ కాలువ మీద నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందన్నారు. దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 13 మంది లస్కర్లను మాత్రమే అపాయింట్‌మెంట్ చేసుకున్నారని, మరో ఇద్దరిని తీసుకుంటే లస్కర్ల కొరత సమస్య తీరుతుందన్నారు. ప్రమాదం పొంచి ఉన్న రెండు బ్రిడ్జీలు ఎప్పుడు కూలి పోతాయోనని, దీని వల్ల ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ పూర్ణచందు, జేఈలు ప్రసాదు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని డీసీ చైర్మన్ శ్రీనివాసరావుకు హామీ ఇచ్చారు.


పెద్దమ్మతల్లికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా చౌడమ్మ గ్రామోత్సవం

సీఎస్‌పురం(పామూరు), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న శ్రీ రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం తోగట వారి ఇంటి నుంచి శ్రీ చౌడమ్మ అమ్మవారికి పసుపు- కుంకుమను తీసుకొనివచ్చారు. మధ్యాహ్నం ఇర్ల పెద్దక్క, పెనుగొండ కృష్ణమ్మ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని అంగరంగ వైభవంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎం. భీమానాయక్, ఎస్ఐ ఎం. వెంకటేశ్వర నాయక్ లు శాంతి భద్రతలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థాన నిర్వాహకులు, ఉభయదాతలు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు బండలాగుడు పోటీలు

పెద్దమ్మతల్లి తిరునాళ్లలో భాగంగా గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు డాక్టర్ ఫార్మశీ అధినేత తులాబందుల చలమయ్యనాయుడు మొదటి బహుమతిగా రూ. 1,00,116, రెండవ బహుమతిగా మారాసుల రోశయ్య కుమారులు రూ. 75,116, మూడవ బహుమతి శ్రీకృష్ణ గ్రూప్ ఎండి తిరుమలశెట్టి కిరణ్‌కుమార్‌నాయుడు రూ. 50,116, నాలుగవ బహుమతిగా పామూరుకు చెందిన రియల్టర్ ఆకుపాటి రూ. 30,116. ఐదవ బహుమతిగా మన్నేపల్లి వెంకటనరసయ్య రూ. 20,116. ఆరవ బహుమతి బోయిన రాయుడు రూ.15,116, ఏడవ బహుమతి తోట అశోక్‌నాయుడు రూ. 10 వేలు అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఎడ్లజతకు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


ప్రతిభా అవార్డుకు ఎంపిక


షేక్ సఫియా

దొనకొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ సీఈసీ గ్రూపులో మంచి మార్కులు సాధించిన షేక్ సఫియా ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ధనుముని తెలిపారు. 1000 మార్కులకు 944 మార్కులు సఫియా సాధించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు బుధవారం ప్రకటించిన ప్రతిభా అవార్డుల జాబితాలో సఫియా ఎంపికైనట్లు తెలిపారు. తమ కాలేజీ విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభా అవార్డుకు ఎంపికవ్వటం ఎంతో గర్వకారణంగా ఉందని ప్రిన్స్‌పాల్ ధనుముని, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

ఉష్ణోగ్రత (అంచనా)

5-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	39	27
తెనాలి	39	29
నరసరావుపేట	39	26
బాపట్ల	39	29
రెంటచింతల	39	28
చీరాల	39	29



● సాగర్‌లో నీటి నిల్వ

జల.. జలాశయాలు

- రుతుపవనాల విస్తరణతో వర్షాలు
- కృష్ణమ్మకు పోటెత్తుతున్న వరద ప్రవాహం
- ప్రాజెక్టుల్లో ఆశాజనకంగా నీటి నిల్వలు
- గత ఏడాది కంటే 80.02 టీఎంసీలు అధికం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రుతు పవనాలు విస్తరణతో కృష్ణానది పరివాహక ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. ఆల్మట్టి, తుంగభద్ర, జూరాల ప్రాజెక్టులకు వరద ప్రవాహం పోటెత్తుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా జూన్ ప్రారంభంలోనే జలాశయాలకు నీటి ప్రవాహం వస్తోంది. ఆల్మట్టి నుంచి శ్రీశైలం ఎగువ ప్రాజెక్టుల వరకు పూర్తిస్థాయి నీటి నిల్వ 271.83 టీఎంసీలు కాగా ప్రస్తుతం 107.55 నిల్వ ఉంది. ఆల్మట్టికి 17.760, తుంగభద్రకు 8,222, జూరాలకు 18,867, శ్రీశైలానికి 17,759, సాగర్‌కు 4,377 కూసెక్కుల వరద ప్రవాహం ఉంది. కృష్ణానది పరివాహక ప్రాంతంలో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో ఈ నెలాఖరుకు

జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...

జలాశయం	పూర్తి స్థాయి నిల్వ	గతేడాది నిల్వ	ప్రస్తుత నిల్వ
ఆల్మట్టి	123.08	22.37	54.23
నారాయణపూర్	33.31	19.30	24.45
జూరాల	9.66	3.75	8.43
తుంగభద్ర	105.78	3.37	20.44
శ్రీశైలం	215.81	32.29	53.75
నాగార్జున సాగర్	312.05	122.69	134.75

ప్రాజెక్టుల్లోకి సమృద్ధిగా వరద నీరు వస్తుందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది జూలై నెలాఖరు కల్లా శ్రీశైలం ఎగువ ప్రాజెక్టులు నిండాయి. అదే పరిస్థితులు ఈ ఏడాది నెలకొంటాయని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. మొత్తంమీద సాగర్ ఆయకట్టులో ఈ ఏడాది కూడా సాగుకు నీరు వస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

రేపటి నుంచి మెగా డీఎస్సీ

● ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

బాపట్ల రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నిర్వహణకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం నుంచి నిర్దేశించిన సబ్జెక్టుల వారీగా ఆన్‌లైన్‌లో కంప్యూటర్‌బేస్‌డ్ విధానంలో పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, చీరాల సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజి కేంద్రాల్లో ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఈ నెల 30 వరకు విడతల వారీగా పరీక్షలు జరగనున్నాయి. ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో పాటు అభ్యర్థుల కోసం హెల్ప్‌లైన్ డెస్క్‌లు, కేంద్రాల వద్ద డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు నిర్దేశించిన సమయాల్లో పరీక్షా కేంద్రాలకు రావాలని, ఒక్క నిమిషం ఆలస్యమైన కేంద్రాల్లోకి అనుమతించమని డీఈవో స్పష్టం చేశారు.

ఆర్టీఈ అడ్మిషన్లు.. 1,689

- విద్యా హక్కు చట్టంలో విద్యార్థుల ఎంపిక
- 7 కల్లా ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రవేశాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యా హక్కు చట్టాన్ని(ఆర్టీఈ) కఠినంగా అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. విద్యా హక్కు చట్టాన్ని వైసీపీ నిర్వీర్యం చేయగా కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి అమలు చేస్తోంది. ఒకటో తరగతిలో చేరే పేదల నుంచి దరఖాస్తులను స్వీకరించి లాటరీ పద్ధతిలో విద్యార్థులను విద్యాశాఖ ఎంపిక చేసింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 1,689 విద్యార్థులు ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లకు ఆమోదం తెలిపింది. ఎంపికలో అనాథ పిల్లలు, దివ్యాంగులు, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ, అగ్రకులాల్లో పేదలకు ప్రాధాన్యం ఇచ్చింది. గుంటూరు జిల్లాకు సంబంధించి 1,149, పల్నాడులో 298, బాపట్ల జిల్లాలో 242 విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యాశాఖ అధికారులు సమాచారం అందించారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులు అడ్మిషన్లు ఈ నెల 7 తేదీ కల్లా పొందాలని సదరు అధికారులు సూచిస్తున్నారు. విద్యా హక్కు చట్టం అమలుకు శ్రీకారం చుట్టి పేదలకు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందిస్తుండటంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చట్టం ప్రకారం 1 నుంచి 8వ తరగతి వరకు ఉచితంగా ఆయా విద్యా సంస్థల్లో విద్యను వారు కొనసాగించవచ్చు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజును చెల్లించనున్నది.

నేడు సూర్యలంకలో వనమహోత్సవం

బాపట్ల రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్రతీరం జీడిమామిడితోటలో నగరవనంలో గురువారం ఉదయం వనమహోత్సవం జరగనున్నది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి మొక్కలు నాటనున్నారు. కలెక్టర్ వెంకటమురళి, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం నగర వనంలో ఏర్పాట్లను ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా, డీఈ కృష్ణారెడ్డిలు పరిశీలించారు. అటవీశాఖాధికారులకు పలు సూచనలు చేశారు.



వన మహోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో గ్లోరియా

యోగాంధ్రకు.. 6,31,435 మంది

- లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలి
- అధికారులకు కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలు



బాపట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రకు 6,31,435 మంది సభ్యులను నమోదు చేసేందుకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. యోగాంధ్ర పేర్ల నమోదు వేగవంతంపై కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అధికారులు, ఎంపీడీవోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర లక్ష్యంలో 5,55,218 మంది సభ్యుల పేర్లను ఇప్పటి వరకు నమోదయ్యాయన్నారు. మిగిలిన సభ్యుల నమోదుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాల వారీగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయుడంలో వెనుకబడిన ఎంపీడీవోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్యాలను పూర్తి చేయకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. యోగాంధ్రలో నమోదు చేసిన సభ్యులను గురువులతో మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగా శిక్షణకు మూడుప్రాంతాలను నిర్దేశించి వాటి వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలో వివిధ పోటీలు నిర్వహించి వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేయాలన్నారు.

● ప్రతి గ్రామంలో నూరుశాతం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో చెత్తను డోర్ మిత్ర, క్లాప్ మిత్రలచే ఇళ్లకెళ్లి చెత్తను సేకరించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డీఎల్‌డీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజధానిలో వనమహోత్సవం

● హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

తుళ్లూరు, (అనంతవరం) జూన్ 4,(ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతి నగరాన్ని బ్లూ అండ్ గ్రీన్ సిటీగా తీర్చదిద్దటమే ధ్యేయంగా పెట్టుకున్న సీఎం చంద్రబాబునాయుడు గతంలో కూడా రాజధానిలో పెద్ద ఎత్తున వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క మొక్క నాటింది లేదు. తిరిగి అమరావతికి పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తుంది. అనంతవరం రెవెన్యూలో గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన 20 ఎకరాల పార్కులో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. ఒకే సారి రెండు వేల మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేశారు. సభా వేదిక పనులు పూర్తి చేశారు. రెండు వేల మంది రైతులు, రైతు కూలీలు , మహిళలు సీఎం కార్యక్రమానికి హాజరవుతారని అధికారులు తెలిపారు. భారీ ఎత్తున పోలీసు బలగాలు సభా వేదిక వద్దకు చేరుకున్నాయి. కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నారు. వేదిక దక్షణం వైపు పబ్లిక్ పార్కింగ్ కోసం చదును చేశారు. వర్షం పడినా ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం సజావుగా జరిగేందుకు ఏర్పాటు చేస్తున్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ తేజ, సీఎం చీఫ్ సెక్యూరిటీ అధికారి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఏడీసీ, సీఆర్డీఏ, రెవెన్యూ అధికారులు ఏర్పాట్లను సమీక్షించారు. సభకు వచ్చే వారికి మంచి నీరు అల్పాహార అందించే ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు సీఎం , డిప్యూటీ సీఎం వేదిక వద్దకు వస్తారు. మొక్కలు నాటిననంతరం వేదిక నుండి ప్రసంగిస్తారు.

రీ సర్వేకు.. చిక్కులు

- కొలిక్కిరాని తొలిదశ.. రెండో విడత ప్రారంభం
- సాంకేతిక సమస్యలతో పనిచేయని రోవర్స్
- సరిపడా సిబ్బంది లేక నత్తనడకన రీ సర్వే
- ముంచుకొస్తున్న గడువు.. 30 శాతమే పూర్తి

ఐదేళ్ల వైసీపీ పాలన వేల సంఖ్యలో భూ సమస్య లను మిగిల్చగా.. వీటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సమ గ్ర రీసర్వే కు శ్రీకారం చుట్టింది. అయితే ఈ కార్యక్రమానికి రక రకాల చిక్కులు ప్రతిబంధకంగా మారాయి. పైగా తొలి విడత రీ సర్వే జరుగుతుండగా.. అది ఒక కొలిక్కి రాకుండానే రెండో విడత ప్రారంభించింది. రెండో విడతకు గడువు ఈ నెల 6న విధించింది. అయితే సాంకేతిక సమస్యలు, సిబ్బంది కొరత, అందుబాటులో లేని రైతులు తదితర చిక్కులతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ఇప్పటికి 30 శాతం కూడా రీ సర్వే పూర్తి కాలేదు. తొలి దశ రీ సర్వేను పూర్తి చేయడానికి ఈ ఏడాది ఫిబ్రవరిని తుది గడువుగా ప్రభుత్వం నిర్దేశించింది. కానీ అది కొలిక్కి రాక ముందే రెండో దశ ప్రారంభించడంతో మొత్తం ప్రక్రియే ప్రహసనాన్ని తలపించే రీతిలో సాగుతుంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

భూ సమస్యలను పరిష్కరించి, భూ యజమానులకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం పక్కా ప్ర ణాళికతో సమగ్ర రీసర్వేకు శ్రీకారం చుట్టింది. తొలి దశ లో మండలానికో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని గతే డాది చివరిలో భూముల ప్రక్షాళనకు ప్రభుత్వం సమా యత్తమైంది. సమగ్ర రీ సర్వేకు క్షేత్రస్థాయిలో ఎదుర వుతున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో రీసర్వే ముందుకు మూడడుగులు.. వెనక్కి ఏడడు గులు అన్న చందాన తయారైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అరకొర సౌకర్యాలు కల్పించి రీ సర్వే ప్రక్రియను గడువులోగా పూర్తి చేయమనే ఆదేశాలు ప్రభుత్వం వైపు నుంచి (మిగతా 6వ పేజీలో)

మొదటి దశకు మరో వారం..

మొదటి విడతలో బాపట్ల జిల్లాలో 62,288 ఎకరాలకు సర్వే పూర్తి చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య దాదాపు 1.10 లక్షల ఎకరాలుగా ఉంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ ఇంకా 13ఏ నోటీసులు జారీ చేయడం వరకే వచ్చింది. కాగా తుది జాబితా ఆర్ వోఆర్ ప్రచురణకు మరో వారం రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



వేమూరు : కుచ్చెళ్లపాడు గ్రామంలో రీ సర్వే చేస్తున్న సిబ్బంది (పాత చిత్రం)



ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకున్న ఉపాధ్యాయులు

వెబ్ ఆప్షన్స్.. వెతలు

ఒక్కొక్కరికి గంటన్నర సమయం

- స్కూల్ అసిస్టెంట్ల బదిలీల్లో ఎడతెగని సమస్యలు
- నేటితో ముగియనున్న గడువు.. సమయం పెంచాలని విజ్ఞప్తిలు

గుంటూరు విద్య జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల సమస్యలు రోజుకు జటిలం అవుతున్నాయి. తప్పనిసరిగా(కంపల్సరీ) బదిలీ కావాల్సిన వారు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకునేందుకు ఒక్కో ఉపాధ్యాయుడికి గంట నుంచి 1.30 గంటల వరకు సమయం పడుతున్నది. ఆయా సమస్యలపై ఇప్పటికే విజ్ఞప్తులు చేసినా పరిష్కారం కావడం లేదని ఉపాధ్యాయ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ వెబ్ ఆప్షన్స్‌కు గురువారంతో గడువు ముగియనున్నది. ఈ పరిస్థితుల్లో గడువు పెంచాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. పాయింట్స్ సమానమైనప్పుడు సీనియారిటీ ప్రకారం కాకుండా పుట్టిన తేదీ తీసుకోవడం జీవో 22కు విరుద్ధమంటున్నారు. ప్రిఫరెన్షియల్ కేటగిరిలో రిక్వెస్ట్ ట్రాన్స్ఫర్ పెట్టుకున్నవారి ప్లేస్ అరైజింగ్ ఉన్నచోట ఖాళీగా కనిపించడంలేదంటున్నారు. డీఈవో కార్యాలయం విడుదల చేసిన ఖాళీలకు వెబ్ ఆప్షన్స్‌కు ఆన్‌లైన్‌లో ఉన్న ఖాళీలతో వ్యత్యాసం ఉందని ఉపాధ్యాయ సంఘాలు వెల్లడిస్తున్నాయి.

నేడు ఎస్‌జీటీలకు సర్టిఫికెట్ల పరిశీలన

మున్సిపల్, కార్పొరేషన్, జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేసే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతుల జాబితాను డీఈవోజీఎస్‌టీబ్లాగ్‌స్పాట్ అనే వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో రేణుక తెలిపారు. సంబంధిత సబ్జెక్టు, మీడియానికి సంబంధించి కార్పొరేషన్‌లో 162, మున్సిపాలిటీలో 40 పోస్టులు ఉన్నాయన్నారు. ఉద్యోగోన్నతుల అర్హతగల ఉపాధ్యాయులకు సర్టిఫికెట్ల పరిశీలన గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు గుంటూరు పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు రావాలని సూచించారు. ప్రభుత్వ యాజమాన్యంలో 50 పోస్టులు, జిల్లా పరిషత్ యాజమాన్యంలో 83 పోస్టులకు అర్హులై సర్టిఫికెట్ల పరిశీలన మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



పిన్‌కాక్ సిలాట్‌లో కానిస్టేబుల్ ప్రతిభ

జాతీయ స్థాయిలో పతకం సాధించిన నరేంద్రకు ఎస్పీ అభినందన

బాపట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి 13వ పిన్‌కాక్ సిలాట్‌లో చాంపియన్‌షిప్ 2025లో కర్లపాలెం పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్ వీరంకి నరేంద్ర అత్యుత్తమ ప్రతిభ చూపారు. రజతపతకం సాధించిన నరేంద్రను బుధవారం ఎస్పీ తుషార్‌డూడి అభినందించారు. ఇప్పటికే నరేంద్ర రెండుసార్లు జాతీయ స్థాయి మెడల్స్ సాధించాడు. ఉత్తరప్రదేశ్ లక్నోలో కెడిసింగ్‌బాబు స్టేడియంలో జరిగిన పోటీలలో రజత పతకం సాధించినట్లు నరేంద్ర తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారిని ప్రోత్సహిస్తామని ఎస్పీ తెలిపారు.

అమరావతి కేంద్రంగా.. క్వాంటం వ్యాలీ

- రాజధానిలో ఉపాధి అవకాశాలు కోకొల్లలు
- సీఆర్‌డీఏలో 50 ఎకరాల కేటాయింపునకు ఆమోదం

గుంటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీని ప్రమోట్ చేసి హైదరాబాద్‌ని దేశంలోనే ముఖ్యమైన నగరంగా సీఎం చంద్రబాబు చేశారో అంతకుమించి అమరావతిని మార్చేందుకు ప్రణాళికని రూపొందించారు. ఇందులో భాగంగానే కంప్యూటింగ్‌లో అడ్వాన్స్ అయిన క్వాంటమ్ విధానాన్ని అమరావతిలో ప్రమోట్ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం 50 ఎకరాల భూమిని ఏపీసీఆర్‌డీఏ (మిగతా 6వ పేజీలో)



క్వాంటం వ్యాలీ టెక్ పార్కు నమూనా

ఆంధ్రజ్యోతి అక్షరమే అండగా.. అభివృద్ధి




గాయత్రీ నగర్‌లో రూ.45 లక్షలతో పూర్తయిన సీసీరోడ్డు



కోట్నాస బజార్‌లో జరుగుతున్న పనులు

వినుకొండలో ముమ్మరంగా పనులపై హర్షం

వినుకొండటౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి అక్షరమే అండగా-పరిష్కారమే అజెండాగా కార్యక్రమం ద్వారా పట్టణంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జనవరి 28న చేపట్టిన కార్యక్రమంలో స్థానిక గాయత్రినగర్, కోట్నాసబజార్‌లో మాజీ



సర్పంచి పఠాన్ ఖాసిమ్‌ఖాన్ వీధిలోని సమస్యలను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు 2025 మార్చి 25న సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాల్వ పనులకు శంకు స్థాపన చేశారు. మూడు నెలల్లో గాయత్రీనగర్‌లో సుమారు రూ.45లక్షల తో సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు. కోట్నాస బ జార్‌లో రూ.17 లక్షలతో సీసీ రోడ్డుతో పాటు, డ్రెయినేజీ కాల్వ ప నులు శరవేగం గా జరుగుతున్నాయి. గతంలో మురుగునీటితో రాకపోకలకు స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతుండేవారు. ఆంధ్రజ్యోతి చేప ట్టిన కార్యక్రమం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులతో మరుగు ముప్పు తప్పిందని ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వెంటాడుతున్న.. ప్లాస్టిక్ భూతం

● నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

గుంటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మానవాళికే కాకుండా జంతుజాతులకు నేడు ప్లాస్టిక్ ముప్పుగా పరిణమించింది. ప్రపంచ వ్యాప్తంగా ఏ మూలకు వెళ్లినా ప్లాస్టిక్‌తో ఉత్పత్తి అయిన వస్తువులే కనిపిస్తున్నాయి. ప్లాస్టిక్ వలన తనకేమి కాదులే అన్న నిరక్ష్యం ప్రతీ ఒక్కరిలో గూడు కట్టుకుపోయింది. ఈ ప్రమాదాన్ని దశాబ్దాల క్రితమే గ్రహించిన యూఎన్‌వో ఏటా జూన్ 5వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఈ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. 2025 సంవత్సరానికి ప్లాసిక్ కాలుష్యాన్ని ఓడించు అన్న నినాదాన్ని ఇచ్చింది. ఇప్పటికే దీనిపై రైల్వేలో 15 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించారు.



జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని కొన్ని సంవత్సరాల క్రితమే నిషేధించారు. అయితే వాటిపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. నగరపాలకసంస్థ, మునిసిపాలిటీలు అరకొరగా దాడులు నిర్వహించి రూ. 500 నుంచి రూ. 1500 వరకు పెనాల్టీ వేయడం తప్పా ఎవరైతే వాటిని వినియోగిస్తున్నారో వాళ్లలో మార్పు తీసుకురాలేకపోతున్నాయి. నేడు ఏ వ్యాపార దుకాణానికి వెళ్లి చూసినా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, స్ట్రాలు, టార్పాలిన్ పట్టాలు, స్పూన్‌లు, వాటర్, కూల్ డ్రింక్స్ పెట్ బాటిల్స్, గ్లాసులు, రైస్‌బ్యాగులు, ఆహార పదార్థాలు ప్యాక్ చేసే ప్లాస్టిక్ డబ్బాలు, పాలప్యాకెట్లు వంటివి కనిపిస్తూనే ఉన్నాయి. రీయూ జబుల్ వస్తువులను మొక్కుబడిగా వినియోగించడం మినహా ఎప్పుడో వాటికి మంగళం పాడేశారు. స్టీలు, గ్లాసు వంటి పాత్రలను వినియోగించడం లేదు.

స్థానికంగా ప్లాస్టిక్ వస్తువుల తయారీ ఫ్యాక్టరీలుండగా, ఎక్కువగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో తయారైన ఉత్పత్తులు నిత్యం టన్నుల కొద్దీ దిగుమతి అవుతున్నాయి. వీటిని నియంత్రించే పరిస్థితి జిల్లాలో ఏ కోశాన కనిపించడం లేదు. పెనాల్టీలతో సరిపెడుతుండటం వలన వినియోగదారుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా జూట్‌బ్యాగులు, స్టీలు, గాజు పాత్రల వినియోగాన్ని ప్రోత్సహించడం లేదు. ఒక దశలో అధికార యంత్రాంగం కాస్త గట్టిగా చర్యలు తీసుకోవడంతో చాలామంది ప్లాస్టిక్‌కి ప్రత్యా మ్నాయంగా క్లాత్‌బ్యాగులు వినియోగించారు. అయితే అనతికాలంలోనే అది అటకెక్కి. మళ్లీ యధాతథ స్థితికి చేరుకున్నది. సూక్ష్మ ప్లాస్టిక్ పదార్థాలు మానవుల శరీరాల్లోకి ప్రవేశిస్తున్నాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా మార్పు రావడం లేదు.

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనేది ఒకటి ప్రతీ జిల్లాలోనూ ఉన్నది. అయితే దీనికి ఒక ఈఈ స్థాయి అధికారి, కొద్దిమంది సిబ్బంది మాత్రమే ఉంటారు. వీళ్ల ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి ఒక వారం ముందు ఎంతో ఘనంగా కరపత్రాలు, పోస్టర్లు ఆవి ష్కరింప చేస్తారు. జూన్ 5వ తేదీన ఒక ర్యాలీ, సమా వేశం నిర్వహించి మమ అనిపిస్తారు. ప్రజల్లో మార్పు తీసుకు రావడానికి నిరంతరం చేపట్టాల్సిన కార్యక్ర మాల గురించి ఏ ఒక్కరూ ఆలోచన చేయడం లేదు. అవగాహన కార్యక్రమాలు నిత్యం జరిగి ప్లాస్టిక్ వినియోగాన్ని కట్టడి చేసే చర్యలు కొనసాగితేనే కొంతలో కొంత మార్పు వస్తుంది. లేదంటే ప్లాస్టిక్ దెబ్బకు పర్యావరణం కుప్ప కూలిపోయే పరిస్థితి ఎంతో దూరంలో లేదన్నది ప్రతీ ఒక్కరూ గ్రహించాలి.

సోలార్ ప్రాజెక్టు భూముల పరిశీలన

దొనకొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): దొనకొండలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం ఎంపిక చేసిన ప్రభుత్వ భూములకు చెందిన పూర్తి వివరాలను ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ జిల్లా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. వెంకటకృష్ణారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దొనకొండలో దాదాపు ఐదు వేల ఎకరాల భూముల్లో 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందు కోసం ఎంపిక చేసిన రుద్రసముద్రం, మంగినపూడి, భూమనపల్లి గ్రామాల పరిధిలోని భూముల వివరాలను విచారించినట్లు తెలిపారు. ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన కరెంట్ ఇవ్వాలనే ధ్యేయంతో ఈ ప్రాంతంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రైతులతో రెవెన్యూ అధికారులు సంప్రదింపులు జరుపుతారని, అందరూ సహకరిస్తే త్వరలో ప్రాజెక్టు ఏర్పాటుకు అడుగులు ముందుకు పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. శ్రావణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు.. చిక్కులు

(5వ పేజీ తరువాయి)

రావడాన్ని ఉద్యోగులు తప్పుబడుతున్నారు. సిబ్బంది కొరత మూడు జిల్లాల్లో ఉన్నప్పటికీ కొత్త జిల్లాలైన బాపట్ల, పల్నాడు జిల్లాలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. దీంతో రీ సర్వే ఆశించినంత వేగంగా సాగడం లేదు. హద్దులు నిర్ణయించడానికి ఉపయోగించే రోవర్స్‌లో దాదాపు సగం సాంకేతిక సమస్యలతో పనిచేయడం లేదు. రోవర్స్‌ను బాపట్ల జిల్లాకు 119 కేటాయిస్తే 68 మాత్రమే పనిచేస్తున్నాయి. సాంకేతిక సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఉద్యోగుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే పని చేయని రోవర్స్ సంఖ్య వంద వరకు ఉండొచ్చని తెలుస్తోంది. రీ సర్వేలో సర్వే విభాగంతో పాటు రెవెన్యూ సిబ్బంది కూడా పాల్గొనాలి. అయితే రెవెన్యూలో అన్ని విభాగాల్లో కలిపి మూడు జిల్లాల పరిధిలో 320 వరకు ఖాళీలు ఉన్నట్లు సమాచారం. రీ సర్వే కార్యాలయాల్లోనూ ఖాళీలుండడం గమనార్హం. గత ప్రభుత్వం తప్పిదాలపై గ్రామసభల్లో వచ్చిన అర్జీల సంఖ్య ఒక్క బాపట్ల జిల్లాలోనే 5,900 వరకు ఉండగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య 14,000కు పైనే ఉంది. వీటి పరిష్కారం యంత్రాంగానికి తలకు మించిన భారంగా మారడంతో రీ సర్వేలో వేగం మందగించింది. రెండో దశ రీ సర్వే అంకాన్ని పూర్తి చేయడానికి ఈ నెల 6న గడువుగా ప్రభుత్వం విధించింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనిస్తే ఇప్పటి వరకు 30 శాతం కూడా రీ సర్వే పనులు పూర్తి కాలేదు. రెండో దశలో బాపట్ల జిల్లాలో 79,000 ఎకరాలకు ఇప్పటి వరకు కేవలం 26,000 ఎకరాల్లోనే పూర్తి చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

అమరావతి కేంద్రంగా.. క్వాంటం వ్యాలీ

(5వ పేజీ తరువాయి)

కేటాయించగా దానిని బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదించారు. దీంతో త్వరలోనే క్వాంటం వ్యాలీ అమరావతిలో ఏర్పాటు కానుంది. క్వాంటం కంప్యూటింగ్ అనేది ఎంతో అడ్వాన్స్ టెక్నాలజీ. క్వాంటం కంప్యూటర్లు సంప్రదాయ కంప్యూటర్ల కంటే శక్తిమంతంగా గణన చేస్తాయి, కొత్త ఔషధాల అభివృద్ధి, నమూనా రూపొందించడంలో సహకరిస్తాయి. ప్రస్తుతం పరిశోధన, అభివృద్ధి దశలో ఉండగా భవిష్యత్తులో కీలకం కానుండటంతో దానిని అందిపుచ్చుకునేందుకు సీఎం చంద్రబాబు క్వాంటం వ్యాలీని అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అమరావతిలో ఏర్పాటు చేయబోయే క్వాంటం వ్యాలీ అడ్వాన్స్ రీసెర్చ్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీలపై ఐఐటీ మద్రాసు, టీసీఎస్, ఐబీఎంతో కలిసి పని చేస్తుంది. తద్వారా అంతర్జాతీయ స్థాయి పరిశోధకులను అనువైన వేదికగా అమరావతి నిలుస్తుంది. అలానే దేశ, విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ఇప్పటికే క్వాంటం వ్యాలీకి సంబంధించిన డీపీఆర్‌ని రూపొందించి నివేదించారు. ఎల్అండ్‌టీ సంస్థ క్వాంటం వ్యాలీ టెక్ పార్కు అభివృద్ధి చేస్తుంది. ఈ నెలలో సదస్సుని అంతర్జాతీయ నిపుణులతో కలిసి నిర్వహించి అభివృద్ధి వ్యూహాత్మక ప్రణాళికలను సిద్ధం చేయనున్నారు.

ముగిసిన డీఆర్పీ శిక్షణ

ఒంగోలు విద్య, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని రామచంద్ర మిషన్‌లో గత మూడు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్(డీఆర్పీ) శిక్షణ బుధవారంతో ముగిసింది.

నల్లబర్లీ రైతులలో చిగురిస్తున్న ఆశలు

ప్రభుత్వ ఆదేశాలతో మార్క్‌ఫెడ్ అధికారుల్లో కదలిక

నాణ్యత కాపాడుకునేందుకు రైతుల పాట్లు

పంగులూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకు రైతులను ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, మార్క్‌ఫెడ్ అధికారుల కదలికలతో బర్లీ రైతులలో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రైవేటు కంపెనీలతో పాలకవర్గ నేతలు పలు దఫాలు జరిపిన చర్చలు ఆచరణలో ఆశించిన ఫలితాలివ్వక పోవడంతో నల్లబర్లీ రైతులు నిరాశకులోనయ్యారు. మంగళవారం మార్క్‌ఫెడ్ అధికారులు నల్లబర్లీ కొనుగోళ్ల కోసం గోడౌన్ల పరిశీలన చేయడం రైతుల్లో కొంత ఆత్మస్థైర్యం నింపింది. ప్రభుత్వం ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు నిల్వలను సేకరించింది. కొనుగోళ్ల విషయంలో ప్రైవేట్ కంపెనీలు వ్యవహరిస్తున్న తీరును గుర్తించిన ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా వెలువడే కార్యాచరణ ప్రణాళిక కోసం ఎదురు చూస్తున్నారు.



పొగాకు మండెను తిరగేస్తున్న రైతులు

మండలంలో 47,108 క్వింటాళ్ల నిల్వలు

పంగులూరు మండలంలో 47,108 వేల క్వింటాళ్ల నల్లబర్లీ పొగాకు నిల్వ ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇందులో టాప్‌లీఫ్ 33 వేల 894 క్వింటాళ్లు కాగా, అడుగులు 13,214 వేల క్వింటాళ్లు నమోదైంది. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం త్వరితగతిన నల్లబర్లీ కొనుగోళ్లు చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలం

అద్దంకి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చినహనిమిరెడ్డి చెప్పారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బుధవారం అద్దంకిలో శింగరకొండ రోడ్డులోని వైసీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ భవానీసెంటర్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. వైఎస్ రాజశేఖరరెడ్డి, పొట్టి శ్రీరాములు, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. అనంతరం తహసీల్దార్ శ్రీచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు జ్యోతి హనుమంతరావు, కాకాని రాధాకృష్ణమూర్తి, అడవి శ్రీనివాసరావు, పులికం కోటిరెడ్డి, కోయి అంకారావు, ఈదా శ్రీనివాసరెడ్డి, కొల్లా భువనేశ్వరి, నాగేశ్వరరావు, కృష్ణబాబు, రావూరి శ్రీను, పాలపర్తి శ్రీధర్ పాల్గొన్నారు.



పర్చూరులో ర్యాలీ చేపడుతున్న వైసీపీ నేతలు

పర్చూరులో వైసీపీ నిరసన ర్యాలీ

పర్చూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీలను అమలు చేయటంలో ప్రభుత్వం విఫలమైందని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి గాదె మధుసూదన్‌రెడ్డి చెప్పారు. వైసీపీ నిరసన ర్యాలీ కార్యక్రమం చేట్టింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొల్లా వెంకట్రావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు భవనం శ్రీనివాసరెడ్డి, జువ్వా శ్రీనివాసరావు, ముప్పాళ్ల రాఘవయ్య, గాజుల రమేష్, జంగా అనిల్, యద్దనపూడి హరిప్రసాద్, కఠారి అప్పారావు, తోకల కృష్ణమోహన్, గేరా స్వరాజ్ పాల్గొన్నారు.

కూటమి మాటలు ఉత్త మూటలు

చీరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మాటలు గాలి మూటలని, ప్రజలను నట్టే ముంచారని పలువురు వైసీపీ నేతలు విమర్శించారు. ఆ పార్టీ రాష్ట్ర వ్యాప్త ఆదేశాల పిలుపు మేరకు నియోజకవర్గ ఇంచార్జి కరణం వెంకటేష్ ఆదేశాలతో చీరాలలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు బొనిగల జైసన్‌బాబు, వాసు, కబీర్, రమణారెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్లలో భారీ అగ్నిప్రమాదం

రూ.40లక్షల ఆస్తినష్టం

మేదరమెట్ల, జూన్ 4(సెప్టెంబరు): షార్ట్‌సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం చోటుకుంది. మంగళవారం అర్ధరాత్రి మేదరమెట్ల సెంటర్‌లోని పుస్తకాలు, బ్యాగులు, ఫ్యాన్సీ వస్తువులు అమ్మే దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగి మొత్తం కాలిపోయాయి. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నందున దుకాణ యజమాని పి. వాసు పెద్ద ఎత్తున పుస్తకాలు, బ్యాగులు, ఇతర వస్తువులు తెప్పించి నిల్వ చేశారు. ప్రతిరోజు అక్కడే నిద్రించే అతను మంగళవారం మాత్రం తాళం వేసి ఇంటికి వెళ్లారు. అయితే అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్ మంటలు రేగగా వాటిని చూసిన స్థానికులు వాసుకు సమాచారం అందించారు. అతను వెంటనే అద్దంకి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శాఖ అధికారి వెంకట్రావు తన సిబ్బందితో వచ్చి నాలుగు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. చుట్టుపక్కల గృహాల వారు ఈ ప్రమాదంతో భయకంపితులయ్యారు. ఫైరింజన్ సకాలంలో రావడంతో ఊపిరిపీల్చుకున్నారు. బుధవారం పగలంతా కూడా పొగలు వస్తూనే ఉన్నాయి. దీంతో స్థానికులు ట్రాక్టర్ ట్యాంకర్‌తో నీళ్లు తెప్పించి దుకాణంలో చల్లారు. ఈ ఘటనలో వాసు పెంపుడు కుక్కలు లోపలే ఉండగా అవి తెలివిగా బాత్రూంలో దాక్కోవడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది తీవ్ర ప్రయత్నం చేసి వాటిని కాపాడారు. షాపులో దాదాపు రూ.40లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వాసు తెలిపారు.



మంటలు చెలరేగడంతో బాత్రూంలోకి వెళ్లి ప్రాణాలను రక్షించుకున్న కుక్కలు



దుకాణంలో చెలరేగిన మంటలు

వైట్ క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై దాడి

ఎక్స్‌కవేటర్, టిప్పర్ స్వాధీనం

వెలికితీసిన తెల్లరాయి సీజ్

ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న అధికారులు

పీసీపల్లి, జూన్4 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా తెల్లరాయిని వెలికితీసి సొమ్ము చేసుకుంటున్న అక్రమ క్వారీయింగ్‌పై అధికారులు దాడి చేశారు. రెవెన్యూ, అటవీశాఖ, మైనింగ్ అధికారులు మంగళవారం రాత్రి సంయుక్తంగా దాడులు చేసి యంత్రాలతో పాటు వెలికితీసిన తెల్లరాయిని స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మురుగుమ్మి సమీపంలోని అనాధీన భూములతో పాటు అటవీ భూముల్లోకి కొంతమంది అక్రమంగా ప్రవేశించి ఎటువంటి అనుమతులు లేకుండా యంత్రాలతో తెల్లరాయిని వెలికితీస్తున్నారు. వెలికితీసిన రాయిని వాహనాల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే కొంతమంది వ్యక్తులు ఈ విషయాన్ని అటు మైనింగ్ ఇటు అటవీ, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు.దీంతో మైనింగ్ అధికారి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో పోలిరెడ్డి తమ సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి అక్రమ క్వారీయింగ్ జరుగుతున్న ప్రాంతానికి మంగళవారం రాత్రి వెళ్లారు. అక్కడ రాయిని వెలికితీస్తున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వెలికితీసి ఉన్న తెల్లరాయిని సీజ్ చేశారు. ఆ ప్రాంతంలో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్లతో అధికారులు

జగన్ చెప్పారు.. చేశామంతే!

నాయకులు తప్ప సామాన్యులు లేరు

పసలేని ప్రసంగాలతో తుస్

కందుకూరు, పర్చూరులో తోలారు

వైసీపీ వెన్నుపోటు దినం కార్యక్రమం స్పందన అంతంతే

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

విపక్ష వైసీపీ వివాదాస్పదమైన నినాదంతో చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొక్కుబడిగా సాగింది. జగన్ చెప్పారు చేయక తప్పదు కదా అన్న చందంగా కొన్ని ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించగా కొన్నిచోట్ల సర్వశక్తులొడ్డి కార్యక్రమం నిర్వహణ పర్వాలేదనిపించారు. ఆ పార్టీ నాయకుల్లో కదలిక కనిపించినా చాలామంది కార్యకర్తలు, అంతకు మించిన సామాన్య ప్రజలు వారి కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లా మొత్తంగా తీవ్రంగా ప్రయత్నించి కార్యకర్తలను సమీకరించటం ద్వారా కందుకూరు, పర్చూరులో జరిగిన కార్యక్రమాలు ముందు వరుసలో ఉండగా మిగిలిన చోట్ల సాదాసీదాగా కార్యక్రమాలు జరిగాయి. ఇక కూటమి పార్టీలు హడావుడిగా ఇచ్చిన పిలుపునకు అనుగుణంగా ఆ పార్టీశ్రేణులు నిర్వహించిన విజయోత్సవ సంబరాలు అంతంతమాత్రంగా సాగాయి.

రాష్ట్రంలో గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెల్లడైన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా వెన్నుపోటు దినం పేరుతో నియోజకవర్గాల వారీ కార్యక్రమాల నిర్వాహణకు వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో కూటమి పార్టీలు విజయం 4వతేదీ ఖరారైనా జూన్ 12న మాత్రమే ప్రభుత్వం అధికారాన్ని చేపట్టింది. దీంతో 12వతేదీకి తమ ప్రభుత్వానికి ఏడాది పూర్తవుతుందని అభివృద్ధి ఫలాల విజయోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని తెలుగుదేశం పార్టీ ఇప్పటికే ప్రకటించింది. అయితే జగన్ ఫలితాలు వచ్చిన రోజునే వెన్నుపోటు దినంగా ప్రకటించటంతో ఆ నినాదమే వివాదాస్పదంగా మారింది. అయినా నియోజకవర్గాల వారీ కార్యక్రమాన్ని భారీగా జయప్రదం చేయాలని వైసీపీ అధినేతలు జిల్లా, నియోజకవర్గాల నాయకులపై తీవ్రమైన వత్తిడి తెచ్చారు. వారంరోజుల నుంచి ఆ పార్టీ నాయకులంతా ఈ కార్యక్రమం విజయవంతం చేసే పనిలోనే నిమగ్నమయ్యారు. నాయకులను కదిలించటం, కార్యకర్తల వద్దకు వెళ్లటం, ప్రజలను సమీకరించేందుకు సర్వశక్తులొడ్డారు. అయితే ఎన్ని ప్రయత్నాలు చేసినా కార్యక్రమానికి సామాన్య ప్రజలు దూరంగా ఉండటం విశేషం. బుధవారం జరిగిన అన్ని కార్యక్రమాలను పరిశీలించగా ముఖ్యమైన నాయకులు వారి మాట కాదనలేని ద్వితీయశ్రేణి నాయకులు మాత్రమే కార్యక్రమాల్లో పాల్గొనటం కనిపించింది. సాధారణ కార్యకర్తలు కూడా కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. వైసీపీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు విశ్వప్రయత్నం చేసినా నాయకులు తప్పా సామాన్య కార్యకర్తలు కదలకపోవటం చర్చనీయాంశమైంది.

డబ్బు, వాహనాలతో సమీకరణ

జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో జరిగిన కార్యక్రమాలను పరిశీలిస్తే పర్చూరు, కందుకూరులో జరిగిన నిరసన కార్యక్రమాల్లో కాస్తంత ఎక్కువ సంఖ్యలో ఆ పార్టీశ్రేణులు పాల్గొన్న దాఖలాలు కనిపించాయి. పర్చూరులో 350 నుంచి 400 మంది వరకు నిరసన ర్యాలీలో పాల్గొనగా, కందుకూరులో 500మంది పాల్గొన్నారు. అయితే ఈ రెండుచోట్ల ఆ మాత్రం కార్యకర్తల సమీకరణకు బాగా కష్టపడ్డారు. వాహనాలు ఏర్పాటు చేయటం, భోజనాలు ఏర్పాటులాంటి అదనపు చర్యలు ఎక్కువగా కనిపించాయి. పర్చూరుకు కొత్తగా ఇన్‌చార్జి అయిన మధుసూదన్ రెడ్డి ప్రత్యేక దృష్టితో ఏర్పాటు చేసుకున్నారు. కందుకూరు ఇన్‌చార్జి మధుసూదన్ యాదవ్ మాజీ మంత్రి మహీధర్‌రెడ్డి సహకరించకపోయినా తనకు పట్టుందని నిరూపించుకునేందుకు సామదాన దండోపాయాలు ఉపయోగించి కార్యకర్తలను సమీకరించారు. కనిగిరిలో ర్యాలీకి కార్యకర్తల సమీకరణకు డబ్బులు పంపిణీ చేయటం విశేషం. మిగిలిన అన్నీ ప్రాంతాలను పరిశీలిస్తే ఒకొక్క చోట కనీసం 70 మంది నుంచి 250 మందికిలోపే కార్యక్రమాల్లో ఆ పార్టీశ్రేణులు పాల్గొన్నట్లు వెల్లడైంది. అసలు ఈ కార్యక్రమం నిర్వహణ కరెక్టు కాదేమో.. నినాదం కూడా బాగా లేదేమో అన్న అనుమానాలను కార్యక్రమాల్లో పాల్గొన వైసీపీ శ్రేణులు వ్యక్తం చేయటం విశేషం.

హడావుడి కార్యక్రమం

కూటమి భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేనలు బుధవారం సాయంత్రం విజయోత్సవ కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. అది ఆఖరు క్షణంలో హడావుడిగా పిలుపునివ్వటం విశేషం. ఉమ్మడి జిల్లానే పరిశీలిస్తే హడావుడిగా పిలుపునివ్వటంతో అందుబాటులో లేక ఆ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఎక్కువచోట కార్యక్రమాల్లో పాల్గొనలేదు. నిర్వహించిన చోట స్థానికంగా ఉన్న కార్యకర్తలు బాణసంచాలుపేలవటంలాంటి మొక్కుబడి కార్యక్రమాలు నిర్వహించారు.

అవీఇవీ

పచ్చిరొట్ట పంట సాగుతో భూసారం పెంపు



రైతులకు సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ముందుగా వర్షాలు పడుతున్నందున రైతులు పచ్చిరొట్ట పంటసాగు చేపట్టి భూసారం మరింత పెంచుకోవాలని, ఏవో సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని బూదవాడ, కోటపాడు, కల్లంవారిపాలేల్లో బుధవారం ఖరీఫ్ సన్నద్ధత కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రైతు భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలకు అనుగుణంగా పంటసాగులో ఎరువులు, పురుగు మందులు వినియోగం చేపట్టాలన్నారు. కౌలు రైతులు సాగుదారు హక్కు పత్రాలు పొందడం ద్వారా ప్రభుత్వం అందచేసే రాయితీలు పొందుతారని చెప్పారు. సమావేశాలలో వ్యవసాయ సహాయకులు అలెగ్జాండర్, అక్షరరాణి, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, గుదిబండ్ల చిన ఆదిరెడ్డి పాల్గొన్నారు.

విద్యతో పాటు చక్కని బుద్ధులు నేర్పండి

డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి

చీరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : విద్యాభ్యాసానికి వచ్చే విద్యార్థులకు విద్యతో పాటు చక్కని బుద్ధులు నేర్పాలని డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి చెప్పారు. స్థానిక వీఆర్ఎస్ అండ్‌వైఆర్ఎన్ కళాశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని డిప్యూటీ కలెక్టర్ పరిశీలించారు. శిక్షణలో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఏఎమ్‌వో డాక్టర్ మోజెస్ కోర్స్ డైరక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

కూటమి పండుగ

ప్రజా తీర్పుకి ఏడాది పూర్తి

సంబరాలు నిర్వహించిన టీడీపీ, జనసేన శ్రేణులు

పలుచోట్ల కేక్ కటింగ్‌లు

ఒంగోలు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి గెలిచి ఏడాది పూర్తయిన స ందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా టీడీపీ, జనసేన శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పలుప్రాంతాల్లో కేక్ కటింగ్‌లు, బాణసంచా సంబరాలతోపాటు ముగ్గులు వేసి ఆనందం వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనకు చమరగీతం పాడుతూ ప్రజానీకం ఇచ్చిన తీర్పు గత ఏడాది జూన్ 4న వెల్లడైంది. జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ టీడీపీ కూటమి అనూహ్య విజయాలు సాధించి అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. కాగా కూటమికి పట్టం కడుతూ ప్రజాతీర్పు వెల్లడైన బుధవారం నాటికి ఏడాది ముగియడంతో పెద్ద ఎత్తున ఆ పార్టీలు సంబరాలు చేసుకున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఈసందర్భంగా ఒక వైపు టీడీపీ శ్రేణులు, మరో వైపు జనసేన శ్రేణులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో బుధవారం ఉదయం కేక్ కటింగ్ నిర్వహించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. స్థానిక మంగమూరురోడ్డులోని సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ నేతల సమక్షంలో బీఎన్ విజయకుమార్ కేక్ కటింగ్ చేశారు. స్థానిక ప్రగతి కాలనీలో జనసేన వీరమహిళలు ముగ్గులు వేసి సంబరాలు నిర్వహించగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు. రాత్రి అద్దంకి బస్టాండు సెంటర్‌లో ఒంగోలు నియోజకవర్గ నాయకులు నిర్వహించిన సంబరాల్లో ఒంగోలు ఎంపీ మాగుంట, పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, మేయర్ గంగాడ సుజాతలు పాల్గొన్నారు. పెద్దఎత్తున బాణసంచాను కాల్చి సంబరాలు నిర్వహించారు. మార్కాపురంలో టీడీపీ నేత కందుల రామిరెడ్డి నేతృత్వంలో ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు నిర్వహించగా దర్శిలో ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అలాగే కొమరోలులో గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, వైపాలెంలో అక్కడి టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబులు పాల్గొన్నారు. జిల్లాలోని పలు ఇతర ప్రాంతాల్లోనూ అక్కడి టీడీపీ, జనసేన శ్రేణులు సంబరాలు నిర్వహించారు.

జిల్లాలో 474 మందికి ఉద్యోగోన్నతులు

ఒంగోలు విద్య, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 474 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూలు అసిస్టెంట్లు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు లభించనున్నాయి. కొత్తగా పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు 105 మంజూరు కావడంతో ఎస్‌జీటీలకు పీఎస్‌హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతుల అవకాశాలు మరింత పెరిగాయి. జిల్లాలో మిగులుగా తేలిన 509మంది స్కూలు అసిస్టెంట్లను పీఎస్‌హెచ్‌ఎంలుగా నియమించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ మేరకు ఉత్తర్వులు కూడా జారీచేసింది. వీరిలో 404 మంది స్కూలు అసిస్టెంట్లను మాత్రమే హెచ్‌ఎంలుగా నియమించారు. మిగిలిన 105 పోస్టులను ప్రస్తుతం ఎస్‌జీటీలకు ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీచే స్తున్నారు. మొత్తం 474 ఉద్యోగోన్నతుల్లో జిల్లా పరిషత్ యాజమాన్యంలోని హైస్కూళ్లు, యూపీ స్కూళ్లు, ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో 312మందికి, ప్రభుత్వ యజమాన్యంలోని పాఠశాలల్లో 98 మందికి, మునిసిపాల్టీల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న 37మందికి, ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 27మందికి ఉద్యోగోన్నతులు లభించనున్నాయి. మొత్తం ఉద్యోగోన్నతుల్లో 172 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు, 67 ఫిజికల్ డైరెక్టర్లు, స్కూలు అసిస్టెంట్లు తెలుగు 25, ఉర్దూ రెండు, హిందీ 29, ఇంగ్లీషు 22, గణితం(తెలుగు) 44, గణితం(ఉర్దూ) 2, ఫిజికల్ సైన్స్ (తెలుగు)16, పీఎస్(ఉర్దూ) 4, బయాలాజికల్ సైన్స్(తెలుగు)40, బీఎస్(ఉర్దూ) 3, సోషల్ (తెలుగు) 38, ఎస్ఎస్(ఉర్దూ) 1, స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు 8 ప్రస్తుతం ఉద్యోగోన్నతులు ద్వారా భర్తీచేస్తున్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

స్కూలు అసిస్టెంట్లు, పీఎస్ హెచ్‌ఎం పోస్టులకు అర్హులైన సెకండరీ గ్రేడ్ టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం స్థానిక డీఆర్ఆర్‌ఎం హైస్కూలులో నిర్వహించారు. ఒక్కొక్క పోస్టుకు ముగ్గురు చొప్పున 474 పోస్టులకు 1,422మంది ఎస్‌జీటీల సర్టిఫికెట్లు పరిశీలించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రత్యేక టీమ్‌లు సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. ఎస్‌జీటీల సర్వీసు రిజిస్టర్లు, విద్యార్హతల ఒరిజనల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలనను డీఈవో కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు.

ఆలయ భూముల కౌలు వేలం

ఒంగోలు(రూరల్), జూన్4(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలులోని శ్రీచెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామివారి దేవాలయ భూములకు బుధవారం దేవదాయశాఖ అధికారులు కౌలు వేలం వేశారు. స్థానిక ఆలయంలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 385 ఎకరాలకు గాను 63ఎకరాలకు మాత్రమే వేలం జరిగింది. వాటిని రూ.7.24లక్షలకు పాటదారులు పాడుకున్నారు. ఈ భూములు కొణిజేడు, సర్వేరెడ్డిపాలెం గ్రామాల పరిధిలో ఉన్నాయి. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఈవో సునీల్‌కుమార్, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

రేపు అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మార్టూరు, జూన్4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వలపర్ల గ్రామంలో శుక్రవారం శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ వాయు ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని భక్తులు ఊరేగించారు. అదేవిధంగా శుక్రవారం పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు.

7 నుంచి అంకమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మార్టూరు, జూన్4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో ఈ నెల 7వ తేదీ నుంచి అంకమ్మతల్లి శక్తి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు సంబంధించి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. 7 నుంచి 10వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారని, 10వ తేదీ సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. భారీగా అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు.

నేడు మండలంలో మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం మండలంలో పర్యటించనున్నారు. 5వ తేదీ ఉదయం 10 గంటలకు కొండమూరు, 10.45 నిమిషాలకు చందలూరు, 11.30 నిమిషాలకు కొరిశపాడు మండలం రావినూతల, మధ్యాహ్నం 12 గంటలకు మేదరమిట్ల ఎస్.బి. కన్వెన్షన్ హాల్, 12.30 నిమిషాలకు తమ్మవరం, మధ్యాహ్నం ఒంటి గంటకు బొడ్డువానిపాలెంలో మంత్రి గొట్టిపాటి పర్యటిస్తారని క్యాంప్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

శింగరకొండ వద్ద గోశాలకు స్థలం

అద్దంకి, జూన్4(ఆంధ్రజ్యోతి): హరిహర గోకులానికి శింగరకొండ వద్ద స్థలం కేటాయింపునకు చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో గోశాలకు అవసరమైన స్థలాన్ని పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. శింగరకొండ వద్ద శ్రీరామజీ వన సంఘం అన్నదాన సత్రం పక్కన ఉన్న స్థలం గోశాలకు అనువుగా ఉంటుందని గుర్తించామన్నారు.

చంద్రబాబు ఏడాది పాలనలో అభివృద్ధిలో ముందడుగు

● ఎంపీ మగుంట

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ళకాలంలో నిర్వీర్యమైన రాష్ట్ర అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు భారీ మెజార్టీని ప్రజానీకం ఇచ్చారని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడటంతో పాటు ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. బుధవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎంపీ మాగుంట మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడటం ద్వారా రాష్ట్రంలో ఏకపక్షంగా ఫలితాలు వచ్చాయన్నారు. అందులో భాగంగానే జిల్లాలో కూడా టీడీపీ భారీ విజయం సాధించిందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకొని పోతుందన్నారు. ఇదే స్ఫూర్తితో ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా చేసుకునేందుకు కూడా అవకాశం ఏర్పడిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టుతో పాటు జిల్లాకు అనేక పరిశ్రమల ద్వారా అభివృద్ధి చెందేందుకు దోహదపడుతుందన్నారు. టీడీపీని మరింత బలోపేతం చేసే దిశగా తనవంతు కృషి చేస్తానని మాగుంట తెలిపారు.

స్వచ్ఛమైన పర్యావరణంతో భవిష్యత్తు తరాలకు మేలు

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

పర్యావరణ పరిరక్షణకు ప్రోత్సాహకాలు అందిస్తున్న ప్రభుత్వం

చీరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛమైన పర్యావరణంతోనే భవిష్యత్తు తరాల మనుగడ ఆధారపడి ఉంది. అంతేగాక పాటు జంతువులు, పక్షులు తదితరాల జీవవైవిధ్యం సైతం పర్యావరణ రక్షణతోనే ముడిపడి ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే పర్యావరణ పరిరక్షణ ప్రజల ఉనికికే అతి ముఖ్యమైనది. అందమైన సూర్యోదయం, సెలయేటి పరవళ్ళు, ఆహ్లాదకరమైన పూల తోటలు, జంతువులు, పశుపక్ష్యాదులు ఇవన్నీ కూడా మనతోపాటే సహజీవనం సాగించినప్పుడే జీవనం సుందరంగా, ఆనందంగా ఉంటుంది. అలా జరగాలంటే అందరికీ స్వచ్ఛమైన వాతావరణం అందించాలి. ఈ తరహా నినాదం ప్రజల్లో నిలిస్తేనే అందరికీ ఆరోగ్యం.

కాలుష్యం కోరల్లో ప్రాంతాలు

ప్రకృతిదైనందిన జీవితంలో భాగమైనప్పుడే మానవుడు ఆరోగ్యంగా జీవిస్తాడు. ప్రస్తుత పరిస్థితులు అందుకు అతి భిన్నంగా సాగుతున్నాయి. పెరిగిన జనాభా, వాహన రద్దీతో ధ్వని కాలుష్యం, వాయుకాలుష్యం, నీటి కాలుష్యం వంటి సమస్యలు తాండవం చేస్తున్నాయి. ఈ కాలుష్యంతో ప్రమాదం పొంచి ఉండటంతో పాటు, ప్లాస్టిక్ మహమ్మారి తోడవడంతో ప్రజలతో పాటు, మూగ జీవాలు సైతం ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి.


పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి, సంరక్షిస్తున్న టీచర్లు, విద్యార్థులు(ఫైల్)

ప్లాస్టిక్ నియంత్రణకు జోరుగా ప్రచారాలు

దేశమంతా ప్లాస్టిక్‌ను నియంత్రించాలని, 2022 నుంచే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై విస్తృతంగా ప్రచారాలు చేశారు. ఆ క్రమంలోనే 2022 జూలై 1న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల తయారీతో పాటు, ఎగుమతులు, దిగుమతులు నిలిపివేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు కూడా వెలువడ్డాయి. దీంతో వస్త్రసంచులు పంపిణీలతో పాటు ప్రోత్సాహకాలు అందించడంతో కొంతమేరకు కదలిక వచ్చింది. కాలక్రమేణా అవి ప్రచారాలకే పరిమితమయ్యాయి.

పర్యావరణ పరిరక్షణకు ప్రోత్సాహకాలు

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమర్థ చర్యలతో తిరిగి పర్యావరణ పరిరక్షణకు బాటలు పడుతున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలతోపాటు మొక్కలు నాటి వాటిని పరిరక్షించే విధంగా చర్యలు చేపట్టింది. అలాగే పాఠశాలల్లో సైతం బాలబాలికలకు పర్యావరణంపై మక్కువ పెంచుతూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొంత ప్రజల్లో కూడా ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది రోజులకే పరిమితం కాకుండా నిత్యకృత్యంగా మారినప్పుడే ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుంది.

పాలిథిన్ ప్రమాదమని గుర్తించాలి

పవని భానుచంద్రమూర్తి, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్


పవన్ నుంచి అవార్డు అందుకుంటున్న భానుచంద్రమూర్తి

ప్రజలు ప్లాస్టిక్ వాడకంపై అవగాహన ఉండాలి. ఉదాహరణకు ప్లాస్టిక్ కుర్చీలు ఇంట్లో ఎన్నైనా ఉండవచ్చు. వాటిని ఒకదానిపై ఒకటి సర్దుకోవచ్చు. అలా కాదనకుంటే ఒక ఇంట్లో కనీసం ఐదు చెక్క కుర్చీలు ఉండాలంటే ఎన్ని చెట్లు నరకాలో గుర్తెరగాలి. ప్రతి ఒక్కరికీ పాల ప్యాకెట్ కావాలంటే సంబంధిత ఫ్యాక్టరీ నుంచి దుకాణాలకు ఎలా వస్తుంది ? కొనుగోలుదారులు ప్యాకెట్‌ను ఇంటికి ఎలా తెస్తారు ? వీటన్నింటిపై ముందు అవగాహన పొందాలి. కొనుగోలు చేసిన ప్లాస్టిక్‌ను వినియోగం అనంతరం చెత్త సేకరణ ప్రాంతానికి చేరేలా దృష్టి సారించాలి. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే ఇవన్నీ సాధ్యం. ఈక్రమంలో నిర్వహించిన రీసెర్చ్‌లలోనే ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డును సాధించగలిగాను.

తెలుగు యువత ఆధ్వర్యంలో సంబరాలు


అద్దంకిలోని బంగ్లా రోడ్డులో టపాసులు పేల్చుతున్న తెలుగు యువత


పర్చూరులో టపాసులు పేల్చుతున్న టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు

అద్దంకి, జూన్4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం రాత్రి తెలుగుయువత ఆధ్వర్యంలో టపాసులు,బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. తెలుగుయువత నేతలు దామా సురేంద్ర, చిరుమామిళ్ల మాధవరావు తదితరుల ఆధ్వర్యంలో స్థానిక బంగ్లా రోడ్డులో పెద్ద ఎత్తున టపాసులు, బాణసంచా కాల్చారు. టీడీపీ నేతలు నరసింహ, కోటి, కపిల్, జనసేన నేత గోరంట్ల సాయి పాల్గొన్నారు.

పర్చూరులో మూడు పార్టీల ఆధ్వర్యంలో...

పర్చూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్ సైకో పాలన పడిపోయి ప్రజా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలం పూర్తిచేసుకున్న నేపథ్యంలో అందకారం నుంచి రాష్ట్రం విముక్తి అయిన రోజుగా బుధవారం పీడ విరగడై ఏడాది అనే కార్యక్రమంపై జనసేన పిలుపు మేరకు కూటమి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పర్చూరు బొమ్మల సెంటర్‌లో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. తొలుత ఎన్టీఆర్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, వంగవీటి మోహన్‌రంగా విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరాలలో విజయ సంబరాలు

చీరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి అధికారం చేపట్టి ఏడాది కావడంతో నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం విజయ సంబరాలు జరిగాయి. ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రానికి పీడ విరగడయి యేడాది జరిగిందని అన్నారు. రాష్ట్రంలో కూటమి అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, కౌన్సిలర్ మించాల సాంబశివరావు, నాయకులు నాసిక వీరభద్రయ్య, గంజి పురుషోత్తం, శివరామప్రసాద్, పద్మిని పాల్గొన్నారు.


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

తైక్వాండో విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్‌లు అందజేత

చినగంజాం, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : చినగంజాం తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో వివిధ కేటగిరీలలో బెల్ట్ ప్రమోషన్ నిర్వహించినట్లు తైక్వాండో కోచ్ వాటుపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తైక్వాండో జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్‌సలాం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో కే గిరిజారెడ్డి ప్రమోట్ అయినట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు వివిధ కేటగిరీ బట్టి బెల్ట్ ప్రమోషన్‌ల సర్టిఫికెట్‌లను కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, వై.రామాంజనేయులు, కడవకుదురు గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఎం.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.


బెల్ట్‌లు, సర్టిఫికెట్‌లను అందజేస్తున్న తైక్వాండో అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు

జనాభా నిర్వహణపై అభిప్రాయ సేకరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి, అధికారులు

పంగులూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జనాభా నిర్వహణ విధానంపై క్యూఆర్ కోడ్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిందని, ఇందులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి కోరారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అభిప్రాయ సేకరణ కోసం క్యూ ఆర్ కోడ్‌తో కూడిన బ్రోచర్‌ను అధికారులు, పంచాయితీ కార్యదర్శులతో కలసి ఆవిష్కరించారు. ఈ నెల 1 నుంచి 20వ తేదీలోపు క్యూ ఆర్ కోడ్‌లో ప్రభుత్వం పొందుపరిచిన విషయాలపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, కార్యదర్శులు రాంబాబు, సునీత, శ్రీనివాసరావు, జానీ బేగం, మాధవి, చరణ్ పాల్గొన్నారు.

గోవధకు పాల్పడితే కఠిన చర్యలు

చీరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని వ్యవసాయాధారిత గోవధకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు హెచ్చరించారు. బుధవారం ఆయన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి వీటిపై ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. వ్యవసాయాధారిత జీవులను వధించడంపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీఎండీ మొయిన్, సీఐ సుబ్బారావు, మునిసిపల్ డీఈ రఘురామ్ హాజరయ్యారు.


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కారంచేడు - పర్చూరు రోడ్డులో ఘటన

కారంచేడు/పర్చూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం కారంచేడు అంబేద్కర్ కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన వేముల శివయ్య(57) మృతి చెందాడు. కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న శివయ్య చీరాల నుంచి తన స్వగ్రామం నూతలపాడు ద్విచక్రవాహనంపై వెళతూ వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. క్షతగ్రాత్రున్ని 108 వాహనం ద్వారా చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా ఆయన మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై కారంచేడు పోలీసుల కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, కుమార్తె కుమారుడు ఉన్నారు.


వేముల శివయ్య మృతదేహం

బీమా పథకంలో ప్రతి ఒక్కరూ పేరు నమోదు చేయించుకోవాలి

అవీఇవీ


భీమా నగదు చెక్కును అందజేస్తున్న చీఫ్ మేనేజర్ శీనానాయక్

బల్లికురవ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న భీమా పథకాలలో ఖాతాదారులు నమోదు కావాలని బల్లికురవ ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చీఫ్ మేనేజర్ కె. శీనానాయక్ కోరారు. మండలంలోని కొండాయపాలేనికి చెందిన తన్నీరు శ్రీను అనే వ్యవసాయ కూలీ ఇటీవల ఉపాధి పనులు చేస్తూ అస్వస్థతకు గురై మృతి చెందాడు. అతను బల్లికురవ ఏపీజీబీ బ్యాంకులో ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా పథకంలో నమోదు చేసుకుని ఉన్నారు. దీంతో భీమా ద్వారా మంజూరైన రూ. 2 లక్షల నగదు చెక్కును బుధవారం చీఫ్ మేనేజర్ శీనానాయక్ మృతుడి భార్య శాంతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సీహెచ్ రవీంద్రబాబు, అసిస్టెంట్ మేనేజర్లు సుహితా గ్రేస్, బిందుమాధవి పాల్గొన్నారు.

పాఠశాలల్లో నాణ్యమైన బియ్యంతో భోజనం


ఆహారాన్ని రుచి చుస్తున్న ఎంఈవో రమేష్

బల్లికురవ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన సన్న బియ్యంతో విద్యార్థులకు శుచిరుచిగా భోజనం అందజేస్తామని ఎంఈవో రమేష్ చెప్పారు. బుధవారం బల్లికురవ ఎంఆర్‌సీ కార్యాలయంలో మండలంలోని 58 పాఠశాలలకు చెందిన కుకింగ్ సిబ్బందికి శిక్షణ జరిగింది. శిక్షకురాలు వంట తయారు చేసే విధానంపై పలు సూచనలు చేశారు. ఎంఈవో రమేష్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు వంట తయారు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన వంట తయారీదారులు చేసిన భోజనాన్ని ఎంఈవో తిని వారికి పలు సూచనలు చేశారు.

ఘనంగా లక్ష్మీఅంకమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవం


అలంకరణలో లక్ష్మీఅంకమ్మ తల్లి

బల్లికురవ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినఅంబడిపూడి గ్రామంలో ఉన్న లక్ష్మీఅంకమ్మ తల్లి దేవాలయ 27వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పూజలలో పాల్గొన్నారు. గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

ఖరీఫ్‌లో సాగుకు సమాయత్తం

రైతులతో అధికారులు అవగాహన కార్యక్రమాలు


మాట్లాడుతున్న వ్యవసాయ మండల అధికారి సుమతి

చీరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయాధికారులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు రైతులను సన్నద్ధం చేస్తున్నారు. చీరాల మండల పరిధిలో ఏవో సుమతి ఆధ్వర్యంలో విజయనగర్ కాలనీ, బోయినవారిపాలెం ప్రాంతాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే వేటపాలెం మండల పరిధిలో ఏవో కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో దేశాయిపేటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ వారంలోనే పంట కాలువలకు ఎత్తిపోతల నుంచి సాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. ఆయా పంటల విధివిధానాలపై రైతులతో చర్చించి పలు సూచనలు చేశారు.

యోగాంధ్రలో సత్తాచాటిన చిన్నారులు

ప్రథమ స్థానంలో నిలిచిన మనస్వి


చిన్నారులచే నిర్వహిస్తున్న యోగా పోటీలు

పర్చూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంఈవో కార్యాలయ ప్రాంగణంలో మండల స్థాయిలో బుధవారం నిర్వహించిన యోగాంధ్ర పోటీల్లో చిన్నారులు సత్తాచాటారు. ప్రథమ స్థానంలో ఆరో తగరతి విద్యార్థిని కొమ్మాలపాటి మనస్వి ప్రథమ స్థానంలో నిలిచారు. అదేవిధంగా కన్నా వేదనిఖిత ద్వితీయస్థానం, కోటా కార్తీక తృతీయస్థానం కైవసం చేసుకున్నారు. మండల స్థాయి విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామని యోగా పర్యవేక్షకులు, హోమియో వైద్యులు దాసరి చంద్రశేఖర్ చెప్పారు. పోటీలను ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, యోగా శిక్షకులు కఠారి సత్యనారాయణ, కొసనా వెంకటేశ్వర్లు, యార్లగడ్డ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌రావులు పర్యవేక్షించారు.

వెంకటాపురంలో ఆలయ భూముల పరిశీలన

అద్దంకి, జూన్4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురంలో దేవాలయ భూములలో ఉన్న చెట్లు నరికి వేశారని ఫిర్యాదు అందటంతో అద్దంకి గ్రూపు దేవస్థానాల ఈవో శైలేంద్రకుమార్ బుధవారం పరిశీలించారు. అయితే చెట్లు నరికిన భూమి డొంక భూమిగా రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారని ఈవో తెలిపారు. పూర్తి స్థాయిలో సర్వే చేయించి హద్దు రాళ్లు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 5 జూన్ 2025



నేడు వన మహోత్సవం

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో కొత్తూరు సమీపంలోని నగరవనంలో వనమహోత్సవం జరగనుంది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. నగరవనంలో 4వేల మొక్కలు, జిల్లావ్యాప్తంగా ఐదు లక్షల మొక్కలు నాటనున్నారు. అన్ని శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని ఇన్‌చార్జి కలెక్టర్ కే. కార్తీక్, జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్ బాష కోరారు.

గురిపెడితే గురువులే!

యువత ఆశలన్నీ ఉపాధ్యాయ కొలువులపైనే. ఈసారి తీవ్ర పోటీ నేపథ్యంలో సమయం సమీపిస్తున్న కొద్దీ అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. 2018 తరువాత భారీస్థాయిలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరగనుండటంతో ఆశావహుల సంఖ్య పెరిగింది. అభ్యర్థులందరికీ శుక్రవారం నుంచి 30వ తేదీ వరకు అర్హత పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షకు సంబంధించి కొన్ని అంశాలు అందరికీ ఉమ్మడిగా ఉంటాయి. ఎస్జీటీలకు, స్కూల్ అసిస్టెంట్లకు, పీఈటీలు, టీజీటీలు, పండిట్‌లు అందరూ కొన్ని అంశాల్లో పోటీ పడాల్సి ఉన్నా, తమ లక్ష్యంపై గురిపెడితే గురువులుగా విజయం సాధించడం తథ్యమని విద్యా ప్రముఖులు చెపుతున్నారు.

- నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి)



రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన మెగా డీఎస్సీకి పోటీ కూడా మెగాస్థాయిలోనే ఉంది. అయితే, అభ్యర్థులు సరైన ప్రణాళికతో సన్నద్ధమైతే అవకాశాన్ని చేజిక్కించుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్, ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో 673 పోస్టులు భర్తీ చేయనున్నారు. వీటిలో 668 పోస్టులకు రోస్టర్ పాయింట్లు సిద్ధం చేసి పోస్టులు, కేటగిరీల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేశారు. ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ స్కూళ్లలో 629, నగరపాలక సంస్థ పరిధిలోని స్కూళ్లలో 25, మున్సిపల్ స్కూళ్లలో 14 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి డీఎస్సీ పరీక్షా విధానంలో కూడా ప్రిన్సిపల్, పీజీటీ, టీజీటీ పోస్టులకు పేపర్-1గా ఇంగ్లీష్ నైపుణ్య పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధిస్తే పేపర్-2 మార్కులు లెక్కిస్తారు. టీజీటీ, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులకు టెట్ వెయిటేజీ 20శాతం ఉంటుంది. డీఎస్సీ పరీక్షను 160 ప్రశ్నలతో 80 మార్కులకు కంప్యూటర్ బేస్డ్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు.

సాధనతోనే ఉపాధ్యాయ కొలువు

ప్రణాళికలతో సాధించడం సులువు



మొత్తం పోస్టులు : 673
అభ్యర్థులు : 15,993
పురుషులు : 6,173
మహిళలు : 9,820
అందిన దరఖాస్తులు : 28,772

మనో ధైర్యమే విజ్ఞానం

- విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం (సైకాలజీ)ని మనో ధైర్యంతో రాయాల్సి ఉంటుంది. పాఠశాల సహాయకులు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టీజీటీ) వారికి తరగతి గది అనువర్తనాల పేరుతో పది ప్రశ్నలు ఇచ్చి ఐదు మార్కులు కేటాయిస్తారు. ఎస్జీటీ, గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు విద్యా మనో విజ్ఞాన శాస్త్రం పేరుతో 10 మార్కులకు 20 ప్రశ్నలు ఇస్తారు.
- ప్రశ్నను ఒకటికి రెండుసార్లు చదివాకే జవాబు ఎంపిక చేసుకోవాలి.
- పాఠశాల సహాయకులకు, టీజీటీలకు వైయుక్తిక భేదాలు, అభ్యసనం, మూర్తిమత్వం, ఎస్జీటీ, పీజీటీ వారికి వైయుక్తిక భేదాలు, అభ్యసనం, మూర్తిమత్వంలతోపాటు పెరుగుదల వికాసం చాప్టర్ చదవాల్సి ఉంటుంది.
- రెండో చాప్టర్‌లో వచ్చే అభ్యసనానికి సంబంధించి తరగతి గదిలో అంశాలను అన్వయిస్తూ లోతుగా చదవాల్సి ఉంటుంది.
- మూర్తిమత్వాన్ని సులువైన చాప్టర్‌గా పరిగణించినా ఇందులోనే ఎక్కువ తప్పులు చేస్తుంటారు. జాగ్రత్తగా సమాధానాలు రాయాలి.
- పెరుగుదల వికాసం చాప్టర్ ఎస్జీటీ, పీజీటీ రాసే వారికి మాత్రమే ఉంటుంది. ఈ చాప్టర్‌లో పెరుగుదల వికాసం, సూత్రాలు, వికాశదశలు, వికాస సిద్ధాంతాలు ప్రత్యేకంగా చదవాలి.
- బీఎడ్ మనో విజ్ఞానశాస్త్ర తెలుగు పుస్తకాలు, డీఎడ్ విద్యా మనోవిజ్ఞాన శాస్త్ర తెలుగు అకాడమీ పుస్తకాలను చదవాలి. గత ప్రశ్నాపత్రాలను ఖచ్చితంగా పరిశీలించుకోవాలి.

వర్తమాన అంశాలే మూలం

జనరల్ నాలెడ్జ్‌లో 20 ప్రశ్నలు అడిగితే 10 మార్కులు ఉంటాయి. కరెంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం పెంచారు. జనరల్ నాలెడ్జ్‌లో కూడా వర్తమాన ప్రాధాన్యంతో ముడిపడి ఉన్న ప్రశ్నలు అధికంగా వస్తాయి.

- తాజాగా ఆన్‌లైన్ పరీక్ష ఉండటంతో పరీక్ష తేదీకి రెండు రోజులు ముందు వరకు దినపత్రికలు చదవడం మంచిది.
- కరెంట్ అఫైర్స్ కోసం గత ఆరునెలల సమాచారం సమగ్రంగా, ఏడాది క్రితం వరకు అంశాలను విహంగవీక్షణ పద్ధతిలో చదవాలి.
- జీకేలో నృత్యాలు, కళలు, ఆవిష్కరణలు, విటమిన్లు, జంతు సంబంధిత ఆసక్తికర సమాచారం, జలపాతాలు, తెగలు, పత్రికలు, పుస్తకాలు, చారిత్రక కట్టడాలు, రాష్ట్రాల సమాచారం, హైకోర్టు, సుప్రీంకోర్టు, స్వాతంత్ర్యోద్యమం, జాతీయ-రాష్ట్ర చిహ్నాలు, సైన్స్ అండ్ టెక్నాలజీలు చదవాలి.
- ఎస్జీటీలు అయితే కంటెంట్‌ను చదివితే సిలబస్‌లోనే జీకేకు సంబంధించిన 90 శాతం సమాచారం కవర్ అవుతుంది. కరెంట్ అఫైర్స్‌పై ఎక్కువగా దృష్టి సారించాలి.
- గత ప్రశ్నాపత్రాలు ఒకసారి చదవడం, చూడడం వలన ఏ తరహా ప్రశ్నలు అడుగుతున్నారో తెలుస్తుంది.
- ఏడాదిగా వివిధ పోటీ పరీక్షల జనరల్ స్టడీస్ ప్రశ్నలను పరిశీలిస్తూ సన్నద్ధమైతే విజేతగా నిలవవచ్చు..

డీఎస్సీకి సన్నద్ధం

డీఎస్సీ పరీక్షలన్నీ కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్ష కావడంతో అన్ని వసతులు కలిగిన కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జూన్ 6 నుంచి 30వతేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షెడ్యూళ్లలో పరీక్షలు జరగనున్నాయి. ఏ రోజు ఏ పరీక్ష అన్నది అభ్యర్థుల మొబైల్ నెంబర్లకు మెసేజ్‌లు పంపిస్తున్నారు. లేదా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో కూడా పొందుపరిచారు. పరీక్షల నిర్వహణకు కలెక్టర్ చైర్మన్‌గా త్రీమెన్ కమిటీ నియమించారు. డిప్యూటీ ఈఓ, ఎంఈఓ, ఐటీ నిపుణుడు సభ్యులుగా ఉంటారు. వీరంతా పరీక్షల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుని ఉన్నతాధికారులకు నివేదికలు అందచేస్తారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్వో ఉదయ్‌భాస్కర్

పకడ్బందీగా 'మెగా' పరీక్షలు

● రేపటినుంచి ప్రారంభం.. 8 కేంద్రాల్లో నిర్వహణ

జిల్లాలో మెగా డీఎస్సీ-2025 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్ఓ ఉదయ్‌భాస్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డీఆర్ఓ ఛాంబర్‌లో బుధవారం ఆయన పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 8 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలకు 31,221 మంది అభ్యర్థులు సన్నద్ధంగా ఉన్నారని, వీరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు వైద్యశిబిరాలు, విద్యుత్ ఆటంకం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

హెల్ప్‌డెస్క్

డీఎస్సీ అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. హెల్ప్‌డెస్క్‌లో 6281704160, 8121947387, 8125046997, 9398810958, 7995649286, 7995789286, 9963069286, 7013837359 ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రంలో సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరన్నారు. నిర్దిష్ట సమయం కంటే గంట ముందుగా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తారని, నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు.

హెల్త్ ఎడ్యుకేటర్ పేరు మార్పు

నెల్లూరు (వైద్యం) : హెల్త్ ఎడ్యుకేటర్ పేరును డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారిగా ప్రభుత్వం మార్పు చేసిందని ఏపీ హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీస్ వెల్ఫేర్ అసోషియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఇందుకు సంబంధించిన జీవో 64 ప్రతులను డీఎంహెచ్‌వో సుజాతకు అసోసియేషన్ నేతలతో కలిసి ఆయన అందచేశారు. కార్యక్రమంలో నాయకులు సునీత, జిల్లా నేతలు ఆరోగ్య మేరీ, అశోక్, ఉమర్, రమేష్ పాల్గొన్నారు.



వెంచటాలంలో తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీలు మిథున్‌రెడ్డి, గురుమూర్తి, వైసీపీ నాయకులు

జిల్లాలో 'వెన్నుపోటు దినం'

నెల్లూరు జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమం బుధవారం జిల్లావ్యాప్తంగా జరిగింది. అన్ని నియోజకవర్గ కేంద్రాలలో ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు ఆందోళనలు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక పోయిందంటూ విమర్శలు గుప్పించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలంలో వైసీపీ నాయకులు భారీ ర్యాలీ చేపట్టి తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట, తిరుపతి ఎంపీలు పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, మద్దెల గురుమూర్తి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పాల్గొన్నారు. నెల్లూరు నగరంలో వీఆర్సీ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ జరగ్గా, రూరల్ నియోజకవర్గ నేతలు రైల్వే ఫ్రీడర్స్ రోడ్డులో ఆందోళన చేశారు. కోవూరు, కావలి, ఉదయగిరి, కందుకూరు, నియోజకవర్గాలలోనూ వైసీపీ నేతలు వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

వెంగమాంబ ఆలయ అభివృద్ధి ఎలా!?

● పరిశీలించిన అధికారుల బృందం

నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయాన్ని బుధవారం విజయవాడకు చెందిన దేవదాయ, ధర్మదాయ కార్యాలయం నుంచి వచ్చిన సాంకేతిక శాఖ అధికారులు, సహాయ స్థపతులు పరిశీలించారు. ఆలయంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనుల్లో భాగంగ దేవస్థాన నిర్మాణం, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశీలనలో గుర్తించిన అంశాలను ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందజేయనున్నారు. వారి వెంట ఆలయ ఈవో ఉషశ్రీ, ఈఈలు జీవీఆర్ శేఖర్, కె.గంగయ్య, డిప్యూటీ స్థపతి ఎం.నాగేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈ మురళిమోహన్, టెక్నికల్ అధికారి బీ.రవి, అసిస్టెంట్ స్థపతి సురేంద్ర తదితరులు ఉన్నారు.

- దుత్తలూరు(ఉదయగిరి, ఆంధ్రజ్యోతి)

పీడ విరగడై ఏడాది!

జిల్లాలో జనసైనికుల పండుగ సంబరాలు



నెల్లూరులో చీడ, పీడలన్నీ తొలగిపోయేలా ఏడాది దిష్టిబొమ్మను తగలపెడుతున్న జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పీడ విరగడై ఏడాది అయిందంటూ బుధవారం జిల్లావ్యాప్తంగా జనసైనికులు పండుగ సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అయిన సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఈ సంబరాల్లో పాల్గొన్నారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో తెల్లవారుజామున వైసీపీ పీడ విరగడై ఏడాది.. సుపరిపాలకు ఏడాది అంటూ భోగిమంటలు వేశారు. అనంతరం జిల్లా, నగర పార్టీ కార్యాలయాల వద్ద సంక్రాంతిని తలపించేలా రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం రాత్రి రాష్ట్రానికి దీపావళి మొదలై సంవత్సరం అయిందంటూ బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా చీడ, పీడలన్నీ తొలగిపోయే విధంగా ఏడాది దిష్టిబొమ్మను తగలబెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు జమీర్, శ్రీరామ్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవికుమార్, అబీద్ మీర్జా, తదితరులు పాల్గొన్నారు.



గజ వాహనంపై చాముండేశ్వరి దేవి

గంగపట్నంలో చాముండేశ్వరి దేవి అమ్మవారు బుధవారం రాత్రి గజవాహనంపై భక్తులకు దర్శనమిస్తూ ఊరేగారు. ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు, గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఇందుకూరుపేట, (ఆంధ్రజ్యోతి)

రిటైరయ్యే ఉద్యోగులకు ఎలక్ట్రానిక్ పెన్షన్ మంజూరు

రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ



పెన్షన్ పత్రాలను అందచేస్తున్న శాంతిప్రియ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 4(ఆంధ్రజ్యోతి) : రిటైరయ్యే ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో ఎలక్ట్రానిక్ పద్ధతిలో పెన్షన్ మంజూరు పత్రాలను అందచేస్తామని రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ చెప్పారు. బుధవారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ప్రభుత్వ పెన్షన్, జీపీఎఫ్ సమస్యలపై ప్రత్యేక అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ పెన్షన్ ప్రతిపాదనల మంజూరు ఏజీ కార్యాలయంలో ఎలా జరుగుతుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పెన్షన్ ప్రతిపాదనలను పంపే సమయంలో దరఖాస్తుతోపాటు ఏయే పత్రాలను జత పరచాలో ప్రతిఒక్కరూ విధిగా తెలుసుకోవాలన్నారు. ఈ నెల నుంచి ఆర్థికశాఖ పరిధిలోని ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్, ఏపీజీఎల్ఐ తదితర శాఖల నుంచి రిటైరయ్యే ఉద్యోగులకు ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఈపీఎఫ్ పెన్షన్ మంజూరు పత్రాలను అందచేస్తామని చెప్పారు. రాష్ట్ర ట్రెజరీశాఖ డైరెక్టర్ మోహన్‌రావు, డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు తదితరులు మాట్లాడారు. ప్రత్యేక అదాలత్‌లో 55 మందికి పెన్షన్ మంజూరు పత్రాలను, 15 మందికి జీపీఎఫ్ ఆథరైజేస్ లేఖలను అందచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ కిషోర్‌రెడ్డి, అధికారులు విజయ్‌కుమార్, భవానీప్రసాద్, సునీత, జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ గంగాద్రి, డీసీవో గురప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆ డబ్బులు ఎక్కడివి.. ఎవరివి!?

- బీజీసీ క్యాపిటల్ ట్రేడింగ్‌లో రూ.80 లక్షల గల్లంతు
- బాధితుడు ఓ రాజకీయ నాయకుడి వద్ద గుమాస్తా
- అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు

- వివరాలు 8లో..



అందరి హృదయాల్లో బాలు

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా బుధవారం నెల్లూరులో గాయని రమణకు అవార్డు అందజేసి సత్కరిస్తున్న ఎస్పీ శైలజ, నటుడు శుభలేఖ సుధాకర్ తదితర ప్రముఖులు

8

హైవేపై తప్పిన ఘోరం



జాతీయ రహదారిపై అగ్నికి ఆహుతవుతున్న లారీ

మర్రిపాడు మండలం కండ్రిక వద్ద ముంబయి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం తప్పింది. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ ఢీ కొట్టడంతో డీజిల్ ట్యాంక్ పగిలి క్షణాల్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఢీ కొట్టిన లారీ మొత్తం కాలిపోయింది. పోలీసుల కథనం మేరకు... అదుపు తప్పిన ఓ ఆయిల్ ట్యాంకర్ హైవే పక్కన పడిపోయింది. దీనిని చూసేందుకు బద్వేలు వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ తన లారీని ఆపి ట్యాంకర్ వద్దకు వెళ్లాడు. అదే సమయంలో సిమెంట్ తయారీకి ఉపయోగించే బూడిద లోడుతో నెల్లూరు వైపు నుంచి వస్తూ హైవేపై ఆగి ఉన్న లారీని ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారుజాము 4 గంటల నుంచి తెల్లవారే వరకు రహదారికి ఇరువైపులా వాహన రాకపోకలు ఆగిపోయాయి. ఆత్మకూరు సీఐ గంగాధర్, మర్రిపాడు ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు సంఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ ఇంజన్ ద్వారా మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలించలేదు. కాగా, ఈ ప్రమాదంలో డ్రైవర్లు సురక్షితంగా బయట పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)

'హౌసింగ్'లో సిమెంట్ బస్తాల మాయం

సీతారామపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంలో జరిగిన అక్రమాలపై ఆ శాఖ ఈఈ మోహన్ రావు బుధవారం విచారించారు. ఈ క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏఈ కరీముల్లా మద్యం మత్తులో అధికారుల ముందే చిందులు తొక్కారు. గోదాములో 1080 బస్తాల సిమెంట్ ఉండాల్సి ఉండగా కేవలం 24 బస్తాలు మాత్రమే ఉండడంతో అధికారులు కంగుతిన్నారు. గతంలో ఇదే విధంగా కరీముల్లా సిమెంట్ అమ్ముకోవడంతో సస్పెండ్ అయ్యారు. మంగళవారం రాత్రి అందిన సమాచారం ప్రకారం వంద బస్తాలతో ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని దేవమ్మ చెరువు వైపు వెళ్తుండగా ఉన్నతాధికారులు పట్టుకున్నారు. గోదాములో 1056 సిమెంట్ బస్తాలు మాయం కావడంతో ఈఈ మోహన్ రావు విచారించి, ఏఈ కరీముల్లాపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



గోదాములో సిమెంటు బస్తాలను పరిశీలిస్తున్న ఈఈ మోహన్ రావు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 525

» కలిగిరి నుంచి వలేటివారిపాలెం వరకు 45 కి.మీ డబుల్‌రోడ్డుకు ప్రతిపాదనలు

» తొలివిడతలో కలిగిరి నుంచి కొండాపురం వరకు 19.6 కిలోమీటర్లకు ప్రభుత్వం ఆమోదం

» పనులు ప్రారంభం, ప్రజలు, వాహనచోదకుల హర్షం

మెట్ట ప్రాంతవాసుల కల సాకారం!



రహదారి పనుల కోసం ఏర్పాటు చేసిన పైలాన్

కొండాపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గంలోని మెట్ట ప్రాంత వాసుల కల ఎట్టకేలకు సాకారమవుతోంది. కలిగిరి మండలం నుంచి కొండాపురం మీదుగా కందుకూరు నియోజకవర్గంలోని వలేటివారిపాలెం మండలం వరకు సుమారు 45 కిలోమీటర్ల దూరం 17 ప్రధాన గ్రామాలను కలుపుతూ రెండు లేన్ల రహదారి నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. అయితే మొదటి విడతలో కలిగిరి మండలం నుంచి కొండాపురం మండలంలోకి సుమారు 19.6 కిలోమీటర్ల దూరం రెండు లేన్ల రహదారికి సుమారు రూ.30 కోట్లు మంజూరయ్యాయి. వాస్తవానికి ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందిందంటే అక్కడ రహదారి సదుపాయాలు బాగున్నట్లేనని నిర్ధారించుకోవాలి. రవాణా సదుపాయాలు అభివృద్ధి చెందకపోతే మండలం కూడా అభివృద్ధికి నోచుకోదు. ఈ పరిస్థితుల్లో కొండాపురం మీదుగా మరో రెండు మండలాలను కలుపుతూ రెండు లేన్ల రహదారి మంజూరవ్వడం, ఈ పనులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శంకుస్థాపన చేయడంతో అటు రైతులు ఇటు మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కలిగిరి నుంచి వలేటివారిపాలెం సుమారు 45 కిలోమీటర్ల దూరం ఉంది. జిల్లా కేంద్రం నెల్లూరుకి దాదాపు 90 కిలోమీటర్ల దూరం ఉంది. మండలం నుంచి పట్టణాలకు వెళ్లాలంటే రవాణా సౌకర్యాలు సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెట్ట ప్రాంతం కావడంతో పొగాకు, శనగ, మినుము, పెసర తదితర మెట్టపైర్లను అధికంగా సాగు చేస్తుంటారు. ఆయా పంటల ఉత్పత్తులను అమ్ముకునేందుకు కలిగిరి, కందుకూరుకు తరలించాల్సి వస్తోంది. ఆ ప్రాంతంలోని రహదారి సింగిల్ రోడ్డు కావడంతో తరచూ పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లాలోనే ఎక్కువగా వెనుకబడిన మండలంగా ఉన్న కొండాపురం మండలంలోని చింతలదీవిలో పశుసంవర్థక క్షేత్రం ఏర్పాటు చేసి జాతీయస్థాయిలో జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రం నిర్వహిస్తున్నారు. దీంతో మండలానికి కొంతమేరకు రహదారి కనెక్టివిటీ పెరిగినా కలిగిరి మండలం నుంచి కొండాపురం మండలంలోకి సుమారు 19.6 కిలోమీటర్ల దూరం వెళ్లలంటే నరకప్రాయంగా ఉంది. ఈ నేపథ్యంలో రెండులేన్ల రహదారికి రూ.30 కోట్లు మంజూరు కావడం, ఈ పనులకు సంబంధించి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పైలాన్‌ను ఆవిష్కరించారు. పనులు కూడా ప్రారంభమైన నేపథ్యంలో త్వరగా పనులు పూర్తి చేసి రహదారి సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు అభివృద్ధి చెందాలి



రోడ్లు అభివృద్ధి చెందితేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయి. గత ప్రభుత్వంలో రహదారులను పూర్తిగా పట్టించుకోలేదు. దీంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కలిగిరి నుంచి వలేటివారిపాలెం వరకు రెండు లేన్ల రహదారికి ప్రతిపాదనలు పంపగా తొలి విడతలో దాదాపు 20 కిలోమీటర్ల దూరం రోడ్డు విస్తరణకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

- పోలినేని చంద్రబాబునాయుడు, మాజీ వైస్‌ఎంపీపీ, కొండాపురం

తొలివిడతలో 19.6 కి.మీ రహదారి నిర్మాణం

తొలివిడతలో కలిగిరి మండలం నుంచి కొండాపురం మండలం వరకు 19.6 కిలోమీటర్ల దూరం రహదారిని రెండు లేన్ల రహదారిగా విస్తరించేందుకు ప్రభుత్వం ఆమోదించింది. ఆ మేరకు పనులు జరుగుతున్నాయి. మిగిలిన రహదారి విస్తరణకు ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంది.

- మదన్‌కుమార్, డీఈ, ఆర్‌అండ్‌బీ, ఉదయగిరి



కొండాపురం మండల కేంద్రం సమీపంలో జరుగుతున్న ప్రధాన రహదారి పనులు



మానవ జీవితంలో యోగా ఒక భాగం కావాలి

● తేళ్ల అశోక్, పంచాయతీ కార్యదర్శి, కలిగిరి-2 సచివాలయం

కలిగిరి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న దృష్ట్యా మానవ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి. ప్రతి ఒక్కరు కొంత సమయాన్ని యోగాకు కేటాయించి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలి. యోగాంధ్రలో భాగంగా కలిగిరి సచివాలయం వద్ద జరుగుతున్న యోగా క్లాసులను సద్వినియోగం చేసుకోవాలని కలిగిరి గ్రామ సచివాలయం-2, పంచాయతీ కార్యదర్శి తేళ్ల అశోక్ పట్టణ ప్రజలను కోరారు.

? యోగాంధ్ర విజయవంతానికి కార్యాచరణలు ఏమిటి.

! కలిగిరి పట్టణంలో యోగాంధ్ర కార్యక్రమంపై ఇంటింటి సర్వే చేశాం. ఆసక్తి ఉన్నవారికి మే 21 నుంచి జూన్ 21వరకు యోగా ట్రైనర్స్‌తో ప్రతిరోజు రెండు గంటల పాటు యోగా క్లాసులు నిర్వహించి శిక్షణ ఇప్పిస్తున్నాం.

? పంచాయతీలో పన్ను వసూళ్లకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! స్వర్ణ పంచాయతీ కార్యక్రమం కింద ఇళ్ల వివరాలను ఆన్‌లైన్ చేయడం జరుగుతుంది. తద్వారా పట్టణ ప్రజలకు పన్ను చెల్లింపు సులభతరం అవుతుంది.

? అందరికీ ఈకేవైసీ చేయడం జరుగుతుందా.

! జీఎస్‌డబ్ల్యుఎస్ వెబ్‌సైట్‌లో డేటా లేని వారి ఇళ్ల వద్దకు వెళ్లి అప్‌డేట్ ఈకేవైసీ చేయడం ద్వారా వారి కుటుంబ సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదవుతాయి.

? గిరిజనులకు ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం జరుగుతుందా. జనన ధ్రువీకరణ పత్రం ఎలా చేస్తున్నారు.

! పంచాయతీ పరిధిలోని ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం జరుగుతోంది. పుట్టిన తేది ధ్రువీకరణ పత్రాలు లేనివారికి తహసీల్దారుచే నిర్ధారించబడిన డొమైసిల్ సర్టిఫికెట్ ఏర్పాటు చేసి ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమంలో వారికి కార్డులు ఇప్పిస్తున్నాం.

ఇంటర్వ్యూ

న్యూస్ బాక్స్

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

కందుకూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): యువత విద్యతోపాటు క్రీడలోనూ రాణించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకాంక్షించారు. జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పథకాలు సాధించిన క్రీడాకారులు బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. గత నెల 28 నుంచి ఈనెల 1వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం కటక్ పట్టణంలో జరిగిన 8వ ఓపెన్ తైక్వాండో నేషనల్ చాంపియన్‌షిప్ బాలికల విభాగం పోటీల్లో బీ.లక్ష్మీ అక్షరశ్రీ, సీ.లక్ష్మీప్రియ, బాలుర విభాగంలో ఏ మన్విత్‌రాజ్, జీ త్రినాథ్‌లు బంగారు పతకాలు సాధించారు. ఉత్తమ్ ప్రేమ్‌సాత్విక్, సాయి శ్రీవాత్సవ్‌లు రజిత పతకం, మోహిత్ కేసరినందన్ కాంస్య పతకం సాధించారు. వీరందరిని ఎమ్మెల్యే ఇంటూరి అభినందించారు. టీం కోచ్‌గా వ్యవహరించిన పీ.అఖిల్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, జిల్లా కార్యదర్శి మాస్టర్ ఎస్‌కే అబ్దుల్ సలాం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

కందుకూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఉలవపాడు మండలం భీమవరం గ్రామానికి చెందిన రాయని మాల్యాద్రికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తన కార్యాలయంలో రూ.6,20,000 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం గ్రామ టీడీపీ అధ్యక్షుడు జాజుల రవి, జలపతిరావు, దేవండ్ల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడికతీత ప్రారంభం

కావలి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణంలో వర్షపు నీటితో మునక కాకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పట్టణంలోని ప్రధాన డ్రైన్‌లలో పూడికతీత పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. సుమారు రూ.20 లక్షలతో పట్టణంలోని వరవకాలువ, పంట కాలువ, ట్రంకురోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రధాన కాలువలలో పూడికతీత పనులు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. సాయి బాబా గుడి వీధిలో ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంట్ నుంచి కలుగోళ్ల శాంభవి ఆలయం వరకు వరవ కాలువలో తొలుత పూడికతీత పనులుచేపట్టారు. అనంతరం పట్టణంలోని అగ్రహారం బావి నుంచి 11వ వార్డులో అంబేడ్కర్ బావికి కలుపుతూ ఉన్న పైపు లైన్ల మరమ్మతుల పనులను స్థానిక వార్డు నాయకులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ ప్రాంతంలో ఉన్న తాగునీటి ఎద్దడి నివారణకు పైపులైన్ల పనులను త్వరితగతిన పూర్తి చేసి అంబేడ్కర్‌నగర్‌కు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆయన ఇంజనీరింగ్ విభాగం వారిని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సూచించారు.

ప్రత్యేక పీజీఆర్‌ఎస్ వాయిదా

లింగసముద్రం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో జరగాల్సిన ప్రత్యేక పీజీఆర్‌ఎస్ కార్యక్రమం అనివార్య కారణాల వలన వాయిదా పడినట్టు తహసీల్దారు ఎస్ సీతామహాలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈ కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని ఆమె పేర్కొన్నారు.

రూ.వంద కోట్లు తెచ్చా

● ఎమ్మెల్యే ఇంటూరికి ఘన సన్మానం ● టీడీపీ శ్రేణుల సంబరాలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి గడిచిన ఏడాది కాలంలో రూ.100 కోట్లు తెచ్చానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అలం పూర్తికావడంతో స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని పూల మాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటూరి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిందన్నారు. కందుకూరు శివారు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అమృత్-2 పథకం కింద రూ.40 కోట్లు మంజూరు చేయించగా రూ.20 కోట్లతో సేవరేజ్ ప్లాంట్ రూపుదిద్దుకుంటుందన్నారు. కందుకూరు రూరల్ ప్రాంత ప్రజలకు రూ.22 కోట్లు జేజేఎం నిధులతో త్వరలో రామతీర్థం నీరు అందిస్తామన్నారు. 250 మందికి రూ.3 కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశామన్నారు. ఐదు పాఠశాల అభివృద్ధికి రూ.7.50 కోట్లు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రూ. 60 లక్షల మంజూరు, రూ.1.37 కోట్లతో రైతులకు సబ్సిడీ పనిముట్లు అందచేశామన్నారు. రామాయపట్నం పోర్టు మరో ఏడాదిలో పూర్తిస్థాయి వినియోగంలోకి రానుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నే రోశయ్య, ఉప్పుటూరి శ్రీనివాసులు, బెజవాడ ప్రసాద్, జనిగర్ల నాగరాజు, మోషే, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అభిమానులు, టీడీపీ కార్యకర్తలు

కావలి, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : కావలి ఎమ్మెల్యేగా దగుమాటి వెంకటకృష్ణారెడ్డి గెలుపొంది, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు నాయకత్వంలో ఇందిరమ్మ కాలనీ యువ నాయకులు కొప్రపాటి రవి, అద్దంకి హరీష్, ఎమ్మెల్యే అభిమానులు, కార్యరకర్తలు రక్తదానం చేశారు.

● యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి

తలసేమియా బాధితుల చిన్నారులను కాపాడేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కావలి తహసీల్దారు పీ.శ్రావణ్‌కుమార్ పిలుపు నిచ్చారు. బుధవారం కావలిరెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్న కుమార్, ఆద్వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ భవనంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని తహసీల్దారు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పుట్టుకతో జన్యుపరంగా వచ్చే తలసేమియా వ్యాధిగ్రస్తులకు జీవితాంతం రెండు నుంచి నాలుగు వారాల వ్యవధిలో రక్తం ఎక్కించుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ సంస్థ వారికి ఉచితంగా రక్తం, మందులు, పౌష్టికాహారం అందచేస్తుందన్నారు. ఈ నెల మందులు, పౌష్టికాహారం దాత తానికొండ శ్రీనివాసరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు కే.హరినారపరెడ్డి, వైద్యులు పామూరు శ్రీధర్, టీ.రమ్య, కృష్ణారావు, ఆద్వి ఫౌండేషన్ సభ్యులు జగదీష్, వెంకటేష్, సునీల్, సుధాకర్, శేఖర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి



పనులు పరిశీలిస్తున్న ఏపీవో దయాసాగర్

వలేటివారిపాలెం, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : ఎండలను దృష్టిలో పెట్టుకొని పనుల వద్ద కూలీలకు వసతులు కల్పించాలని ఏపీవో దయాసాగర్ చెప్పారు. మండలంలోని బడేవారిపాలెం, నేకునాంపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీవో దయాసాగర్ బుధవారం పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సమక్షంలో మస్టర్లను చదివి వినిపించారు. ఈ సదర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి తిరిగి 10 గంటల్లోపు ఇళ్లకు వెళ్లాలని తెలిపారు. కొలతల ప్రకారమే వేతనాలు లభిస్తాయని చెప్పారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న బీమా సౌకర్యలపై కూలీలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు.

అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలి

అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పీల్డ్అసిస్టెంట్‌ల సమావేశంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అక్రమాలకు తావులేకుండా చేపట్టాలని తెలిపారు. బోగస్ మస్టర్లు నమోదు చేస్తునట్లు తమ దృష్టికి వస్తే విచారించి శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. పనులు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. పనుల వద్ద కూలీలకు తాగునీరు, టెంట్, మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తదితర వసతులు కల్పించాలన్నారు. జాబ్‌కార్డులు లేని వారికి వెంటనే జాబ్‌కార్డులు మంజూరు చేసేలా చర్యలు చేపట్టి వాళ్లకు పనులు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో దయాసాగర్, ఉపాధి సిబ్బంది పీల్డ్అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

వలేటివారిపాలెం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మాలకొండలో జరుగుతున్న అభివృద్ధి పనులను, భవిష్యత్‌లో భక్తులకు అవసరమైన పనులకు సంబంధించిన కార్యక్రమాలను చీఫ్‌ఇంజనీర్ శేఖర్‌తో కలిసి బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ.సాగర్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, ఎస్‌ఐ మరిదినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి చేరిన మురుగు



లింగసముద్రంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

లింగసముద్రం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని డ్రైనేజీ కాలువలోని మురుగు నీరు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తోంది. కాలువలోని మురుగు నీరు కిందకు ప్రవహించకుండా కాలువలో మట్టి, చెత్తా చెదారం అడ్డుపడింది. దీంతో బుధవారం సాయంత్రం స్థానిక మసీదుకు సమీపంలోని మురుగు నీరు ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి వచ్చింది. దీంతో రోడ్డంతా బురదమయమై పోవడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచు పులి రాఘవులు, పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావులు పంచాయతీ కార్మికులను రప్పించి, సాయంత్రం 6 గంటల సమయంలో కాలువలో అడ్డుగా ఉన్న మట్టిని, చెత్తా చెదారాన్ని తొలగింప చేశారు. దీంతో మురుగు నీరు రోడ్డుపైకి రావడం ఆగిపోయింది.

తప్పులను సవరించండి

● జీఎస్‌డబ్ల్యుఎస్ రాష్ట్ర డైరెక్టర్ శివప్రసాద్‌కు వినతి

కందుకూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో వలంటీర్లు, సచివాలయం సిబ్బంది నిర్వహించిన సాధికార సర్వేలో అంగన్‌వాడీ ఆయాలు నెలకు రూ.12000 గౌరవ వేతనం తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు కింద నమోదే చేశారని, ఆ తప్పును సవరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ బుధవారం విజయవాడలోని జీఎస్‌డబ్ల్యుఎస్ రాష్ట్ర డైరెక్టర్ ఎం శివప్రసాద్‌ను కలిసి కోరారు. వాస్తవానికి అంగన్‌వాడీ ఆయాలకు నెలసరి గౌరవ వేతనం రూ.7000 మాత్రమేనని, అయితే ఆ సర్వే ఇప్పటికి కొనసాగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలకు అంగన్‌వాడీ ఆయాలు అనర్హులుగా ఆన్‌లైన్‌లో చూపిస్తుందని ఆధారలతో చూపించారు. దీనిపై స్పందించిన శివప్రసాద్ రెండు రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. తల్లికివందనం వంటి పథకాలు దూరం కాకుండా వెంటనే సమస్యను పరిష్కరించాలని లేదంటే అంగన్‌వడీ వర్కర్స్, హెల్పర్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

వైసీపీ నిరసన పాదయాత్ర



ఆర్డీవో సన్నీవంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి, తదితరులు

కావలిటౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినంలో భాగంగా బుధవారం పట్టణంలో వైసీపీ శ్రేణులు నిరసన పాదయాత్ర చేపట్టారు. ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించేందుకు చేసుకున్న సన్నాహాలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పాదయాత్రగా ఆర్డీవో కార్యాలయం వరకు చేరుకుని అక్కడ ధర్నా నిర్వహించి ఆర్డీవో వంశీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి జన్మదిన వేడుకలు

మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ముసునూరులోని ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద వైసీపీ శ్రేణులు, బంధుమిత్రులు పూలబొకేలు, కేక్‌లు, మిఠాయిలు అందించి జన్మదిన శుభాకంక్షలు తెలిపారు. కార్యకర్తలు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ప్రతాప్‌కుమార్ రెడ్డి కట్ చేయగా నేతలు తినిపించారు. ఆయన సతీమణి ఆదిలక్ష్మి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం వైసీపీ శ్రేణులతో కలసి రామిరెడ్డి రక్తదానం చేశారు.

వైసీపీ ఆధ్వర్యంలో ర్యాలీ



సబ్‌కలెక్టర్ శ్రీపూజకు వినతిపత్రం అందచేస్తున్ననియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్, పార్టీ శ్రేణులు

కందుకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో ఇచ్చిన హామీలకు అమలు చేయలేదని రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా బుధవారం వైసీపీ పార్టీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ ఆధ్వర్యంలో కందుకూరులో అంబేడ్కర్ విగ్రహం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో అములు చేయడంలో విఫలమైయిందని, రాష్ట్ర ప్రజలకు సంక్షేమం గాలికి వదిలేసిందని మాజీ ఎమ్మెల్యే బుర్రా ఆరోపించారు. అనంతరం పార్టీ శ్రేణులతో తరలివెళ్లి సబ్ కలెక్టర్ శ్రీపూజకు వినతిపత్రం అందచేశారు.

అనంతపురంలో రోడ్డు ప్రమాదం..

ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మృతి




తీవ్రంగా గాయపడిన రామమూర్తి

అనంతపురం సెంట్రల్/విడపనకల్లు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్ణాటక సరిహద్దు వద్ద భారత్ పెట్రోలు బంక్ సమీపాన బుధవారం మధ్యాహ్నం కారును గ్యాస్ ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి (50) మరణించారు. స్థానికులు, విడపనకల్లు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామమూర్తి అనంతపురంలోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తుండేవారు. వ్యక్తిగత పని మీద అనంతపురం నుంచి బళ్లారికి కారులో బయల్దేరారు. ఉరవకొండ-అనంతపురం 42వ జాతీయ రహదారిపై బళ్లారి నుంచి అనంతపురం వస్తున్న గ్యాస్ ట్యాంకర్ ఎదురుగా వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న రామమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు.. ఆయనను బయటకు తీసి విడపనకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లారు. అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం ఆయన మరణించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించి నెల్లూరు జిల్లా అల్లూరు మండలంలోని సొంతూరికి మృతదేహాన్ని తరలించనున్నారు. రామమూర్తికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు బీటెక్ పూర్తిచేయగా, కుమార్తె అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలోనే బీటెక్ చదువుతోంది. రామమూర్తి మృతికి కళాశాల చైర్మన్ అనంతరాముడు, వైస్‌చైర్మన్ రమేష్ నాయుడు సంతాపం తెలిపారు.

శిథిలావస్థలో గ్రంథాలయం!

● వర్షం వస్తే తడుస్తున్నవైనం

అల్లూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : ఎంతో చరిత్ర కలిగిన బాపూజీ పార్కులోని గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుంది. అల్లూరులో ఏకైక గ్రంథాలయం కావడంతో అడపాదడపా పాఠకులు ఇక్కడికి వచ్చి పత్రికలు పఠించి వెళ్తుంటారు. గతంలో ఎంతోమందికి జ్ఞానాన్ని అందించిన ఈ గ్రంథాలయం చివరకు మరుగున పడిపోయింది. ఈ క్రమంలో గ్రంథాలయ భవనం కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇదే క్రమంలో వర్షాకాలంలో పూర్తిగా ఉరుస్తుండడంతో అందులోని పుస్తకాలు, పత్రికలు, సామగ్రి పూర్తిగా తడిచిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇక్కడికి పాఠకులు రావడం తరచూ తగ్గుముఖం పట్టింది. భవనం ఏ క్షణంలో కూలిపోతుందోనని భయాందోళనలో స్థానికులు ఉన్నారు. దీనిని పూర్తిగా తొలగించి నూతన భవనాన్ని నిర్మించి అల్లూరు గ్రామ ప్రజలకు అన్ని హంగులతో కూడిన గ్రంథాలయాన్ని నిర్మించాలని పాఠకులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన బాపూజీ పార్కులోని గ్రంథాలయం

జగనన్నా.. మాకు దిక్కు ఎవరన్నా?

- అల్లూరులో దుమారం రేపుతున్న ఫ్లెక్సీ
- వైసీపీ శ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశం



అల్లూరులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

జగనన్నా.. మాకు దిక్కు ఎవరన్నా..? ఈ మాట ఆ పార్టీకి చెందిన ఓ వర్గం వేయించిన ఫ్లెక్సీలో కనిపిస్తోంది. అల్లూరు వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో, రామకృష్ణ కళాశాల సెంటర్‌లో బుధవారం ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ ఫ్లెక్సీల్లో ఈ వ్యాఖ్యలు రాసి ఉన్నాయి. కావలి నియోజకవర్గంలో వైసీపీకి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కానీ ఈ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం వెనుక ప్రతాప్‌కుమార్‌రెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న ఓ వర్గం తమ భావజాలాన్ని స్పష్టం చేస్తుందంటూ విశ్వసనీయ వర్గాలు అంటున్నాయి. ఈ అంశంపై స్థానికుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వైసీపీ నిరసన కార్యక్రమం చేపట్టిన రోజే ఈ ఫ్లెక్సీ ఏర్పాటు కావడంతో అల్లూరు వైసీపీ శ్రేణుల్లో ఇదొక సమస్యగా మారింది. దీనిపై కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి ఏం చర్యలు తీసుకోనున్నారో వేచి చూడాలంటూ స్థానికులు అంటున్నారు.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల నిరసనలు

నెల్లూరు(క్రైం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ డిపోల గ్యారేజ్ గేట్ల ఎదుట కార్మికులు నిరసనలు కొనసాగించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అన్ని డిపోల ఎన్ ఎం యూఏ అధ్యక్షులు, కార్యదర్శులు, గ్యారేజ్ అధ్యక్ష,కార్యదర్శులు తదితరు లు పాల్గొన్నారు.

హరితశోభితం.. గండిపాళెం గ్రామం



గండిపాళెం గ్రామంలో రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు

ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామం రోడ్లకిరువైపులా పచ్చని చెట్లు ఏపుగా పెరగడంతో హరితశోభితం సంతరించుకొంది. గ్రామ దత్తత స్వీకర్త, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి సహకారంతో నాలుగేళ్ల క్రితం కడియం ప్రాంతం నుంచి ప్రత్యేకంగా 1,500 మొక్కలు తీసుకొచ్చారు. ఆ మొక్కలను గ్రామానికి ఇరువైపులా ఉన్న రహదారుల వెంట, ఎస్సీ, బీసీ కాలనీలు, పాఠశాలలు, వైద్యశాలలు, గురుకుల పాఠశాల ప్రాంతాల్లో నాటి ఇనుప కంచెలు ఏర్పాటు చేశారు. అనంతరం సిబ్బందిని ఏర్పాటు చేసి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆ మొక్కలు ఏపుగా పెరగడంతో రోడ్ల వెంట రాకపోకలు సాగించే వారికి, గ్రామస్థులకు ఆహ్లాదకర వాతావరణం కలిగిస్తున్నాయి. ఇలా ప్రతిఒక్కరు పర్యావరణ పరిరక్షణకు పాటుపడితే వాయు, వాతావరణ కాలుష్యం తగ్గి సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు ఆరోగ్యకరంగా ఉండేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. - ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)


ప్రమాదంలో పర్యావరణం

- నిబంధనలు పాటించని పరిశ్రమలెన్నో... • ఎటు చూసినా భవిష్యత్తు ఆందోళనకరమే
- తస్మాత్ జాగ్రత్త అంటున్న మేధావులు • నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన మానవులు దాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. ఆధునిక సాంకేతికత ముసుగులో పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. ఫలితంగా అతివృష్టి.. అనావృష్టి ఏర్పడి మానవ మనుగడనే ప్రశ్నిస్తున్నాయి. పరిశ్రమల కాలుష్యం కారణంగా సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ లాంటి విష వాయువులు విడుదలవుతూ జీవుల మనుగడకే ముప్పులా మారాయి. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి 1972 నుంచి పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించింది. ఈ క్రమంలో ప్రతిఏటా జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకోవాలని తీర్మానించింది.

నెల్లూరు (వైద్యం), జూన్ 4(ఆంధ్రజ్యోతి): నెల్లూరుతోపాటు కావలి, ఆత్మకూరు, కందుకూరు పట్టణాల్లో వాయు కాలుష్యం ఎక్కువగా ఉంది. 2021లో పర్ క్యూబిక్ మీటరుకు 27 మైక్రోగ్రాములు కాలుష్యం ఉండగా, 2023లో 130 మైక్రోగ్రాములుగా ఉంది. ప్రస్తుతం 52 మైక్రోగ్రాములు వాయు కాలుష్యం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. సాధారణంగా 60 మైక్రోగ్రాములు ఉండాలి. అయితే జిల్లాలో వాయు కాలుష్యం పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమే. కాగా జిల్లా పరిశ్రమలకు నిలయంగా మారుతోంది. ఒకప్పుడు కేవలం 10 లోపు పరిశ్రమలు ఉండగా, వాటిలో పర్యావరణ నిబంధనలు పాటించటంతో ఎలాంటి ముప్పు వాటిల్లలేదు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. తీరప్రాంతం మొత్తం పరిశ్రమల హబ్‌గా మారాయి. ముత్తుకూరు నుంచి రామయ్యపట్నం వరకు తీరం 80 కి.మీ విస్తరించి ఉంది.ఈ తీరంలో 13 కిలోమీటర్ల పరిధిలోనే పెద్దసంఖ్యలో థర్మల్ విద్యుత్ పరిశ్రమలు అందుబాటులోకి వచ్చాయి. ఆ పరిశ్రమల వల్ల 15 కిలోమీటర్ల పరిధిలో 2 నుంచి 5 వరకు డిగ్రీలు ఉష్ణోగ్రత పెరిగి పంటల దిగుబడి 30 శాతం తగ్గింది. థర్మల్ కేంద్రాల వేడి వల్ల సుమద్రంలోని వేల టన్నుల రొయ్యలు, చేపలు చనిపోయి మత్స్యకారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ఇక వాహన కాలుష్యం వల్ల కాలుష్యం వెదజల్లబడి జీవజాతుల మనుగడ కష్టతరంగా మారుతోంది.



కృష్ణపట్నంలో థర్మల్ పవర్ స్టేషన్లు వెదజల్లుతున్న కాలుష్యం



కాలుష్యం ఎక్కువగా ఉంది

జిల్లాలోని నగర, పట్టణాల్లో వాయు కాలుష్యం ఎక్కుగా ఉంది. సాధారణంగా క్యూబిక్ మీటరుకు 60 మైక్రోగ్రాములు కాలుష్యం ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 52కి చేరువలో ఉంది. ప్రతి పరిశ్రమలో 30 శాతం గ్రీన్ బెల్ట్ ఉండాలి. ఇందుకోసం మొక్కలు పెంచాలి. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలలో కూడా పర్యావరణంపై చైతన్యం తీసుకువచ్చేలా కృషిచేస్తున్నాం.

- అశోక్‌కుమార్, కాలుష్య నియంత్రణశాఖ ఈఈ

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి. పర్యావరణంపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. కుటుంబంలో ఒకరయినా ఓ మొక్కను నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి. ఇప్పటికే అనేక ప్రాంతాలలో పర్యావరణం దెబ్బతినటం వల్ల క్యాన్సర్, గుండెజబ్బులు, దగ్గు, ఆయాసం, ఉబ్బసం, ఊపిరితిత్తుల జబ్బులు, చర్మ వ్యాధులు వస్తున్నాయి. కాబట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణాన్ని కాపాడాలి.

- డాక్టర్ కాలేషా సాహెబ్, జేవీవీ, జిల్లా అధ్యక్షుడు, జీజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్

కాకాణితో వైసీపీ ఎంపీల ములాఖత్

11, 12 తేదీల్లో జగన్ నెల్లూరు రాక

నెల్లూరు (క్రైం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో బుధవారం రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి ములాఖత్ అయ్యారు. అనంతరం మిధున్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 11, 12 తేదీల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కాకాణిని పరామర్శించేందుకు నెల్లూరు సెంట్రల్ జైలుకు వస్తారని తెలిపారు. అక్రమంగా, అకారణంగా కాకాణిపై కేసులు పెట్టి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదని ప్రశ్నించడమే కాకాణి చేసిన తప్పన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ ఏదో జరిగిపోతుందని, భయభ్రాంతులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు. కాకాణి జైల్లో ఎంతో ధైర్యంగా ఉన్నారని , ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా భయపడేది లేదని ఆయన చెప్పారు. త్వరలోనే ఆయన జైలు నుంచి బయటకు వస్తారని ఆశిస్తున్నామన్నారు.



కసుమూరు దర్గాలో సంగీత దర్శకుడు 'కోటి'

వెంకటాచలం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కసుమూరు మస్తాన్ వలి దర్గాను మంగళవారం రాత్రి తెలుగు చలనచిత్ర సంగీత దర్శకుడు కోటి సందర్శించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆయనకు దర్గా ముజావర్లు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కొద్దిసేపు దర్గాలో కూర్చుని ప్రార్థనలు చేశారు. ఆయన వెంట దర్గా ముజావర్లు ఎంఎస్ మొహమ్మద్, ఎంఎస్ మున్నా తదితరులున్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

మనుబోలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడడం..నేరాలు చేసి జైలు కెళ్లడం...బెయిల్‌పై రావడం... మరల చోరీలు చేయడం ఆ యువకులకు అలవాటుగా మారింది. మనుబోలు, తదితర ప్రాంతాల్లో గడిచిన నాలుగునెలల్లో మోటార్ సైకిళ్ళ దొంగతనాలు చే స్తూ పోలీసులకు చుక్కలు చూపించారు. చివరకు మనుబోలు పోలీసులకు మంగళవారం చిక్కి ఊచలు లెక్కబెడుతున్నారు. పోలీసులు తమదైన శైలిలో వారిని విచారించి దొంగతనాలు చేసిన పది మోటార్‌సైకిళ్ళను రికవరీ చేశారు. దీనిపై బుధవారం పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి పీఎస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండలంలోని పిడూరు గ్రామానికి చెందిన యల్లంటి మౌళి అలియాస్ మౌళికృష్ణ గతంలో పలు చోరీలు చేసి జైలుకెళ్ళాడు. ఇదే తరహాలో కావలి రూరల్‌లోని బుడంగుంట కాలనీకి చెందిన షేక్ కలీం నేరాలు చేసి జైలు కెళ్ళాడు. వీరిద్దరికీ జైలులో సావాసం కుదిరింది. ఫిబ్రవరిలో బెయిల్‌పై ఇద్దరూ బయట కొచ్చారు. అప్పటినుంచి మరల చోరీలు చేయడం ఆరంభించారు. మనుబోలులో 7 మోటార్‌సైకిళ్ల, గూడూరు పట్టణం, కొడవలూరు, ఇందుకూరుపేటలో ఒక్కొక్కటి కలిపి మొత్తం పది మోటార్‌సైకిళ్ళు చోరీచేశారు. రాత్రి సమయంలో ఇంటిబయట, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న మోటార్‌సైకిళ్ళు గుర్తించడం, వాటిని మారుతాళాలు పెట్టి తీసి తస్కరించడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. ఇలా చోరీచేసిన మోటార్ సైకిళ్లను రెండు ప్రాంతాల్లో దాచి ఉంచారు. ఆరు మోటార్‌సైకిళ్ళు మౌళీ ఒక్కడే చోరీచేయగా, నాలుగు మోటార్ సైకిళ్ళు ఇద్దరూ కలిసి దొంగిలించారు. ఈ నేపథ్యంలో మంగళవారం వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఎస్ఐ శివరాకేష్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు యువకులు మోటార్‌సైకిళ్ళపై అటుఇటు తిరుగుతుండగా పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ కాబడిన మోటార్‌సైకిళ్ల వివరాలు వెలుగులోకి వచ్చాయి.

సంగీతంలో రాజు



కోయిల గానంలా తన వేణువుతో గీతాలను ఆలపిస్తాడు. కీబోర్డుతో సప్తస్వరాలు పలికించడమేకాదు.. ఎంతోమంది సంగీతప్రియులకు ఫ్లూట్, కీబోర్డు, గాత్ర సంగీతంపై శిక్షణ ఇస్తూ వేణుగాన మురళీమోహనుడుగా పేరుగడించాడు. నిరుపేద కుటుంబంలో జన్మించినా తన వేణుగానంతో ఎంతో మంది ప్రముఖుల చేత అవార్డులు, సన్మానాలు, సత్కారాలు పొంది కళామతల్లి ముద్దుబిడ్డగా సంగీత ప్రియులకు రాజా మాస్టర్‌గా ఎదిగాడు రావూరి గోవిందరాజు.

- పేద కుటుంబంలో జన్మించినా వేణుగానమే ఊపిరిగా..
- ఫ్లూట్, కీబోర్డు, గాత్ర సంగీతంపై పలువురికి శిక్షణ
- ఎందరో ప్రముఖుల నుండి అవార్డులు, సన్మానాలు.

ప్రతిభ PRATIBHA

కావలి రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కావలిలోని జనతాపేటలో ఉంటున్న గోవిందరాజు చిన్నప్పుడే వేణుగానంపై ఆసక్తి పెంచుకున్నాడు. తమిళనాడుకు చెందిన చిన్నయ్య, పాపమ్మ దంపతులకు ముగ్గురు సంతానంలో రెండవ కుమారుడు గోవిందరాజు. జీవనోపాధి కోసం గోవిందరాజు కుటుంబం తమిళనాడు నుంచి విజయవాడకు వలస వచ్చింది ఎస్ఎస్ఎల్‌సి వరకు చదివిన గోవిందరాజుకు చిన్నతనం నుంచి సంగీతంపై ఉన్న ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రుల ప్రోత్సాహం దక్కింది.

• శంకరాభరణం సినిమాతో..

శంకరాభరణం సినిమాతో సంగీతంపై మరింత మక్కువ పెంచుకున్న గోవిందరాజు విజయవాడలోని కోటేశ్వరరావు మ్యూజికల్ కళాశాలలో బ్రహ్మానందం, సుభద్ర గురువుల వద్ద నాలుగేళ్లపాటు గాత్ర సంగీతంపై శిక్షణ పొందారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పండిట్ హరిప్రసాద్ చౌరాసియా ప్రదర్శనల వీడియోలను ఆదర్శంగా తీసుకుని ఫ్లూట్ మాస్టర్ కోటేశ్వరరావు వద్ద మూడేళ్లపాటు వేణుగానంపై శిక్షణ తీసుకున్నారు. విజయవాడలోని ఓ షుమార్టులో పనిచేస్తూనే గాత్ర సంగీతం ఆధారంగా కీబోర్డులో సప్తస్వరాలు పలికిస్తూ తనకు తానే సాటి అనిపించుకుంటున్నారు.

• ఎన్నో అవార్డులు, సన్మానాలు

తెలుగు, తమిళ, హిందీ భాషల్లో వెయ్యి పాటలకుపైగా గానం చేసి ఫ్లూట్, కీబోర్డు వాయిద్యాలతో ఎందరో ప్రముఖుల నుంచి అవార్డులు, సన్మానాలను అందుకున్నారు. అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత తదితర ప్రముఖుల చేతులమీదుగా అనేక అవార్డులు, బహుమతులు తీసుకున్నారు.

• కళావతి మ్యూజికల్ స్కూల్ ఏర్పాటు

నిరుపేద అయిన గోవిందరాజు బతుకుజీవుడా అంటూ పొట్టకూటి కోసం సుమారు 20 సంవత్సరాల క్రితం కావలి వలస వచ్చాడు. ఓ ప్రైవేటు కళాశాలలో రెండేళ్లపాటు సంగీతం మాస్టర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత ఒక ప్రైవేటు కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేశాడు. కళాకారుడిగా పేరు తెచ్చుకున్నా నిత్య విద్యార్థిలా నిరంతరం కఠోర శ్రమ తో నూతన ఒరవడికలను సృష్టిస్తున్నారు. శాస్త్రీయసంగీతం ఆధారంగా అన్నమాచార్య కీర్తనలు, సినీ మధురగీతాలు, క్రైస్తవ భక్తిగీతాలను ఆలపిస్తున్నారు. సంవత్సర కాలం పట్టే మ్యూజిక్ కోర్సులను 6 నెలల్లో సంగీత ప్రియులకు నేర్పిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు.





కీబోర్డు, ఫ్లూట్ వాయిద్యాలలో శిక్షణ ఇస్తున్న గోవిందరాజు

ఆ డబ్బులు ఎక్కడివి.. ఎవరివి!?

- బీజీసీ క్యాపిటల్ ట్రేడింగ్‌లో రూ.80 లక్షల గల్లంతు
- బాధితుడు ఓ రాజకీయ నాయకుడి వద్ద గుమాస్తా
- అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు

నెల్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): బీజీసీ క్యాపిటల్ అనే బోగస్ ట్రేడింగ్ ప్లాట్‌ఫాంలో లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి జి.మస్తాన్ అనే వ్యక్తి మోసపోయాడు. దీనిపై మార్చిలో సైబర్ క్రైంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ దర్యాప్తు రెండు కోణాల్లో జరుగుతున్నట్లు సమాచారం. మోసం చేసిన బోగస్ ట్రేడింగ్ ప్లాట్‌ఫాంతోపాటు ఇంత డబ్బులు బాధితుడికి ఎలా వచ్చాయి, నిజంగా ఆ డబ్బులు ఆయనవేనా, లేక మరెవరికైనా బినామీగా వ్యవహరించారా!? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. వెంకటాచలం మండలానికి చెందిన జి.మస్తాన్ ఒక మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత ప్రసన్న కుమార్ రెడ్డి వద్ద కొంతకాలం గుమాస్తాగా పనిచేశారు. అధిక లాభాలు వస్తాయన్న ఆశతో బీజీసీ అనే ట్రేడింగ్ ఆన్‌లైన్ యాప్‌లో మస్తాన్ పెట్టుబడి పెట్టారు. 2024, డిసెంబరు నుంచి 2025, మార్చి వరకు దశల వారీగా పెట్టుబడి పెడుతూ వచ్చారు. మార్చి 8వ తేదీ వరకు ఈ ట్రేడింగ్ యాప్‌లో 80 లక్షలకు పైగా పెట్టుబడులు పెట్టారు. డబ్బులు పెట్టడమే తప్ప తిరిగి రాకపోవడంతో సైబర్ పోలీసులను ఆశ్రయించారు. అప్పట్లోనే సైబర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసు రెండు వైపుల నుంచి దర్యాప్తు జరుపుతున్నట్లు సమాచారం. ఒక సాధారణ వ్యక్తి కేవలం మూడు నెలల్లో రూ.80 లక్షలు ఎలా పెట్టుబడిగా పెట్టగలిగారు, ఆ డబ్బులు ఇతనివేనా లేదా మరెవరికైనా బినామీగా వ్యవహరించారా..!? అనే కోణంలో దర్యాప్తు మొదలైనట్లు తెలిసింది.

రూ. 43 వేల కోట్లు దోచేసిన జగన్

- దొంగల పార్టీగా వైసీపీ
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



నెల్లూరు (వైద్యం) జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ దొంగల పార్టీగా మారిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. కృష్ణపట్నం ఆనందయ్య ఆయుర్వేద మందు కేసుకు సంబంధించి నెల్లూరు రైల్వేకోర్టులో బుధవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. జగన్ అధికారంలో ఉండగా తనపై అక్రమంగా 18 కేసులు పెట్టారన్నారు. జగన్మోహన్‌రెడ్డి వెన్నుపోటుదినంగా నిర్వహించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వెన్నుపోటు అనే పేరు ఎత్తే అర్హత వైసీపీకి లేదని ఎద్దేవా చేశారు. తన తండ్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ. 43 వేల కోట్ల అవినీతికి పాల్పడిన ముద్దాయిగా జగన్మోహన్‌రెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఒక్కఛాన్సు అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ఏపీ ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. కల్తీ మద్యం పోసి వేలాది మంది ప్రాణాలు బలితీసుకున్నాడని, లక్షల మంది మంచానికే పరిమితమయ్యారని విమర్శించారు. సిట్ విచారణలో ఇప్పటి వరకు లిక్కర్ స్కామ్ రూ. 3,200 కోట్లు అని తేల్చారన్నారు. చివరకు గంజాయి బ్యాచ్ రౌడీషీటర్లను పరామర్శించి ప్రజలకు ఏమి సందేశం ఇస్తారని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత పార్టీ ఎంపీ రఘురామకృష్ణరాజును పోలీసులతో 121 దెబ్బలు కొట్టించి దీన్ని వీడియో కాల్‌లో చూసి ఆనందించిన సైకో జగన్ అన్నారు. వైసీపీ హయాంలో చచ్చిపోయిన ప్రజాస్వామ్యాన్ని సర్వనాశనమైతే ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ గాడిలో పెడుతున్నారని సోమిరెడ్డి తెలిపారు.

భానుడి ప్రకోపం...

పక్షులకేమో తాపం

రెండురోజులుగా భానుడు భగభగ నిప్పులు కక్కుతున్నాడు. తన ప్రకోపాన్ని రోహిణికార్తె ప్రారంభంలో చూపకపోయినా బుధవారం జనాలకు చమటలు పట్టించాడు. జనాలతోపాటు భానుడి వేడికి పక్షులు తట్టుకోలేకపోతున్నాయి. ఎక్కడ నీరు దొరుకుతుందోనని పరుగులు తీస్తున్నాయి. బుధవారం మనుబోలు సచివాలయం-2 వద్ద వృథాగా పోతున్న నీటిధార కాకులు, పావురాలు గుర్తించి దాహార్తి తీర్చుకున్నాయి.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)



ఈ నీటిని ఎలా తాగలబ్బా ... ఆలోచిస్తున్న పావురాలు



పైపులోంచి వచ్చే నీటిని తాగుతున్న కాకి

బాలు చనిపోలేదు.. అందరి హృదయాల్లో ఉన్నారు!

- బాలు అవార్డు గ్రహీత, సినీ గేయని రమణ

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం భౌతికంగా దూరమైనా పాట, మాట, చిత్రాల ద్వారా మన అందరి హృదయాల్లో చిరంజీవిగా ఉన్నారని జాతీయస్థాయి బాలు అవార్డు గ్రహీత, మధుర గాయని బీ. రమణ అన్నారు.బుధవారం రాత్రి నగరంలోని పురమందిరంలో పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి వేడుకలు జరిగాయి. బాలు అవార్డు అందుకున్న రమణ మాట్లాడుతూ తాను, బాలు 1963లో ఆంధ్రా క్లబ్ చెన్నైలో లలిత సంగీత పోటీల్లో పాల్గొన్నామని, అప్పటి నుంచి ఆయనతో పరిచయమని తెలిపారు.ఆయనతో వేలాది సంగీత కచేరీలు, పలు చలనచిత్రాలలో పాటలు పాడానని తెలిపారు. ఆయనతో కలిసి పాటలు పాడాలంటే అంతా చాలా భయపడేవారమని తెలిపారు. ఆయన వద్ద గాయకులు ఎంతో నేర్చుకున్నారని తెలిపారు. 2020లో ఆయన మరణవార్త విని ప్రపంచమే మూగబోయిందని, ఆయన గురించి ఇక ఏమని మాట్లాడగలనని తెలిపారు. సినీ నటుడు శుభలేక సుధాకర్ మాట్లాడుతూ బాలును అభిమానులు ఎన్నో పేర్లతో పిలుస్తారని, తాను మాత్రం అప్పటికీ, ఇప్పటికీ సార్. అని పిలుస్తానని తెలిపారు. బాలు పేరుమీద ఆయన జయంతి రోజున ఇచ్చే జాతీయ అవార్డుకు తాను, తన సతీమణి శైలజ బాధ్యతగా హాజరవుతామని తెలిపారు. బాలసుబ్రహ్మణ్యం సోదరి ఎస్పీ శైలజ మాట్లాడుతూ అన్న బాలసుబ్రహ్మణ్యంతో కలిసి పాటలు పాడే అవకాశం తనకు సన్మాన గ్రహీత బీ.రమణ ద్వారానే అవకాశం వచ్చిందన్నారు. రమణకు పురస్కారం ఇచ్చినందుకు ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక వారు నిర్వహించించారు. ఈ సందర్భంగా చిన్నారుల సంగీత విభావరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో మాపూరి శ్రీనివాసరావు, మద్దాళి రఘురామ్, ఎంవీ నారాయణ మూర్తి, వీరిశెట్టి హజరత్ బాబు, ఎన్.బలరామయ్య నాయుడు, జీవీ మురళీ, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని చేతన కార్యవర్గం వై.శేషగిరీశం, డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, బెనర్జీ, ఎస్.సుబ్బారావు, ఆదిశేషు, వైవీ.విశ్వనాథం, నారాయణ స్వామి, తదితరులు పర్యవేక్షించారు.